epaper.vaartha.com
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

14-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 103 పేజీలు: 10+4 వెల: 6.50
హైదరాబాద్
: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



## 'మద్దతు' పెంపు

**వరికి రూ.72 మేర పెంచి**
**రూ.2441గా కేంద్ర కేబినెట్ నిర్ణయం**
**జొన్నలు క్వింటాకు రూ.4,023** 2

కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ తదితరులు కూడా తగ్గింపు

కాన్వాయ్‌లు తగ్గించిన బిజెపి రాష్ట్రాల సిఎంలు 5

## ప్రధాని కాన్వాయ్ కుదింపు



ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

## చమురు ధరలు పెంచక తప్పదు!

వాణిజ్యంలో



## వరంగల్, కరీంనగర్, ఖమ్మంకు
# ఔటర్ రింగ్ రోడ్లు

**నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్**

**సింగరేణి సిఎస్‌ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి**

**టూరిజం, టెంపుల్ మెగా కారిడార్లపై సిఎం రేవంత్ సమీక్ష**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే13:** ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్‌లకు ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. అవసరమైన ఎస్టీపీలు డిజైన్ చేయాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎయిర్‌పోర్టులను దృష్టిలో ఉంచుకొని రోడ్ల పనులు చేపట్టాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో సాంకేతికతను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఖర్చు తగ్గించుకోవడానికి ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలని సూచించారు. లీజ్‌కు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే ఉండాలని స్పష్టం చేశారు.సిఎం రేవంత్‌రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో మెగాగ్రోత్ కారిడార్‌పైన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎంఒ కార్యదర్శి మాణిక్ రాజ్, తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ దేవేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అర్బన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్స్, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు అర్బన్ ప్లానింగ్‌లో తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పట్టణాలు, నగరాల్లో రేడియేషన్ తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రతి చోట స్మార్ట్‌పోల్స్ ఏర్పాటు చేయాలని >>2




## 'బల'వంతుడు
# విజయ్

**విశ్వాస పరీక్షలో అన్నా డిఎంకె రెబెల్స్ సహా మొత్తం 144 మంది మద్దతు**

**సభనుంచి డిఎంకె వాకౌట్**

**చెన్నై, మే 13:** తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన సూపర్‌స్టార్ విజయ్, ముఖ్యమంత్రిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన నాటకీయ విశ్వాస పరీక్షలో దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం సునాయాసంగా గట్టెక్కింది. ఈ బలపరీక్షలో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా144 మంది శాసన >>2



## 'నీట్' సెగలు

**లీకేజీపై సిబిఐ దర్యాప్తు వేగవంతం** 2
**ప్రధాన నిందితుడు కైర్నార్, 15మంది అరెస్టు**
**నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి: తమిళ సిఎం విజయ్**



హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల నేతలు

## బిగుస్తున్న ఉచ్చు

**పోలీసు విచారణకు బండి భగీరథ్ గైర్హాజర్**
**అతడికోసం గాలిస్తున్న పోలీసులు**
**శుక్రవారం విచారణకు వస్తానని లేఖ** 7

## దడ పుట్టిస్తున్న నేపాలీ ముఠా



2

**హైదరాబాద్‌లో వరుస దోపిడీలతో టెన్షన్**

**తాజాగా ఓ ప్రొఫెసర్ దంపతులను బంధించి డైమండ్ నెక్లెస్, 70 తులాల బంగారం, 20 కిలోల వెండి చోరీ**





మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# 'నీట్' సెగలు

## లీకేజీపై సిబిఐ దర్యాప్తు వేగవంతం

## ప్రధాన నిందితుడు కైర్నార్, 15మంది అరెస్టు

### ఓ విద్యార్థి చేతికి గెస్ ప్రశ్నపత్రం రూపంలో క్వశ్చన్ పేపర్

### నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలన్న తమిళ సిఎం విజయ్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-2026 ప్రశ్నాపత్రం లీకేజీ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో సిబిఐ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్టు చేసి విచారణను కొనసాగిస్తోంది. పేపర్ లీకేజిలో మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన 30 ఏళ్ల వైద్య విద్యార్థి శుభం కైర్నార్ కీలక నిందితుడని తేల్చింది. ఆయనతోపాటు 15మందిని ఈ కేసులో సిబిఐ అరెస్టు చేసింది. వీరిలో పేపర్ లీకేజికి మాస్టర్ మైండ్‌గా భావిస్తున్న మనీష్ యాదవ్, రాకేష్ మండవారియా ఉన్నారు. పరీక్షకు 45 గంటల ముందే ప్రశ్నాపత్రం డిజిటల్ రూపంలో బయటకు వచ్చినట్టు అధికారులు గుర్తించారు. ప్రధాన నిందితులు శుభం కైర్నార్, మంగీలాల్, వికాస్, దినేష్, యెష్ యాదవ్ అరెస్టయ్యారు. వీరిలో ముగ్గురిని జైపూర్‌లో, ఇద్దరిని గురుగ్రామ్‌లో అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు శుభం కైర్నార్ పూణెకు చెందిన ఓ విద్యార్థి నుంచి రూ.10లక్షలకు కొనుగోలు చేసి హార్యానకు చెందిన ఓ వ్యక్తికి రూ.15లక్షలకు విక్రయించినట్లు సిబిఐ దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత అతడు నీట్ పేపర్‌ను టెలిగ్రామ్, ఎన్‌క్రిప్టెడ్ మెసెజింగ్, షాడో సర్వర్‌ల ద్వారా పంపిణీ చేసినట్టు సీబిఐ గుర్తించింది. మరోవైపు నీట్ పరీక్షకు ముందే గెస్ పేపర్ పేరుతో రాజస్థాన్‌లోని సికారుకు చెందిన ఓ హాస్టల్ యజమానికి పేపర్ పీడీఎఫ్ చేరడం ఈ కేసులో కీలక ఆధారంగా మారింది. పరీక్ష అనంతరం గెస్‌పేపర్‌తో అసలు పరీక్ష పత్రాన్ని అధ్యాపకులు పోల్చి చూడగా కెమిస్ట్రిలో 40 ప్రశ్నలు, బయాలజీలో 90 ప్రశ్నలు సరిపోలినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీకేజీలో కోచింగ్ సెంటర్లు, మధ్యవర్తుల ప్రమేయంపై సిబిఐ దర్యాప్తును వేగవంతం చేసింది. అదే సమయంలో నీట్ యుజి -2026 ప్రశ్నాపత్రాన్ని పరీక్షకు వారం రోజుల ముందు రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు సోదరులు ఓ వైద్యుడి నుంచి కొనుగోలు చేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. రాజస్థాన్‌లోని జమ్వా రామ్‌గడ్ ప్రాంతానికి చెందిన సోదరులు మంగీలాల్, దినేశ్ బివాల్ నీట్ ప్రశ్నాపత్రాన్ని ఎప్రిల్ 26న గురుగ్రామ్‌కు చెందిన వైద్యుడి నుంచి కొనుగోలు చేసినట్టు స్థానిక పోలీసులు గుర్తించినట్టు సమాచారం. ఆ సోదరుల్లో ఒకరి కుమారుడు నీట్ పరీక్ష కోసం సిద్ధమవుతుండగా పేపర్‌ను అతడికి పంపించారు. అనంతరం ఏప్రిల్ 29న ప్రశ్నాపత్రాన్ని వీరు కొంతమందికి విక్రయించినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై కూడా సిబిఐ దృష్టి కేంద్రీకరించింది. కాగా.. ఒక హాస్టల్ నిర్వాహకుడు, కెమిస్ట్రీ అధ్యాపకుడు కలిసి చేసిన ఫిర్యాదుతోనే ప్రశ్నాపత్రం లికెజి వ్యవహారం బహిర్గతమైందని తేలింది. నీట్‌పరీక్షకు ముందు రోజు రాత్రే రాజస్థాన్‌లోని సికార్‌కు చెందిన ఓ విద్యార్థికి (ప్రస్తుతం కేరళలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు.) అతడికి స్నేహితుడి నుంచి పీడీఎఫ్ రూపంలో గెస్ పేపర్ వచ్చింది. అందులో ఉన్న ప్రశ్నలు అసలు పరీక్షకు ఉపయోగపడవచ్చని భావించిన ఆ విద్యార్థి దాన్ని వెంటనే తన తండ్రికి పంపించాడు. ఆ విద్యార్థి తండ్రి సికార్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నాడు. మరుసటి రోజు ఉదయం ఆ ఫైల్‌ను పరిశీలించిన ఆయనకు అనుమానం రావడంతో తనకు పరిచయం ఉన్న కెమిస్ట్రీ అధ్యాపకుడిని సంప్రదించాడు. అప్పటికే దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రారంభమైంది. పరీక్ష ముగిసిన తర్వాత అసలు ప్రశ్నపత్రాన్ని తీసుకుని ఆ అధ్యాపకుడు ముందుగా వచ్చిన మరోసారి పీడీఎఫ్‌తో పోల్చి చూశాడు. అందులో దాదాపు 108 ప్రశ్నలు ఒకేలా ఉండటం చూసి హాస్టల్ నిర్వహకుడు, కెమిస్ట్రి అధ్యాపకుడు ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. ముఖ్యంగా బయాలజీ విభాగంలోనూ పెద్ద సంఖ్యలో ప్రశ్నలు మ్యాచ్ కావడంతో ఇది సాధారణ గెస్ పేపర్ కాదని గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించినా మొదట కేసు నమోదు చేయలేదని సమాచారం. ఆ తర్వాత హాస్టల్ యజమాని, కెమిస్ట్రీ టీచర్ కలిసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి పూర్తి వివరాలతో మెయిల్ పంపించారు. ఈ ఫిర్యాదు తర్వాతే కేంద్ర సంస్థలు అప్రమత్తమయ్యాయి.

ఈ ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న ఎన్‌టీఏ, దర్యాప్తులో భాగంగా ఇంటెలిజెన్స్ బ్యూరో సహాయం కోరింది. వారి సూచనలతో రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ) విచారణ ప్రారంభించింది. విచారణలో ప్రశ్నపత్రం ముందుగానే కొందరి చేతుల్లోకి వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. అయితే ఈ వ్యవహారాన్ని బయటపెట్టిన హాస్టల్ నిర్వాహకుడు, అతని కుమారుడు, అలాగే కెమిస్ట్రీ అధ్యాపకుడి వివరాలను అధికారులు రహస్యంగా ఉంచారు. ప్రస్తుతం వీరికి ప్రత్యేక రక్షణ కల్పించినట్లు తెలుస్తోంది.

నీట్ పేపర్ లీకేజి దర్యాప్తులో భాగంగా రాజస్థాన్‌లోని జమ్వా రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ అనే ఇద్దరు సోదరుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరు ఏప్రిల్ 26న గురుగ్రామ్‌కు చెందిన ఓ వైద్యుడి నుంచి ప్రశ్నపత్రాన్ని డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరి కుమారుడు నీట్‌కు సిద్ధమవుతుండటంతో ముందుగా అతడికి ఆ పేపర్ అందించారు. అనంతరం అదే ప్రశ్నపత్రాన్ని మరికొందరికి విక్రయించినట్లు విచారణలో తేలింది. బిహార్, హారియాణా, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాలకు కూడా లీక్ అయిన నీట్ ప్రశ్నాపత్రం చేరినట్లు అనుమానిస్తున్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజిపై దేశవ్యాప్తంగా వివాదం చెలరేగడంతో నీట్ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

**నీట్‌ను మొత్తానికే రద్దు చేయండిః తమిళనాడు సిఎం విజయ్**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజి వ్యవహారంపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా సనపందించారు. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజి (నీట్-యూజి)ని మొత్తానికే రద్దు చేయాలని సంచలన డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు లాంటివి వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు.. బిజెపి అధికారంలో ఉన్న యూపి, హార్యాన, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోనే లీకైన పేపర్ పెద్ద సంఖ్యలో విద్యార్థులకు చేరిందని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఔటర్ రింగ్ రోడ్లు

>> ఆదేశించారు. ఆయా నగరాలు, పట్టణాల జనాభా తగినట్లు స్థానికంగా డిజైన్ చేసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపైన ఏఐ వినియోగంపైన సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. సీవరేజ్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి శుద్ధి చేసిన నీటినే భవన నిర్మాణాల్లో వాడేలా నిబంధన పెట్టాలని ఆదేశించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు కావాల్సిన నీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని నిర్దేశించారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా చేయాలని దిశానిర్దేశం చేశారు.

సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్ట్‌లను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్తగూడం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలని అన్నారు. రేడియల్ రోడ్లు పెద్ద మున్సిపాలిటీలకు సమీపంలో ఉండేలా డిజైన్ చేయాలని ఆదేశించారు. వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా డిజైన్ చేయాలని సూచించారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ భవిష్యత్తు తెలంగాణకు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ఎయిర్‌పోర్ట్ రాకతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని వివరించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ డిఫెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతుందని చెప్పుకొచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్‌పోల్స్, రోడ్ల, ఎస్‌టీపీలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వంటి అంశాలపైన ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు పోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## వారం - వర్జ్యం

14-05-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
ద్వాదశి ఉ.11.16
రేవతి రా.10.29
వర్జ్యం : ఉ.11.21-మ.12.50
దు.ఉ.9.55-ఉ.10.47,
2)మ.3.04-మ.3.56
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** స్వజనుల వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. ఎవ్వరినీ ఎదిరించకుండా సర్దుకుపోతారు.

**వృషభం:** ఆశలు, ఆశయాలు అంటూ కలలో విహరించకుండా వాస్తవికతకు ప్రామాణికంగా నడుచుకుంటారు.

**మిథునం:** ఎంతో శ్రమ చేసి కొద్దిపాటి గుర్తింపు పొందుతారు. లాభనష్టాలు సరి సమానంగా ఉంటాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** ఋణాలు చేయకపోవటమే పొదుపుగా భావిస్తారు. వ్యాపారంలో స్తబ్ధత నెలకొంటుంది. నూతన విద్యావకాశాలు.

**సింహం:** నైతిక విలువలకు ప్రాధాన్యత నిచ్చి ధర్మబద్ధంగా నడచుకుంటారు. నూతన ప్రయత్నాలు నిదానంగా నెరవేరుతాయి.

**కన్య:** మిమ్ములను రెచ్చగొట్టాలని మీ శత్రువర్గం చేసే యత్నాలు ఫలించవు. ప్రముఖులను కలిసి ముఖ్యమైన విషయాలు చర్చిస్తారు.

**తుల:** అరుదైన ఆహ్వానాలు అందు కుంటారు. సోదరులకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. ఆస్తి వివాదాలు తీరుతాయి. బంధువులకలయిక.

**వృశ్చికం:** దూరపు కొండలు నునుపు అనునట్లు చేతిలోని అవకాశాలు కన్నా స్థాయికి మించిన వాటి గురించి ప్రయత్నించి భంగపడతారు.

**ధనుస్సు:** తాత్కాలికంగా దూరమైన ఓ వర్గంతో తిరిగి సఖ్యతను ఏర్పరచు కుంటారు. విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు.

**కుంభం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు కలిసి వస్తాయి.

**మీనం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఉద్యోగాలలో నూతన బాధ్యతలు చేపట్టవలసి వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దడ పుట్టిస్తున్న నేపాలీ ముఠా

## హైదరాబాద్‌లో వరుస దోపిడీలతో టెన్షన్

### తాజాగా ఓ ప్రొఫెసర్ దంపతులను బంధించి డైమండ్ నెక్లెస్, 70 తులాల బంగారం, 20 కిలోల వెండి చోరీ



జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూర్‌లో నేపాలీ దొంగల ముఠా బాధితుడు ప్రొ. ఎన్.మురళీమోహన్

**జవహర్ నగర్, మే 13, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో నేపాలీ గ్యాంగ్‌లు వరుసగా పాల్పడుతున్న నేరాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే సతీమణి హత్య, దోపిడీ ఘటన మరువకముందే, కేవలం కొన్ని రోజుల తేడాలో తాజాగా మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో మరో నేపాలీ ముఠా జరిపిన భారీ దోపిడీ కలకలం రేపింది. కౌకూరులో నివాసం ఉంటున్న రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), ఆయన భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) వద్ద నేపాల్‌కు చెందిన రాజేష్, సబీనా జంట పనిలో చేరింది. పుట్టినరోజు వేడుకల నెపంతో మురళీధర్ దంపతులను నమ్మించిన ఈ ముఠా, మరో ముగ్గురిని ఇంటికి పిలిపించి వేడుకల హడావుడి చేసింది. ఈ క్రమంలో దంపతులకు మత్తుమందు కలిపిన ఆహారాన్ని తినిపించి, వారు స్పృహ కోల్పోయిన తర్వాత బెడ్‌రూంకు తీసుకువెళ్లి చేతులు కట్టేసి పడేశారు. ఆ తరువాత ఇంట్లోని బంగారం, వెండి, నగదుతో పాటు విలువైన వస్తువులను దోచుకుని పారిపోయారు. మేడ్చల్ జిల్లా జవహనగర్ పరిధి లోని కౌకూరు గల్ఫ్ ఎన్‌క్లేవ్ లో ఈ సంఘటన జరిగింది. జవహర్ నగర్ పోలీసుల, బాధితుల కథనం ప్రకారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యాప్రాల్ కౌకూర్ గల్ఫ్ ఎన్‌క్లేవ్ లో. ఐఐటి విశ్రాంత నిలయంలో ప్రొఫెసర్ ఎన్ మురళీమోహన్, డాక్టర్ విజయలక్ష్మి నివాసం ఉంటున్నారు. వారి ఇంట్లో 13 రోజుల క్రితం ఏజెంట్ ద్వారా నేపాలి మహిళను పనిలో పెట్టుకున్నారు. ఈ నెల 11వ తేదీన మహిళ పుట్టిన రోజు పేరుతో దంపతులను నమ్మించింది. రాత్రి 10 గంటలకు గల్ఫ్ ఎన్‌క్లేవ్ గేట్ దగ్గర ఉన్న సెక్యూరిటీతో నేపాలి ముఠా చెప్పి ముగ్గురు ఇంట్లోకి చొరబడి ప్రొఫెసర్ దంపతులతో కేకు కొనిపించుకున్నారు. నేపాలి మహిళా పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్నట్టు నటించారు. ఆ ముఠా ఇంటి గేట్లకు తాళాలు వేసి సీసీ కెమెరాలను మొత్తం ధ్వంసం చేసి దంపతులు ఇద్దరిని బెదిరించి కొట్టడానికి ప్రయత్నించారు. గత్యంతరం లేక దంపతులు చేతులు జోడించి మమ్ములని ఏమి చేయకండి మీకేం కావాలో అవి తీసుకోండి అని వేడుకున్నారు. అయినప్పటికీ వారికి మత్తుమందు ఇచ్చి రూములో బంధించి వారిని తాళ్లతో చేతులు కాళ్ళు కట్టేసి ఆ ముఠా వారి ఇంట్లో ఉన్నటువంటి డైమండ్ నెక్లెస్, 70 తులాల బంగారం, 30 వేల రూపాయల నగదు అపహరించుకొని పారిపోయారు. అయితే మంగళవారం మధ్యాహ్న సమయంలో ఆ ఇంట్లో కిటికీ నుంచి కేకలు. అరుపులు ఓ వ్యక్తి విని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే పోలీసులు రంగంలోకి విచారణ ప్రారంభించారు. ఈ ముఠాలో మొత్తం పనిమనిషి, ఆమె భర్త తో పాటు మరో ఐదుగురు ఈ చోరికి పాల్పడినట్లు గుర్తించారు. అయితే ఈ ముఠా పోలీసులకు పట్టుబడినాట్లు సమాచారం. పోలీసులు మాత్రం ఆ ముఠా పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు. పనిమనిషి సబీనా అని నేపాల్ కి చెందిన మహిళ గతంలో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనర కేసులో జైలుకు పోయి ఇక్కడికి వచ్చి పేరు మార్చుకొని మళ్లీ యధావిధిగా దొంగతనాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బాదుగుల సుమతి రంగంలోకి దిగి గల్ఫ్ ఎన్‌క్లేవ్ ను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని సుమతి బాధితులకు భరోసా ఇచ్చారు. నిందితులను పట్టుకోవడానికి నాలుగు బృందాలను రంగంలోకి దిగినట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఈ ఘటన జరిగితే రెండవ రోజు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాలకు స్పృహలోకి వచ్చిన ప్రొఫెసర్ మురళీమోహన్ అరుపుల శబ్దం విని లక్ష్మణ్ అనే వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా ప్రొఫెసర్ మురళీమోహన్ చిన్నగా అరుపులు అరవడంతో వారి చేతులకు కట్టేసినటువంటి తాళ్ళను విడిపించాడు. బంగారం, వెండి, నగదు చోరీ చేసి పారిపోయిన ముఠా కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. జవహర నగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై మల్కాజిగిరి సిపి సుమతితో పాటు డీసీపీ, ఏసీపీ, సంఘటన స్థలన్ని సందర్శించి పరిశీలిచారు.



హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లా మనాలిలో బుధవారం బియాస్ నదిలో రివర్ రాఫ్టింగ్ చేస్తున్న పర్యాటకులు

# 'మద్దతు' పెంపు

## వరికి రూ.72 మేర పెంచి రూ.2441గా కేంద్ర

## కేబినెట్ నిర్ణయం.. జొన్నలు క్వింటాకు రూ. 4,023

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రధాని మోదీ అద్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో 2026-27 పంటల మద్దతు ధరల విషయమై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ నిర్ణయించారు. వరి ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర రూ. రూ.2,441 గా నిర్ణయించారు. వరి ఏ గ్రేడ్ కు రూ. 2,461గా మద్దతు ధరను నిర్ణయించారు. మరోవైపు క్వింటాల్ జొన్నల మద్దతు ధరను కూడా కేంద్ర ప్రభుత్వం పెంచింది. క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.4,023గా ప్రకటించారు. క్వింటాల్ సజ్జలకు కనీస మద్దతు ధర రూ. 2,900 గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు పండించిన పంటలకు లాభదాయకమైన ధరలు అందేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం 2026-27 మార్కెటింగ్ సీజన్ కోసం ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను పెంచింది. ఖరీఫ్ పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రూ.2.6 లక్షల కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. అగ్రికల్చర్ కాస్ట్ ప్రైసెస్ కమిషన్ సిఫార్సుల మేరకు వివిధ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఈ క్రమంలోనే క్వింటా వరికి కనీస మద్దతు ధరను రూ.72 పెంచి రూ.2,441 చెల్లించాలని నిశ్చయించింది. క్వింటా జొన్న కనీస మద్దతు ధరను రూ.4,023కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వరి, జొన్నతోపాటు జొన్నలు (మల్దండి) కనీస మద్దతు ధర రూ.4,073కు, క్వింటా సజ్జల కనీస మద్దతు ధర రూ.2900కు, క్వింటా రాగుల కనీస మద్దతు ధర రూ.5,205కు, క్వింటా మొక్కజొన్నల కనీస మద్దతు ధర రూ.2,410గా, క్వింటా కందుల కనీస మద్దతు ధర రూ.8,415గా, క్వింటా పెసల కనీస మద్దతు ధర రూ.8,780గా, క్వింటా మినుముల కనీస మద్దతు ధర రూ.8,200, క్వింటా పత్తి (మధ్యశ్రేణి) కనీస మద్దతు ధర రూ.8,267గా, క్వింటా పత్తి (దీర్ఘ శ్రేణి) కనీస మద్దతు ధర రూ.8,667గా, క్వింటా పల్లి కనీస మద్దతు ధర రూ.7,517గా, క్వింటా ప్రొద్దుతిరుగుడు విత్తనాల కనీస మద్దతు ధర రూ.8,343కు, క్వింటా సోయాబీన్ (ఎల్లో) కనీస మద్దతు ధర రూ.5,708గా కనీస మద్దతు ధరను నిర్ణయించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఏడాదికి 824.41 లక్షల మిలిటన్ టన్నుల పంట సేకరణ చేస్తున్నామన్నారు. పంట ఖర్చుకు అదనంగా 50 శాతం కనీస మద్దతు ధరగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 2014-26 మధ్య ఖరీఫ్ పంటలకు రూ.19 లక్షల కోట్ల కనీస మద్దతు ధర చెల్లించామని వెల్లడించారు. 2014- 26 మధ్య 8,746 లక్షల మిలిటన్ టన్నుల ఖరీఫ్ పంట సేకరించామని పేర్కొన్నారు. యూపీఏ హయాంలో కంటే నాలుగు రెట్లు అధికంగా రైతులకు మోది ప్రభుత్వం ఖరీఫ్ కనీస మద్దతు ధర చెల్లింపులు చేస్తోందన్నారు.

**తెలంగాణ రైతులకు ఊరట...**

పంట దిగుబడుల కనీస మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో తెలంగాణ రైతులకు ఊరట కలగనుంది. రానున్న ఖరీఫ్ సీజన్ నుండి పెంచిన కనీస మద్దతు ధరల ప్రయోజనం రైతులకు అందనుంది. రాష్ట్రంలో ప్రధానంగా వరి, పత్తి పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. రాష్ట్రంలో ఖరీఫ్‌లతో 60లక్షల ఎకరాకు మించి, రబిలో దాదాపు 60లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగవుతోంది. ఇక 50లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధర పెరగడంతో వరి, పత్తి పంట సాగు చేసే రైతులకు మేలు చేకూరనుంది. ఇప్పటి వరకు వరికి కనీస మద్దతు ధర వరి సాధారణ రకానికి క్వింటా రూ.2369 ఉండగా, ఎ గ్రేడ్ రకానికి రూ.2389గా ఉంది. ఇరు రకాల వరిపై రూ.72 మేర తాజాగా కేంద్ర ప్రభుత్వం పెంచింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో వరి పండించే రైతులకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3వేలకు చేరువకానుంది. ఇక రాష్ట్రంలో విస్తారంగా సాగయ్యే పత్తి ధరను క్వింటాకు రూ. 557 మేర పెంచారు. కాగా.. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు కందుల ధరను క్వింటాల్‌కు రూ.8000 నుండి రూ.8,450కు, పెసర ధరను రూ.8768 నుండి రూ. 8,780కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా నూనె గింజల సాగు చేసే రైతులకు ఈసారి భారీ ఊరట లభించింది. పొద్దుతిరుగుడు విత్తనాల ధరను అత్యధికంగా క్వింటాల్‌కు రూ.622 పెంచగా, నువ్వుల ధరపై రూ.500 పెంపును ప్రకటించారు. ముతక ధాన్యాల సాగును ప్రోత్సహించాలన్న సంకల్పంలో భాగంగా సజ్జల ధరను రూ.2,900 కు, మొక్కజొన్న ధరను రూ.2,410 కు , రాగుల ధరను రూ.5,205 కు పెంచారు.

# 'బల'వంతుడు విజయ్

>> సభ్యులు మద్దతుపలకగా, 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. మరో ఐదుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గతనెల జరి గిన ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి అధికార పీఠం దక్కించుకున్న విజయ్, ఈ విశ్వాస పరీక్షతో తన ప్రభు త్వాన్ని నిలబెట్టుకున్నారు. ఈ ఓటింగ్‌కు ముందు ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే తన 59 మంది ఎమ్మెల్యేలతో సభ నుంచి వాకౌట్ చేసింది. మూడో అతిపెద్ద పార్టీ అయిన అన్నాడీఎంకే 47 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించినప్పటికీ, పార్టీలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి ఆదేశాలను ధిక్కరిస్తూ ఆ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయడం తమిళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. దీంతో ద్రవిడ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన అన్నాడీఎంకే పార్టీలో చీలిక స్పష్టంగా కనిపించింది. డీఎంకే వాకౌట్, మరికొందరు తటస్థంగా ఉండటంతో, పళనిస్వామి వర్గానికి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ తిరుగుబాటుతో పళనిస్వామికి గట్టి రాజకీయ ఎదురుదెబ్బ తగిలినట్లయింది. విశ్వాస పరీక్షలో గెలిచిన అనంతరం విజయ్ మాట్లాడుతూ మా ఎన్నికల గుర్తు అయిన విజిల్ చరిత్రను మార్చింది. మాది మైనార్టీ ప్రభుత్వమే అయినా, మైనార్టీల హక్కులను కాపాడే ప్రభుత్వంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. విజయ్ ప్రభుత్వం ప్రస్తుతానికి గండం నుంచి బయటపడినప్పటికీ, అన్నాడీఎంకేలో ఏర్పడిన ఈ చీలిక భవిష్యత్తులో తమిళనాడు రాజకీయ సమీకరణాలను ఎలా మారుస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. బలపరీక్షపై రాజకీయ పార్టీల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నప్పటికీ విజయ్ ఆయన సీనియర్లు నడిపిన వ్యూహం మంచి ఫలితాలిచ్చింది. ముందురోజే తాము మద్దతిస్తామని ప్రకటించిన అన్నా డిఎంకె రెబెల్స్ ఇళ్లకువెళ్లి వారికి భరోసా కల్పించారు. అలాగే అందరు ప్రతిపక్ష నాయకుల ఇళ్లకు వెళ్లి మీ ఆశీస్సులు,సలహాలు అందించాలని కోరారు. అనుకున్నట్లుగానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికలు ఏకగ్రీవంచేసుకున్న టివికె ఇక బలపరీక్షపైనే పూర్తిస్థాయిలో ఫోకస్‌పెట్టింది. ప్రస్తుత మిత్రపక్షాలను కలుపుకునిపోవడంతో పాటు మద్దతిస్తామని వచ్చిన అన్నాడిఎంకె రెబెల్స్‌ను కూడా తమలో కలుపుకుని విశ్వాస పరీక్షలో సులువగా నెగ్గింది. ముందుగా ఊహించినట్లుగానే డిఎంకెకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభనుంచి వాకౌట్‌చేసారు.

**మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చట్టం చేయాలి: వీసీకే డిమాండ్**

విశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో వీసీకే ఎమ్మెల్యే వన్ని అరసు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టాల్సిన పలుసంస్కరణలను ప్రస్తావించారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద ఆలోచనలను ప్రోత్సహించాలని, జ్యోతిష్యంతో సహా అన్ని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కఠిన మైన చట్టం తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం

## కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికిలో లిఫ్ట్ వైర్ తెగిపోవడంతో ఘటన

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రమాదం తప్పింది. ప్రమాదంలో మంత్రితో పాటు గన్‌మెన్లు ఆసుపత్రి లిఫ్టులో వెళుతుండగా ప్రమాదం జరిగింది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్‌లో మక్కల కొనుగోలు కేంద్రం వద్ద లారీ అదుపుతప్పి మంగళవారం పలువురు రైతులు గాయపడ్డారు. గాయపడ్డ రైతులు కరీంనగర్‌లోని వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గానికి చెందిన రైతులను పరామర్శించడానికి మంత్రి బుధవారం రాత్రి ఆసుపత్రికి చేరుకున్నారు. బాధితులను పరామర్శించడానికి మంత్రితో పాటు వ్యక్తిగత సిబ్బంది కలిసి లిఫ్టులో మూడో అంతస్తుకు వెళ్లుతుండగా లిఫ్ట్ వైరు తెగిపోవడంతో ఒక్కసారిగా లిఫ్ట్ కిందికి పడిపోయింది. అదృష్టవశాత్తు మంత్రితో పాటు వ్యక్తిగత సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం అనంతరం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రి పనితీరుపై తీరుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. కరీంనగర్ లోని పలు ప్రైవేట్ ఆస్పత్రికి మెడికల్ కు సంబంధం లేని వ్యక్తులు నిర్వహిస్తూ ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నారని మంత్రి ఆరోపించారు. కనీస వైద్య సదుపాయాలు లేకున్నా అర్హత లేని వైద్యులతో ఆసుపత్రిలో నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు. కరీంనగర్ లో మెడికల్ మాఫియా రాజ్యం ఎలుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ప్రమాదం నుండి ఎలాంటి గాయాలు లేకుండా మంత్రి బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుగా పనిచేస్తున్న విశ్రాంత ఇఎన్‌సి ప్రత్యేకాధికారి కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం జీవో నెం.974ను విడుదల చేసింది. సలహాదారు పెంటారెడ్డి నియామకం 16.11.2025 నుంచి 15.11.2026 వరకు అమల్లో ఉంటుంది.ఆయనకు గౌరవ వేతనం కింద నెలకు రూ.1,50,000 చెల్లించనున్నారు. అదేవిధంగా ప్రభుత్వ వాహనం, మొబైల్ ఛార్జీలు, అధికారిక పర్యటనల సమయంలో వర్తించే రవాణా, కరువు భత్యాలను ప్రభుత్వం కల్పించనుంది. హైదరాబాద్‌లోని ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (అడ్మిన్) పరిపాలనా నియంత్రణలో పెంటారెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. గతంలో ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను గుర్తించి, నిబంధనల సడలింపుతో ఈ పొడిగింపును మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

## లైంగిక వేధింపుల కేసులో ఎస్ఐ అరెస్ట్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాతవార్త:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించాడని ఓ మహిళ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సురేష్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ ఇటీవలే సస్పెన్షన్‌కు గురైనట్లు తెలిసింది. కాగా ఎస్ఐ సురేష్ కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ యువతితో స్నేహం చేసి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించినట్లు బాధితురాలు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ సురేష్‌పై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి తెలియజేశారు.




చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

## శుభకార్యానికి వెళ్లి వస్తుండగా బొలెరో బోల్తా
## బాలుడు మృతి, పది మందికి గాయాలు
### మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఘటన

**మహబూబ్‌నగర్,మే 13:** శుభకార్యానికి వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందగా పదిమందికి తీవ్ర గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామం నుంచి పాతమొల్గర గ్రామానికి పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో డ్రైవర్ నిరక్ష్యం వల్ల జిల్లాకేంద్రం సమీపంలోని క్రిస్టియన్‌పల్లి వద్ద కలెక్టరేట్ కార్యాలయం ఎదు రుగా ప్రధాన జాతీయ రహదారిపై ఒక్కసారిగా బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో బొలెరోలో సుమారు 15 మంది ప్రయాణిస్తుండగా ధమగ్నాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు (8) మృతి చెందాడు. ఈఘటనలో సుమారు పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను మహబూబ్‌నగర్‌జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. ప్రమాదఘటనతో పెళ్లి కుటుంబంలో అటు ధమగ్నాపూర్ గ్రామంలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. దవాఖానాలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు.

## అమెరికాలో అటార్నీగా పులివెందుల యువకుడు
### ఇండియనాలో నిర్వహించిన బార్ పరీక్షలో ఉత్తీర్ణత
#### భారత్‌తోపాటు అమెరికాలోను న్యాయవాదిగా సేవలు



అమెరికాలో అటార్నీగా అర్హత పత్రంతో భూమిరెడ్డి సాయి శ్రీనివాస రెడ్డి

**పులివెందుల, మే 13 ,ప్రభాత వార్త :** కడప జిల్లా పులివెందులకు చెందిన యువ న్యాయవాది భూమిరెడ్డి సాయిశ్రీని వాస్ రెడ్డి అమెరికాలో అరుదైన ఘనత సాధించి తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచారు. టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కుమారుడు,టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయిన సాయి శ్రీనివాస్ రెడ్డి అమెరికా లోని ఇండియానా రాష్ట్రంలో లైసెన్స్‌డ్ అటార్నీగా ప్రమాణ స్వీకారం చేశారు. కేవలం 25 ఏళ్ల వయసులోనే తొలి ప్రయత్నంలో ఇండియానా నిర్వహించిన బార్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఈ ఘనత అందుకోవడం విశేషం. భారత్‌తో పాటు అమెరికాలో కూడా న్యాయ వాదిగా సేవలందించేందుకు అర్హత సాధించిన అతి పిన్న వయస్కుల్లో ఒకరిగా ఆయన నిలిచారు. సాయి శ్రీనివాస్ రెడ్డి విద్యాభ్యాసం కూడా విశేషంగా సాగింది. ఆయన అలియన్స్ యూనివర్సిటీ నుంచి బీబీఏ, ఎల్‌ఎల్‌బీ పట్టాలు పొందారు. అనంతరం అమెరికాలో మాస్టర్ ఆఫ్ లాస్ (ఎల్‌ఎల్‌ఎం) పూర్తి చేశారు. అలాగే ప్రతిష్ఠాత్మక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ నిర్వహించిన సమ్మర్ ప్రోగ్రామ్‌లలో కూడా పాల్గొన్నారు.ఇటీవల ఇండియానా బార్ పరీక్షలో విజయంతో భారత్, అమెరికా దేశాల్లో ఒకేసారి న్యాయ వృత్తి నిర్వహించే అర్హతను సొంతం చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికఎక్స్‌లో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు, పులివెందుల యువకుడు సాయిశ్రీనివాస్ రెడ్డి తొలి ప్రయత్నం లోనే అమెరికాలో లైసెన్స్ పొందిన న్యాయవాదిగా ప్రమాణం చేయడం తెలుగు సమాజానికి గర్వకారణం అని కొనియాడారు.
సాయి శ్రీనివాస్ తండ్రి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి జర్నలిస్టుగా పనిచేసి అనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. తండ్రి రాజకీయ రంగంలో రాణిస్తుండగా, కుమారుడు అంతర్జాతీయ న్యాయ రంగంలో రికార్డు సృష్టించడం పులివెందుల ప్రజల్లో ఆనందాన్ని నింపుతోంది.

## నీట్ పేపర్ లీక్‌పై న్యాయవిచారణ జరిపించాలి
### సిపిఐ సీనియర్ నేత చాడ వెంకటరెడ్డి డిమాండ్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:**నీట్-2026 ప్రశ్నాపత్రం పేపర్ లీకేజి వ్యవహారంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తలదించుకోవాలని సిపిఐ సీనియర్‌నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నాపత్రం లీకేజితో వేలాది మంది విద్యార్థుల జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సిబిఐతో కాకుండా సమగ్ర న్యాయవిచారణ జరిపిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు.
రాజస్థాన్ తదితర ప్రాంతాలలో పేపర్ లీక్ చేసి వందల కోట్ల రూపాయల డబ్బులు సంపాదించుకున్నారని, దీని వెనుకఉన్న అసలు సూత్రదారులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. అదేవిధంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై ఫోక్సో కేసును నీరుగార్చకుండా విచారణ వేగవంతంగా చేయాల ని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కేసులో ఇప్ప టికే సిట్ విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం భగీరథను పట్టుకోవడంలో ఎందుకు వైఫల్యం చెందుతోందని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు తమ కుటుంబ సభ్యుల ప్రవర్తనపై కూడా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. బాధిత బాలిక మైనర్ కాదు, మేజర్ అని బండి భగీరథ చెబుతున్నా, నిప్పు లేనిదే పొగ రాదని వ్యాఖ్యానించారు.

# బక్రీద్ నేపథ్యంలో భారీగా శాంతి భద్రతల ఏర్పాట్లు
### అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్



బక్రీద్ నేపథ్యంలో శాంతి భద్రతలపై ఎస్‌పిలు, కమిషనర్లతో బుధవారం డిజిపి సి.వి.ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన జరుగనున్న బక్రీద్ నేపథ్యంలో జంతువుల తరలింపులో ఎలాంటి సమస్యలు రాకుండా చూడడం, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకునే విషయమై డిజిపి సి.వి. ఆనంద్ బుధవారం నాడు అన్ని జిల్లాల ఎస్‌పి లు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిపి కార్యాలయంలో డిజిపి ఆనంద్‌తో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి బలంబర్తి సహా ఇతర శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆనంద్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా జంతువుల అక్రమ రవాణాను కట్టడిగాను అదుపుకోవాలని కోరారు. సున్నితమైన ఈ అంశంపై పోలీసులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయంతో మెలగాలని డిజిపి ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఎక్కడ గొడవలకు తావులేకుండా పోలీసులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇటీవల పలుచోట్ల పశువుల అక్రమ రవాణా వెలుగు చూసిందని, ఈ నేపథ్యంలో అన్నిచోట్ల స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపి)ని పక్కాగా అమలు చేయాలని ఎస్‌పిలు, కమిషనర్లను ఆయన ఆదేశించారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్ 1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్ 1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ 1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఆయన తెలిపారు. వీటిని ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశించారు. పశు వుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఛత్తీస్‌ఘడ్, ఎపి, కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డిజిపి తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద విధుల్లో వుండే పోలీసులు పక్కాగా వ్యవహరించాలని, పశువులను తరలించే వాహనాలలో అన్ని పత్రాలను పరిశీలించి, అవి సరైనవని నిర్ధారించుకోవాలని ఆయన ఆదేశించారు. అనుమానా స్పద ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు చేయాలని, రానున్న 15 రోజుల్లో పశువుల అక్రమ రవాణా విషయంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు. పశువుల అక్రమ రవాణా పేరిట ఎవరైనా చట్టాన్ని చేతులో తీసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షిం చవద్దని డిజిపి ఆదేశించారు. ఈ విషయంలో గోరక్షక్ బృందాలు. ఖురేషీలు పోలీసులకు సహకరించాలని డిజిపి కోరారు. నిబంధనలకు విరుద్ధ ంగా తరలించే పశువులను ఎక్కడైనా జప్తు చేస్తే వాటిని వెంటనే సంరక్షణ కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. సోషల్ మీడియాకు నిఘా వుంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, షా నవాజ్ ఖాన్, కార్తి కేయ, నిఘా విభాగం డిఐజి భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐపిఎల్ పేరిట 600పైగా నకిలీ వెబ్‌సైట్లు, 400 పైగా నకిలీ లైవ్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు
### ఫ్రీ టికెట్ల పేరిట అమాయకులకు టోకరా, జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా యువతను కట్టిపడేసిన ఐపిఎల్ సీజన్ ముగింపు దశకు చేరడంతో దీనిని సొమ్ము చేసుకు నేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త తరహా ఎత్తుగడలకు శ్రీకారం చుట్టారు. ఫ్రీ టికెట్ల పేరిట అమాయకులను నిండా ముంచేందుకు 600పైగా నకిలీ వెబ్‌సైటు, 400 పైగా నకిలీ లైవ్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు దేశ వ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు.
ఈ నకిలీ వెబ్‌సైట్ల విషయంలో అందరు జాగ్రత్తగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఫ్రీ ఐపిఎల్ టికెట్లు, ఉచిత లైవ్ స్ట్రీమింగ్ పేరుతో ఈ నకిలీ వెబ్‌సైట్లను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.
ఇదంతా భారీ ఆన్ లైన్ మోసంగా సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ కూడా అన్ని రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చే సింది. సైబర్ నేరగాళ్లు 600 పైగా నకిలీ వెబ్‌సైట్లు, 400 పైగా నకిలీ లైవ్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు పని చేస్తున్నాయని సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ వెల్లడించింది. ఈ నకిలీ వెబ్‌సైట్లు ఐపిఎల్ టికెట్ల పేరిట అమాయకుల నుంచి అందినంత దం డుకుని బిచాణా ఎత్తేస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. ఇదే సమయంలో విని యోగదారుల కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలో ఇం టర్నెట్ వాడే సమయంలో మాల్వేర్‌ను చొప్పించి దీని సహాయ ంతో వారి బ్యాంకు ఖాతాలతో పాటు అన్ని వివరాలను చోరీచేస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. నకిలీ వెబ్‌సైట్లు ప్రొఫెషనల్‌గా వుంటూ అసలైన విగా అనిపించేలా పనిచేస్తున్నాయని, ఈ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుం టున్నామని సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ తెలిపింది.
ఈ నేపథ్యంలో ఐపిఎల్ టికెట్ల కొనుగోలు సమయంలో అధికారిక టికె టింగ్ ప్లాట్‌ఫాంలను మాత్రమే ఉపయోగిం చాలని, అనుమానాస్పద వెబ్‌సైట్లకు దూరంగా వుండాలని, తమకు సంబంధించిన సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని సైబర్ సెక్యూరిటీ నిపుణులు, సైబర్ క్రైం పోలీసు లు చెబుతున్నారు.

## టెట్ రివ్యూపిటిషన్ తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు

**హైదారాబాద్,మే 13,ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తప్పని సరి ఆదేశంపై వేసిన రివ్యూపిటేషన్ తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. బుధవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష 2010కి పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు వర్తింప చేయడం న్యాయసమ్మతం కాదనీ ఎఐపిటిఎఫ్ న్యాయవాదల బృందం సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్లు అభిషేక్ మనుసింఘ్వీ, ముకుల్ రోహిత్‌గీ వాదించారు. బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలపాటు టెట్ తప్పనిసరి అనే ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఎఐపిటిఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వినోద్‌ఠాకరాణ్‌సీమాథూర్, నిషాదహియా,ప్రాథమిక ఉపాధ్యయసంఘం తెలంగాణ ఉపప్రధాన కార్యదర్శి దీపక్‌పంత్‌లు వేసిన పిటిషన్‌లో దేశంలోని 25లక్షల మంది ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉన్నతన్యాయస్థానంను అభ్యర్థించారు. 2012లో ఎసిటిఇ మార్గదర్శకాలు విడుదల చేశారని దాని తరువాత2017లో ఆర్‌టిఇ సవరణ చేశారని దానికి ముందు నియామకమైనవారికి ఎలా వర్తిం పచేస్తారని వారు న్యాయస్థానం ముందు గోడు వెల్లగక్కారు. టెట్‌గడువును రెండు సంవత్సరాల నుంచి నాలుగు సంవత్సరాలకు పెంచాలని న్యాయవాదులు కోరారు.

## సిబిఎస్ఇ ఇంటర్ ఫలితాలు విడుదల
### గతేడాది కంటే 3.19శాతం మేర తగ్గిన ఉత్తీర్ణత
### బోర్డు వెబ్‌సైట్ నుండి మెమో డౌన్‌లోడ్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:**సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఎట్టకేలకు 12వ తరగతి ఫలితాలను విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 85.20శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించింది. గత ఏడాది (2025)తో 88.39శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం 3.19 శాతం తగ్గినట్లు తెలుస్తోంది. పరీక్షలు రాసిన విద్యార్థులు తమ రోల్ నంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. తాజా ఫలితాల్లో బోర్డు మెరిట్ జాబితాను విడుదల చేయలేదు. విద్యార్థుల మధ్య అనారోగ్యకరమైన పోటీని నివారించడమే దీనికి కారణమని బోర్డు తన ప్రకటనలో తెలిపింది. సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్లో అగ్రస్థానంలో ఉన్న 0.1శాతం మందికి బోర్డు మెరిట్ సర్టిఫికేట్‌ను జారీ చేస్తుంది. బాలికలు 88శాతం, అబ్బాయిలు 82శాతం చొప్పున ఉత్తీర్ణత శాతం నమోదైంది. 17వేల మంది విద్యార్థులు 95 శాతానికి పైగా స్కోర్ చేశారు. గతంలో సీబీఎస్ 10, 12వ తరగతుల పరీక్షల ఫలితాలను ఏకకాలంలో విడుదల చేసేది. పదో తరగతిలో ఏడాదికి రెండు సార్లు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడంతో ఈసారి పదో తరగతి ఫలితాలను కాస్త ముందుగానే ఏప్రిల్ నెలలో బోర్డు విడుదల చేసింది. తాజాగా బుధవారం 12వ తరగతి ఫలితాలను కూడా విడుదల చేశారు.

# ఇరాన్‌పై అమెరికా కొత్త యుద్ధ తంత్రం..
### ఆపరేషన్ స్లెడ్జ్ హ్యామర్‌కు సమాయత్తం



**వాషింగ్టన్, మే 13:** ఇరాన్‌పై మళ్లీ దాడులకు దిగాల్సి వస్తే కాంగ్రెస్ అనుమతి అవసరం లేకుండా చూసేందుకు అమెరికా సైన్యం కొత్త వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. పేరు మార్చి ఆపరేషన్ స్లెడ్జ్ హ్యామర్ పేరుతో దాడులు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆ దేశ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్యకు ట్రంప్ యంత్రాంగం ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ అని పేరు పెట్టింది. భీకర యుద్ధం అనంతరం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతోనే ఆపరేషన్ ముగిసిందని డొనాల్డ్ ట్రంప్ సర్కారు కాంగ్రెస్‌కు తెలిపింది. మరోవైపు యుద్ధం ముగింపు ప్రతిపాదనల విషయంలో ఇరుదేశాల మధ్య తిరస్కరణల పరంపర కొనసాగుతోంది. ఇరాన్ తమతో ఒప్పందానికి రాకపోతే మాత్రం మరోసారి దాడులకు దిగుతామని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ క్రమంలో చర్చలు విఫలమై ట్రంప్ మళ్లీ యుద్ధం చేపడితే అది మరింత తీవ్రంగా ఉంటుందన్న అర్థం వచ్చేలా దానికి ఆపరేషన్ స్లెడ్జ్ హ్యామర్ గా పేరు పెట్టాలని అమెరికా సైన్యం యోచిస్తోంది. దీంతోపాటు మరికొన్ని పేర్లను కూడా అది పరిశీలిస్తుంది. ఈ పేరు మార్పుతో కాంగ్రెస్ అనుమతి వచ్చేదాకా కొత్త ఆపరేషన్‌కు 60 రోజుల సమయం దొరుకుతుంది. యుద్ధాన్ని ప్రకటించే అధికారం కేవలం అక్కడి కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుంది. సాధారణంగా శత్రు భూభాగంలో సైనిక చర్యలు ప్రారంభించిన 48 గంటల్లోపు అధ్యక్షుడు అక్కడి కాంగ్రెస్‌కు తెలియజేయాలి. ఆ తర్వాత 60 రోజుల్లోగా కాంగ్రెస్ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ 60 రోజులూ సైనిక చర్యను కొనసాగించవచ్చు. పాత ఆపరేషన్ మొదలై 60 రోజులు ముగిసింది. కాంగ్రెస్ నిర్ణయం వెల్లడించకముందే ఇరాన్ అమెరికా తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి.

# రైతుల ఖాతాల్లోకి రూ.4,520కోట్లు
### 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:**ఈ ఏడాది (2025-26) రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల సజావుగా, సమర్థవంతంగా కొనసాగేలా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పలు కీలక చర్యలకు చేపడుతోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు రూ. 4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సన్న, దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారని, ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యం అని వివరించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు,ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు, కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసేలా పౌరసరఫరాలశాఖ ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను, తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచిందని ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వల సమస్య తలెత్తకుండా పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. ధాన్యం తరలింపు కోసం లారీలు, ట్రాక్టర్లు, డీసీఎం తదితర సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. కాగా.. కొనుగోలు కేంద్రాలు, గోదాముల్లో ధాన్యం నిర్వహణ ఛార్జీలను (హమాలీ రేట్లు) అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ వెల్లడించారు. మరోవైపు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2025-2026 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కుగాను 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్‌ను కేటాయించిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో సమస్యలు ఉన్నా, సహాయం కావా లన్నా పౌరసరఫరాలశాఖకు చెందిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1967ను సంప్రదించాలని రైతులకు సూచించారు.

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణ స్వీకారం: ఆయనతోపాటే మరో ఇద్దరు మంత్రులు కూడా..





**పుదుచ్చేరి, మే 13:** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఐదోసారి ఎన్ రంగస్వామి ప్రమాణస్వీకారంచేసారు. లోక్‌నివాస్‌లో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాసనాథన్ రంగస్వామి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతోపాటే బిజెపి ఎమ్మెల్యే నమశ్శివాయం, ఎఐఎన్‌ఆర్‌సి ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావులు మంత్రులుగా ప్రమాణం చేసారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అఖిలభాత ఎన్నార్ కాంగ్రెస్‌కు 12 మంది ఎమ్మెల్యేలు, బిజెపికి నలుగురు, అన్నాడిఎంకె, ఎల్‌జెకె నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి, మంత్రుల నియామకాలకు ముందు ప్రధాన కార్యదర్శి కేంద్ర ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు. ముఖ్యమంత్రిగా రంగతస్వామి, మంత్రులుగా మల్లాడి కృష్ణారావు, నమశ్శివాయంలను నియమిస్తున్నట్లు చదివి వినిపించారు. మరో ముగ్గురు మంత్రులను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రమాణ స్వీకారం తర్వాత మంత్రులు, సీఎంను గవర్నర్ , ప్రధాన కార్యదర్శులు సత్కరించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, జాతీయ కార్యదర్శి బిఎల్ సంతోష్‌లు కూడా వేదికపై ఆసీనులయ్యారు. బిజెపి పుదుచ్చేరిఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్ సురానా, రాష్ట్ర అధ్యక్షుడు విపి రామలింగం, మాజీ ఎమ్మెల్యేలు డిఎంకె కన్వీనర్ ఆర్ శివ, మాజీ స్పీకర్ ఆర్ సెల్వమ్‌లు కూడా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు

# బస్సు ఢీకొని ప్రమాదవశాత్తు బాలుడి మృతి



మృతి చెందిన బాలుడి శవంతో నిరసన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

**ఆసిఫాబాద్ టౌన్, మే 13, ప్రభాతవార్త:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో బుధవారం బస్సు ఢీకొన్న సంఘటనలో ప్రమాదవశత్తు బాలుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెంచికల్పేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన భీంరావు కుటుంబ సభ్యులు బుధవారం వాంకిడి మండలంలోని బంధువుల ఇంటో శుభకార్యానికి వెళ్లి తిరిగి పెంచికల్పేటకు వెళ్లెందుకు ఆసిఫాబాద్ బస్టాండుకు వచ్చారు. బస్టాండులో కాగజ్నగర్ బస్సు రావడంతో ఎక్కేందుకు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో ఊట్నూరు డిపోకు చెందిన బస్సు ను డ్రైవరు వెనుకకు తీస్తున్న క్రమంలో నానమ్మ ఒడిలో ఉన్న తరుణ్(14నెలలు)ను బస్సు బలంగా తగలడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన చిన్నారిని మొదట ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు బాలున్ని మంచిర్యాలకు రెఫర్ చేయగా అక్కడి ఆసుపత్రి వైద్యులు పరిక్షించి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుని మృత దేహంతో కుటుంబీకులు తిరిగి ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండుకు చేరు కున్నారు. బాలుని మృతదేహంతో బస్టాండు ఎదుట బైఠాయించి తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. బస్టాండు ఎదుట ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడడంతో ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్, పోలీసులు సం ఘటన స్థలంకుచేరి బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.
ఈ విషయాన్ని తెలుసుకున్న డిపో మేనేజర్ రాజశేఖర్ అక్కడికి చేరుకొని తక్షణ ఆర్థిక సహాయం కింద రూ. 25 వేలు చెల్లిస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆం దోళన విరమించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రజా సం ఘాల నాయకులు చిరంజీవి, దినకర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

## టిజిసిపిగెట్ నోటిఫికేషన్ విడుదల
### రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
### జూన్ 18వరకు దరఖాస్తుకు గడువు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** తెలంగాణ సిపిగెట్-2026 నోటిఫికేషన్ విడుదలైంతది. ఈ మేరకు బుధవారం తెలంగాణ ఉన్నతవిద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది టీజీసిపిగెట్ పరీక్ష నిర్వహణను కాకతీయ యూని వర్సిటి చేపట్టినట్లు విసి కె. ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కన్వీనర్‌గా ఆచార్య రాజేందర్ వ్యవహరిస్తారు. సిపిగెట్ దరఖాస్తుల స్వీకరణ మే 15 నుండి ప్రారంభం కానుంది. జూన్ 18వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD
O.A. No. 34 of 2026
ICICI Bank Limited ....Applicant
And
Gogineni Advertising and Ors. ...Defendant(s)

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. M/s. Gogineni Advertising
Rep. by its Proprietor
Bala Krishna Gogineni
R/o. 6-3-664/B, Flat No. 203
2nd Floor, B Block Pristige Rai Tower, Somajiguda Hyderabad-500082
Mobile No. 9399940000
2. Bala Krishna Gogineni
S/o. Nageshwar Rao
Age: 49 Years; Occ Business
Villa No. 78, Prime Meadows Road No. 1, Kousalya Colony, Bachupally, KV Rangareddy- 500090
Mobile No: 9399940000
...Defendant(s)

Please take the summons in the above O.A. No. 34 of 2026 filed by the Applicant for Recovery of money of Rs. 6,94,70,354.68 Ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in Telugu "VARTHA" Telugu Daily, and English "The Hindu" Hyderabad District Edition newspaper and posted the matter to 22-04-2026.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 11-06-2026 at 10:30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this 30th day of April, 2026.
(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad

వార్త


నేరం చేసిన వాడిని శిక్షించడమే ప్రధానం కాదు. ఆ నేరం చేయడానికి ఏ పరిస్థితులు అతడ్ని పురికొల్పాయో వాటిని తొలగించడం ప్రధానం.

- ఎమ్.ఎన్.రాయ్

# విజయ్ సర్కార్‌కు వణక్కం

తమిళనాడు శాసనసభలో మొట్టమొదటిసారిగా ద్రవిడేతర పార్టీ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గెలుపొందింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తమిళ వెట్రికళగం పార్టీ (టి.వి.కె)అధ్యక్షుడు సి.జోసెఫ్ విజయ్ ఎంతో అవలీలగా విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. బలపరీక్షలో విజయ్‌కు అనుకూలంగా 144 మంది సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేయగా వ్యతిరేకంగా 22మందిఓట్లేసారు. 61 మంది ఎమ్మెల్యేలు విజయ్ బలపరీక్షను నిరసిస్తూ సభను వాకౌట్ చేశారు. ఐదుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. బలపరీక్షకు ముందు ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ తాము సెక్యులర్ పాలనను అందిస్తామని, జన సర్కార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రజలు అవకాశం కల్పించారని విపక్షాలు ఆరోపించినట్లు విశ్వాస పరీక్ష నెగ్గేందుకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎలాంటి బేరసారాలు చేయలేదని విజయ్ స్పష్టం చేశారు. అందరూ మెచ్చే పాలనలో గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమపథకాలు కొనసాగిస్తామని ప్రకటించారు. సభలో విపక్ష డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ ప్రజామోదం పొందడంలో టి.వికె విఫలమైందని, తమ కూటమిలోని పార్టీలే విజయ్‌కు మద్దతునిస్తున్నాయని ఎమ్మెల్యేల బేరసారాలకు తెరతీసిందని విమర్శించారు. అటుపై డిఎంకె సభ్యులంతా వాకౌట్ చేశారు. ఆల్ ఇండియా అన్నాడిఎంకె పళనిస్వామి కూడా తమ ఎమ్మెల్యేలకు 'ఎరవేసి తమ వైపునకు తప్పుకున్నారని ఆరోపించారు. సాధారణంగా విశ్వాస పరీక్ష సందర్భంగా జరుగుతున్న వ్యవహారశైలిని పార్టీలు తమ ఉపన్యాసంలో అధికార పక్షాన్ని ఎండకట్టడం సహజం. భేదాభిప్రాయాలు సహజంగా ఉండే రాజకీయ పార్టీలలో బేరసారాలతో చీలిక తీసుకురావడం తగదని టివికెకి హితవు చెప్పడం విశేషం. ఎవరికి అవకాశం వస్తే వారు తమ అవసరాల మేరకు ప్రభుత్వంపై పట్టుసాధించాల్సి వచ్చినప్పుడు టక్కుటమార గోకర్ణ విద్యలతో ప్రభావితం చేయడం తమిళ రాజకీయాల్లో సర్వసాధారణంగా జరిగేదే. కానీ ఈసారి ఓటమి ద్రవిడ రాజకీయ పార్టీలది అవడంలో హితోపదేశాలతో సరిపుచ్చారు. గతంలో జయలలిత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను స్టాలిన్ కొనసాగించినట్లుగానే డిఎంకె ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉనికిలో ఉంటాయని విజయ్ ప్రకటించడం ఆహ్వానించదగిన అంశం.ఏదిఏమైనా బలపరీక్ష సందర్భంగా ఎదుర్కొన్న ఆరోపణలు, సంక్షోభ సమయంలో ఇబ్బందులు, వివిధ పార్టీల ప్రవర్తన, వారి ఆకాంక్షలు నిలబెట్టుకోవాలన్న ప్రయత్నం.... ఇవన్నీ చూసి 'ఇల్లలకంగానే పండుగ కాదు ముందుంది ముసళ్ల పండుగ అన్నది కొత్త ముఖ్యమంత్రికి తెలిసొచ్చినట్లుంది. తమిళనాడు శాసనసభలో మొత్తం సీట్లు 234 కాగా బలపరీక్ష సమయంలో డిఎంకె, అన్నాడిఎంకె పళని స్వామి వర్గం ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. పిఎంకె సభ్యులు గైర్హాజరైన వారిలో ఉన్నారు. బలపరీక్షలో విజయ్ గెలిచినట్లు స్పీకర్ జెసిడి ప్రభాకర్ ప్రకటించారు. ఈ పరీక్షలో ఎమ్మెల్యేలు తమ సీట్లోనే నిలబడి తాము విజయ్‌కు మద్దతునిస్తున్నట్లు తెలిపారు. విజయ్ నేతృత్వంలోని 10సీట్లకు ముందే ఆగిపోవడంతో నాలుగు సార్లు గవర్నర్‌ను కలిస్తే తప్ప విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏలిన వారి దయ కలుగలేదు. అంకెల ప్రమాణంతో విజయ్‌ను తొలుత ఆ రాష్ట్ర గవర్నర్ పదేపదే తిప్పించుకున్నారన్న అపప్రథ పొందారు. సంపూర్ణ మద్దతుతోనే స్వచ్ఛమైన పాలనను అందించే ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టాలనే భావనతోనే ఆయనలా వ్యవహరించారన్న విశ్లేషణలు మొదలయ్యాయి. ఏమైతేనేం ఇక విజయ్‌కు ఇప్పుడు అడ్డూఅదుపు లేదు. ప్రభుత్వాధినేతగా ఆయన తొలి సంతకాలు పెట్టిన నిర్ణయాలను బట్టి విజయ్ పాలనపై కొన్ని అంచనాలు మొదలయ్యాయి. తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ నిరూపణలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తనకున్న 107 సీట్లతో పాటు విసికె,ఐయుఎంఎల్ వామపక్షాలు,కాంగ్రెస్ పార్టీలతో కేవలం 120మంది మద్దతును కూడగట్టారు. తీరా అసెంబ్లీలో గెలుపుసాధించిన తర్వాత అనుకూల, వ్యతిరేక వర్గాల ఓట్లు గణిస్తే మేజిక్ ఫిగర్‌ను,విజయ్ చూపిన మద్దతుదారుల సంఖ్యనుదాటి మొత్తం అనుకూల ఓట్లు144కి చేరాయి.అయినా అనుకోని విజయాలు విజయ్ చెంత చేరాయి. అంతకు ముందే అనూహ్యంగా అన్నా డిఎంకెలో వేరుపడిన సీనియర్ నేతలు ఎస్.పి వేలుమణి, సి.వి షణ్ముగం వర్గం తాము వేరుగా విప్‌ను నియమించుకుంటామని కోరగా స్పీకరు అంగీకరించడంతో అసెంబ్లీలో అధికార పార్టీ ఎత్తుగడల మీద ఆరోపణలు వెల్లువెత్తాయి. చీలిక వర్గ స్థాయిని,హోదాని ప్రకటించకుండా 'విప్' నియామకానికి అనుమతినీయడం విమర్శలకు గురైంది. పనిలో పనిగా ప్రభుత్వం తొలి అడుగులు తప్పటడుగుతో మొదలెట్టిందనే యోచనలో ఎండిఎంకె అధ్యక్షురాలు, ఎమ్మెల్యే ప్రేమలతా విజయకాంత్ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వ పొలిటికల్ అడ్వైజర్‌గా ఒక జ్యోతిష పండితుడు రాధా పండిట్‌ను నియామకం యూత్‌కు ఎలాంటి సంకేతాలు పంపిస్తున్నాయో ముఖ్యమంత్రి ఆలోచించుకోవాలని ఎదురుదాడి చేశారు. బేషరతుగా మద్దతునిచ్చినట్లు చెప్పుకున్న విదుతలై, చిరుతైగల్ కట్చి (విసికె)కి ఐదుగురు ఎమ్మెల్యేలున్నారు. సభలో ఈపార్టీ ఎమ్మెల్యే వన్నివరసు ప్రసంగంలో సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచాలని, హతువాద ఆలోచనలను ప్రోత్సహించాలని జ్యోతిష్యం వంటి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా కఠిన చట్టం తీసుకురావాలనీ కోరారు. ఆనక విజయ్ రాధా పండిట్ నియమాకాన్ని పక్కన పెట్టారు. బహిరంగంగా వారి సూచనలు. ఇవన్నీ వింటుంటే జనానికి దడ పుట్టించక మానవు. తమిళనాట ఆలయాలు, విద్యాలయాల వద్ద ఉండే 717 దుకాణాల మూసివేతకు విజయ్ ఆదేశాలిచ్చారంటే ఆయన పాలన ఎలా ఉంటుందో రుచి చూపించారని అనుకోవాలి. ఈ ఐదేళ్లపాటు ద్రవిడేతర రాజకీయ పార్టీని ద్రవిడ పార్టీలు ఎంత బేషుగ్గా పాలించనిస్తాయో చూడాలి.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

మనకు ఉన్న సంపదతో సంతృప్తి పడటం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం.



సర్వేపల్లి రాధాకృష్ణన్

## ప్రజావాక్కు



### నీటి కేంద్రాలను ఏర్పాటు చేయాలి

భారతదేశంలో ఈఏడాది సూర్యుడి ప్రతాపం మునుపెన్నడూ లేనంత తీవ్రంగా ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వేసవి కాలమంతా ఎండలు మండుతాయని వాతావరణ హెచ్చరికలు జారీ అయ్యాయి. ప్రస్తుత పరిస్థితి ఒక జాతీయ విపత్తును తలపిస్తోంది. ఈతీవ్రమైన వడగాల్పులనుండి ప్రజలను రక్షించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలతో కలిసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి.వడదెబ్బపై అవగాహన కల్పించడంతోపాటు చికిత్స సౌకర్యాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, వ్యవసాయ కూలీలు వంటి పేద వర్గాలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరికి సామాజిక భద్రతా చర్యలు కల్పించడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ప్రతి చోటా సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం

పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో, ప్రత్యేక గుర్తింపు స్కూల్లో కాకుండా కేవలం ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే చేర్పిద్దాం. ఉన్నత స్థాయిలోనిలబెడదాం. ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి లక్షలు ధారపోసేకన్నా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పదిమంది పిల్లలనుచేర్పిద్దాం.ఇద్దరిది ఒకే స్థాయి విద్య అయినప్పుడు డబ్బులు ఎందుకు వృథా చేయాలి. అవకాశాలను ఎందుకు సద్వినియోగం చేసుకోకూడదు అనేది తల్లిదండ్రులు ఆలోచించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రజలను పట్టించుకోని ప్రభుత్వాలు!

నేపాల్‌లో బంగ్లాలో శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈ జెన్ జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి. కెపి శర్మ ఒలి భారత్‌వ్యతిరేక వాక్యాలుచేసిన అమెరికా వ్యతిరేక వాక్యాలు చేసిన దేశంలో నిరుద్యోగం వలసీకరణ అవినీతి పెచ్చరిల్లాయి అన్నది వాస్తవం. అయితే ప్రజా పోరాట విస్ఫోటనం తరవాత శ్రీలంక బంగ్లాదేశ్ లాంటి రాజ్యాలు లేక దేశాలు పాలసీలు రూపకల్పన, వాటి అమలులో వెనుకబడిపోయాయి అన్నది కాదనలేని వాస్తవం.

- కె.రామారావు,నల్గొండ

### ఉపాధి హామీ అవసరం

తెలంగాణకు ఉపాధి హామీ అవసరం ఏమిఉంది. ఒక్క తెలంగాణలోనే కాదు భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఉపాధి హామీ అవసరం. గిరిజన ప్రాంతాలలో ఉపాధి హామీ ద్వారా వివిధ రకాలు అయినా ప్రాజెక్ట్స్ చేసేందుకు వీలు అవుతుంది. ముఖ్యంగా మట్టి రోడ్ల నిర్మాణం గురించిన ప్రాజెక్ట్స్ పెద్ద ఎత్తున చేపట్టాలి. ఒకరకంగా ఇదిఆహ్వానించదగిన మార్పు ఎందుకని వారి పొలాల దగ్గరికి బాటలు ఉంటే వారి భూమికి ఎక్కువ రేట్ వస్తుందనేది వారి కోరికగా ఉన్నది ఇది గొప్ప మార్పు మాత్రమే కాకుండా గొప్పఆస్తిగా కూడా నిలబడుతుంది. రెండవవిషయం నీటికుంటాల నిర్మాణం చేపట్టడానికి గిరిజన ప్రాంతాల ప్రజలుముందుకు వస్తున్నారు. ఎందుకు అంటే నీటి నిల్వపైన వారిపరిజ్ఞానం పెరిగింది. ఇందులో ఎంత మాత్రం సంశయం లేదు. నీటి నిల్వ పెంచడం మూలంగా పంటలకు నీటి కటకట రాకుండా ఉంటుంది.

- భారత అవినాష్, జనగామ

### మద్యాన్ని నిషేధించాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్నినగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడువివిధ జంక్షన్‌లోకి వచ్చే జనం ఆ మార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై ఇతరులతో ఘర్షణలకు దిగుతున్నారు.కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగా పడిపోయి అక్కడే పడుకుంటున్నారు. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా దుకాణదార్లు ఏమి చేయలేకపోతున్నారు. ఇకపై కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- బి. మేఘనాథం, విశాఖపట్నం

### జనరిక్ మందులపై అవగాహన అవసరం

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్ల పేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువ ధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ఇవి బ్రాండ్ మందులంతటితో సమానమైన ప్రభావం కలిగి ఉంటాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఔషధి కేంద్రాల ద్వారా వీటిని విస్తృతంగా అందుబాటులోకి తేవాలి.

- పి. రాజేష్‌కుమార్, వరంగల్‌జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)


# అధికార భాషా సంఘం అలంకారమేనా!

**ప్రజల భాషలో పరిపాలన జరగడమన్నది ప్రజాస్వామ్య పటిష్టతకు, పరిణతికి అత్యంత ఆవశ్యకం. పరిపాలన ఎట్లా, ఏవిధంగా జరుగుతుందో, దాని ఫలితాలను అనుభవించే ప్రజలకు క్షుణ్ణంగా తెలియాలి. వారి ప్రమేయం లేని వారి శ్రద్ధాసక్తులతో మమేకం కాలేని ప్రభుత్వ పరిపాలన నిష్ప్రయోజనం. అధికార భాషా సంఘం పరిధి ప్రభుత్వ కార్యాలయాలలోని పాలనా వ్యవహారాలలో తెలుగు ఎంతవరకు అమలు అవుతోంది. అందుకు తీసుకోవలసిన చర్యలేమిటో ప్రభుత్వానికి సూచించడం వరకే. దానిపై ముందుకు వెళ్ళడం ప్రభుత్వం చేయవలసిన పని, అక్కడ ఎదురవుతున్న అవరోధాలేమిటో తెలుసుకొని వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.**



ఆచార్య టి. గౌరీశంకర్

ఒక భాష బోధనాభాషగా,పాలనా భాషగా పత్రికాభాషగా కొనసాగినప్పుడే అది మనగలుగుతుంది. నేడు తెలుగుభాషకు సంబంధించి చూసినట్లయితే పత్రికా భాషగా మాత్రమే ముందంజలో ఉందనిపిస్తుంది.ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలోనే తెలుగు కనిపిస్తుంది, వినిపిస్తుంది. బోధనాభాషగా తెలుగు పరిస్థితి అనిశ్చితంగా ఉంది. ఇక పాలనా భాషగా తెలుగు గురించి మాత్రం చర్చించుకోవలసి ఉంది. ప్రపంచంలోని 7,164 భాషలలో ప్రజలచేత విరివిగా మాట్లాడబడే భాషలలో తెలుగు 14వ స్థానంలో ఉందంటారు. ఇక భారతదేశంలో అత్యధికులు మాట్లాడే హిందీ భాష తరువాత ఒకప్పుడు రెండవస్థానంలో ఉన్న తెలుగుభాష ఇప్పుడు నాల్గవస్థానంలోకి దిగిపోయింది. రెండవ స్థానంలో బెంగాలీ, మూడవస్థానంలో మరాఠీ భాషలు ఉన్నాయి. బ్రిటిష్ పాలనాకాలంలో 1943 నాటి నాణేల మీద ముద్రించిన నాలుగు భాషలలో తెలుగు ఒక భాషగా ఉండేది.2008లో అక్టోబర్ 31వ తేదీనభారత ప్రభుత్వం తెలుగుభాషకు ప్రాచీన హోదాను ప్రకటించింది. 2012లో ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్ తెలుగు లిపిని ప్రపంచంలోనే రెండవ ఉత్తమ లిపిగా గుర్తించింది. మొదటిస్థానంలో కొరియా లిపి నిలిచింది. సమస్త వైజ్ఞానిక, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలిగే పద సంపద, సామర్థ్యం తెలుగుభాషకు ఉందని జె.బి.ఎస్. హాల్డెన్ అనే విదేశీ పండితుడు ఏనాడో పేర్కొన్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆనాడు వైద్య, ఇంజినీరింగ్ కోర్సులు నిజాం పాలనాకాలంలో ఉర్దూ మాధ్యమంలో బోధించబడ్డాయి. 1948లో పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడ ఉర్దూను అధికార భాషగా ప్రకటిస్తే, అత్యధిక ప్రజల మాతృభాష బెంగాలీ అయినందువల్ల, వారంతా ఉర్దూను అధికారభాషగా వ్యతిరేకిస్తూ, బెంగాలీ అధికారభాషగా ప్రకటించాలని పెద్ద ఎత్తున ఉద్యమించి, అందులో నలుగురు విద్యార్థులు ప్రాణాలను కూడా పోగొట్టుకున్నారు. దాంతో ప్రభుత్వం దిగివచ్చి బెంగాలీని అధికార భాషగా ప్రకటించింది. ఒక భాష కోసం ఉద్యమించడం, ఆ భాష ద్వారా ఒక ప్రత్యేక దేశాన్నే సాధించుకోవడం ప్రపంచ చరిత్రలో బంగ్లాదేశానికే సాధ్యమయింది. దాని మేరకే కదా యునెస్కో ఫిబ్రవరి 21వ తేదీని ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం'గా ప్రకటించింది. 1920లో సథామస్ మన్రో మద్రాసు గవర్నర్గా వచ్చినప్పుడు కంపెనీ ఉద్యోగులందరూ దేశభాషలలోనే ప్రావీణ్యం సంపాదించాలనీ, ప్రజల భాషలతోనే ప్రభుత్వ వ్యవహారాలు కొనసాగించాలనీ ఆదేశించారు.ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం ఇచ్చారు.వాస్తవానికి తెలుగునాట 19వ శతాబ్దం మధ్య భాగం వరకు తెలుగునే అధికారభాషగా వాడుతుండేవారు. పరిపాలనకు ముందు తెలుగునేలపై తెలుగే అధికారభాషగా ఉండేది. చరిత్రలోకి వెళితే వేంగి చాళుక్యులు, రేనాటి చోళులు, కాకతీయులు, వెలనాటి చోళులు, రెడ్డిరాజులు, రేచర్ల వెలమలు, విజయనగర రాజులు, గజపతులు, కుతుబ్షాహీసుల్తానులు, తమ పాలనా కాలాలలో ఈ తెలుగు గడ్డపైన తెలుగును ప్రోత్సహిస్తూ వచ్చారు. ఆంగ్లేయులు ఆంధ్ర ప్రాంతంలో, నిజాం రాజులు తెలంగాణలో తెలుగుకు తగు ప్రాధాన్యం కల్పించారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగు అధికారభాష అయింది. తెలంగాణ విలీనం అనంతరం 1956లో ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి భాషా ప్రయుక్త




రాష్ట్రంగా ఆవిర్భవించింది. అప్పుడు తెలుగును అధికార భాషగా అమలు జరపాలని వావిలాల గోపాలకృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు 1956 సెప్టెంబర్ 29వ తేదీన కర్నూలులో శాసనసభ ఇందుకు ఆమోదించింది. తెలుగును అధికారభాషగా నిర్ణయిస్తూ ప్రభుత్వం 1966మే 14న అధికార భాషాచట్టాన్ని తీసుకొని వచ్చింది. అంటే అధికారభాషా చట్టం వచ్చి సరిగ్గా నేటికి అరవయ్యేళ్ళు అన్నమాట.అంతకు పూర్వమే 1946-47లో అంటే స్వాతంత్ర్యం రాకమునుపే తూర్పుగోదావరి జిల్లాలో, 1950-52లో తెలంగాణలోని తూర్పు ప్రాంతాలలో తెలుగును తాలూకా స్థాయిలో అధికారభాషగా అమలు చేయడానికి కొంత ప్రయత్నం జరిగింది. అప్పటికే దేశంలోని బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, మద్రాసు, హిమాచల్ ప్రదేశ్,గుజరాత్, మహారాష్ట్ర,సౌరాష్ట్ర, పంజాబ్, అస్సాం తదితర రాష్ట్రాలలో వారు తమ భాషలను అధికార భాషలుగా ప్రకటించుకొని శాసనాలు చేశారు. అధికారభాష అమలుపై కేరళ ప్రభుత్వం ఒక సంఘాన్ని కూడా నియమించింది. ఆంధ్రప్రదేశ్ 1964లో వావిలాల గోపాల కృష్ణయ్య ప్రతిపాదించిన అనధికార బిల్లును తొలుత ప్రజాభిప్రాయానికి, ఆ పైన సెలెక్ట్ కమిటీకి పంపారు.అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డి, విద్యా మంత్రి పి.వి.నరసింహారావు దానికి బదులుగా ప్రభుత్వ బిల్లు తీసుకొని వచ్చారు. దాన్ని శాసనసభ1966 మే 14న ఆమోదించింది. ఆనాటి నుంచి శాసనరీత్యా తెలుగు రాష్ట్రంలో తెలుగు అధికారభాష అయింది. 1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖలో ఒక ప్రత్యేకాధికారిని నియమించి, అధికారభాషగా తెలుగు అమలు కోసం ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. అధికారభాషా శాఖను అప్పటి విద్యా మంత్రి మండలి వెంకటకృష్ణారావుకు అప్పగించింది. 1967లో పి.వి. నరసింహారావు అధ్యక్షతన ఏర్పడిన సమీక్షా సంఘం 1971లో నివేదికను సమర్పిస్తే, 1974 మార్చి5వ తేదీన పైన తెలిపిన అధికారభాషా విభాగం ఏర్పడింది. 1974 మార్చి 19న ప్రభుత్వ ఉత్తర్వు నెం. 199 చట్టం 9వ విభాగం ద్వారా అధికార భాషా కమీషన్ ఏర్పడింది. వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షులుగా, మరో నలుగురు సభ్యులుగా ఈ కమీషన్ పని చేయడం ప్రారంభించింది. అన్ని శాఖలకు చెందిన తాలూకా, అంతకు కిందిస్థాయి కార్యాలయాల్లో శాసనేతరమైన అంశాలకు తెలుగువాడాలని, ఆంగ్లంవాడరాదని ప్రభుత్వం కచ్చితంగా చెప్పింది.1976లో ఒక అడుగు ముందుకు వేసి జిల్లాస్థాయి కార్యాలయాలకు దీన్ని విస్తరింపజేసింది. 1979లో శాఖాధిపతుల స్థాయి వరకు శాసనేతరమైన అంశాలకు తెలుగును వాడాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 1983 నుంచి దీన్ని సచివాలయ స్థాయిలో ప్రవేశపెట్టారు. 1988 అక్టోబర్ 28న ప్రభుత్వం చట్టపరమైన ఒక ప్రకటనను వెలువరించింది. దాని ప్రకారం శాసనపరమైన అంశాలకూ తెలుగును వాడవలసిఉంటుంది. అదొక విప్లవాత్మకమైన నిర్ణయం. ప్రజల భాషలో పరిపాలన జరగడమన్నది ప్రజాస్వామ్య పటిష్టతకు, పరిణతికి అత్యంత ఆవశ్యకం. పరిపాలన ఎట్లా, ఏవిధంగా జరుగుతుందో, దాని ఫలితాలను అనుభవించే ప్రజలకు క్షుణ్ణంగా తెలియాలి. వారి ప్రమేయం లేని వారి శ్రద్ధాసక్తులతో మమేకం కాలేని ప్రభుత్వ పరిపాలన నిష్ప్రయోజనం. అధికార భాషా సంఘం పరిధి ప్రభుత్వ కార్యాలయాలలోని పాలనా వ్యవహారాలలో తెలుగు ఎంతవరకు అమలు అవుతోంది. అందుకు తీసుకోవలసిన చర్యలేమిటో ప్రభుత్వానికి సూచించడం వరకే. దానిపై ముందుకు వెళ్ళడం ప్రభుత్వం చేయవలసిన పని, అక్కడ ఎదురవుతున్న అవరోధాలేమిటో తెలుసుకొని వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. అధికారభాషా సంఘం, తెలంగాణ సాహిత్య అకాడమీలకు కొత్త ప్రభుత్వం అధ్యక్షులను నియమించవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం ఉదాసీనవైఖరి వల్ల తెలుగు భాషా సాహిత్యాల ఉనికి అడుగంటిపోయే ప్రమాదం ఉంది. ప్రజల మనోభావాలు గమనించినప్పుడే ప్రభుత్వాలు మనగలుగుతాయి. ప్రతీది ప్రజా ఉద్యమాలు భుజాన వేసుకోవు. భాషాసాంస్కృతిక సంపదను కాపాడుకోవలసిన కర్తవ్యం ప్రజలతోపాటు ప్రభుత్వానిది కూడా. ●

(రచయిత:పూర్వపు అధికార భాషా సంఘం సభ్యులు)

# పేపర్ లీక్‌తో గందరగోళంలో విద్యార్థులు

బుగ్గన మధుసూదనరెడ్డి

పేపర్ లీక్ జరిగే అవకాశం లేకుండా సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధి సాధించినప్పటికి కూడా ఏదో రూపేణా ఈ లాలూచీలు సంభవిస్తూనే ఉండటం అత్యంత దురదృష్టకరం! ఈ పేపర్ లీక్ వ్యవహారం అనేది ఈ రోజుది కాదు. గతంలో సైతం పలు సందర్భాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌తో ఈ పేపర్ లీక్ వ్యవహారం ఆటలాడుకున్న విషయం మనందరికీ విదితమే. ముఖ్యంగా పేపర్ లీక్ జరిగే అవకాశం ఏ మాత్రం జరుగని రీతిలో సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నప్పటికి ఈ సమాజంలో లాలూచి పడే వ్యక్తులు ఏదో ఒక మూలాన ఉండటం వలన ఇప్పటికి ఏదో ఒక సందర్భంలో పబ్లిక్ పరీక్షల సమయాన ఏదేని సబ్జెక్టుకు సంబంధించి ఈ పేపర్ లీక్ ఉదంతం సంభవిస్తూ బాగా కష్టపడి చదివే విద్యార్థులు నోట్లో మట్టి కొట్టేలా ఈఅనారోగ్య వాతావరణం పొడచూపుతుండటం నిజంగా అత్యంత దురదృష్టకరమైన విషయం. ఇందుకు ప్రధాన కారణం ఈ సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్నవ్యక్తుల అండదండలతో దానికి సంబంధించిన శాఖలో పనిచేసే వ్యక్తులు డబ్బుకు ఆశపడి తిన్నింటి వాసాలు లెక్కబెట్టే రీతిలో వ్యవహారిస్తూ మన భారతదేశ విద్యావ్యవస్థకే, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే వారి ఉనికినే భ్రష్టపట్టించేలా వ్యవహరించే వారి తీరుతెన్నులు ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి ఓ సిగ్గుచేటైన,హేయమైన విషయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో సైతం నీట్ పరీక్షా పేపర్ లీక్ వ్యవహారం ఒకటి బయటకు రావడం ఒక పెను సంచలనానికి కారణభూతమైంది. కనీసం తరచుగా సంభవిస్తున్న ఈ చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అయిన విద్యాశాఖకు చెందిన వారు గాని పబ్లిక్ పరీక్షలు నిర్వహించే బోర్డు వారిలో ఎవరైనా గాని లేక ఆయా శాఖకుచెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఇలాంటి అనారోగ్య,అనాగరిక రీతిలో ఒకవేళ కాసులకు కక్కుర్తి పడి మరీ ఈ పేపర్ లీక్ వ్యవహారంలో




పాలుపంచుకుంటే మాత్రం అంతకు మించిన పాపంవారికి మరొకటి ఉండదు.ఎందుకంటే పబ్లిక్ పరీక్షల సమయాన ఈ పేపర్ లీక్ ఉదంతాలు బయటకు పొక్కితే మాత్రం అనవసరంగా బాగా చదువుకునే విద్యార్థుల, సరస్వతి పుత్రుల ప్రిపరేషన్ పై అది తీవ్ర ప్రభావం చూపి వారి చదువు ఆటకెక్కే ప్రమాదం సైతం బాగా పొంచి ఉంటుంది.ఎలాగంటే బాగా డబ్బు, పలుకుబడి ఉండి విద్య సరిగా అబ్బని విద్యార్థుల కోసం ఇలాంటి చట్టవిరుద్ధమైన పేపర్ లీక్‌కు ఎవరైనా ఉపక్రమిస్తే ఎంతైనా అది బాగా చదువులో ముందుండే వేలాది మంది విద్యార్థుల మెడకు ఖచ్చితంగా ఒక ఉరికంభం,ఒక ఉరికొయ్యను బిగించడం క్రిందకు వస్తుంది తప్ప మరొకటి కాదు. ఏదిఏమైన మన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆయా విద్యాశాఖమాత్యులు, ఆయా రంగానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే బోర్డు పెద్దలు ఈ పేపర్ లీక్ వ్యవహారం విషయంలో మరోసారి ఎంతమాత్రం తప్పు దొర్లకుండా చట్టరీత్యా అత్యంత కఠినంగా వ్యవహారించాల్సిన గురుతర బాధ్యత వారందరిపై ఎంతైనా వుంది.ఏమైనా తరచుగా సంభవిస్తున్న ఈ పేపర్ లీక్ వ్యవహారం మన భారతదేశ విద్యా వ్యవస్థకే ఒక మాయని మచ్చ వంటిది. ఒక విధంగా ఈ అనారోగ్య వాతావరణం పొడచూపడం అనేది మన విద్యావ్యవస్థ కీర్తి, ప్రతిష్టలకే ఖచ్చితంగామసకబార్చే వ్యవహారం ఈపేపర్ లీక్ ఉదంతం.ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు.అన్నింటికి మించి ముమ్ముందు రాబోయే అకాడమిక్ సంవత్సరం లోనైనా ఈ పదవ తరగతి,ఇంటర్మీడియట్, డిగ్రీపరీక్షలలో విద్యావ్యవస్థకు ఇలాంటి అప్రతిష్ట తెచ్చే ఈ పేపర్ లీక్ వ్యవహారం తలెత్తకుండా విద్యార్థుల భవిత అధోగతిపాలు కాకుండా చట్టరీత్యాచాలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర విద్యా శాఖ వారిపై,పబ్లిక్‌పరీక్షలు నిర్వహించే బోర్డు అధికారులపై ఎంతైనావుంది. రేపటి మన భారతదేశ అభివృద్ధిలో పాలుపంచుకోబోయేమన సరస్వతి పుత్రుల,జీవితాలు ఉజ్వలంగా మరో పదికాలాలపాటు దిగ్విజయంగా వర్ధిల్లాలి! ●

# రాబోయే కాలం విద్యుత్ వాహనాలదే!

డా. చిట్యాల రవీందర్

ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో వినిపిస్తున్న ఒకే ఒక నినాదం.. 'గో గ్రీన్' పెట్రోల్ బంకుల వద్ద పెరుగుతున్న క్యూలైన్లు, ఆకాశాన్ని తాకుతున్న చమురు ధరలు, వీటికి తోడు పర్యావరణ స్పృహ వెరసి సామాన్యుడి చూపు ఇప్పుడు 'ఎలక్ట్రిక్ వాహనం' వైపు మళ్లింది. నిన్నటి వరకు విలాసంగా చూసిన ఈవీలు, నేడు అవసరంగా మారి రోడ్లపై రయ్ రయ్ మంటూ దూసుకెళ్తున్నాయి. భారత ఈవీ మార్కెట్ ప్రస్తుత గణాంకాలు చూస్తే , భవిష్యత్తులో ప్రగతి పథంలో పయనం ఖాయం అనిపిస్తుంది. భారత దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం ఒక 'నిశ్శబ్ద విప్లవం'లా మొదలై, ఇప్పుడు సునామీలా మారుతోంది. 2025 నాటికి భారత్‌లో ఈవీ అమ్మకాలు 23 లక్షల మార్కును దాటడం ఒక చారిత్రాత్మక మైలురాయి. ద్విచక్ర వాహనాల హవా నడుస్తుంది. ఈవీ విప్లవంలోసింహభాగం టూవీలర్లదే. 2030 నాటికి దేశంలో అమ్ముడయ్యే ద్విచక్ర వాహనాల్లో 80 శాతం వాటా ఈవీలదే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే నిర్వహణ ఖర్చు కిలోమీటరుకు కేవలం 20నుండి 30 పైసలకే పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. 2023తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈవీ రిజిస్ట్రేషన్లు దాదాపు 40-50 శాతం వార్షిక వృద్ధిని కనబరిచాయి. కేవలం నగరాలకే పరిమితం కాకుండా, టైర్2, టైర్3 పట్టణాల్లో కూడా ఛార్జింగ్ పాయింట్లు వెలుస్తుండటంతో అమ్మకాలు పుంజుకున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కొత్తగా వస్తున్న పీఎం వంటి పథకాలు తయారీదారులకు, కొనుగోలుదారులకు భారీ సబ్సిడీలను అందిస్తున్నాయి. దీనివల్ల పెట్రోల్ వాహనాలకు, ఈవీలకు మధ్యఉన్న ధర వ్యత్యాసం క్రమంగా తగ్గుతోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఈవీ రంగం వైపు దేశాలు పరుగులు పెట్టేలా చేస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్ వివాదం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలుఅస్థిరంగా మారుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద దెబ్బ. ఈ 'ఎనర్జీ సెక్యూరిటీ' ముప్పు నుంచి బయటపడాలంటే విద్యుత్ వాహనాలే ఏకైక ప్రత్యామ్నాయం. 2070 నాటికి కర్బన ఉద్గారాలను సున్నాకు తగ్గించాలన్న భారత్ లక్ష్యానికి ఈవీలు వెన్నెముకగా నిలుస్తున్నాయి. యూరప్, చైనా దేశాలు ఇప్పటికే పెట్రోల్/డీజిల్ వాహనాల అమ్మకాలను నిలిపివేసే గడువులను ప్రకటించాయి. ప్రపంచ వ్యాప్తంగా లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి పెరగడంతో, గత దశాబ్ద కాలంలో బ్యాటరీ ధరలు దాదాపు 85 తగ్గాయి. ఇది వాహన ధరలను తగ్గించడంలో కీలక పాత్ర



పోషిస్తోంది. అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పటికీ, ఈ రంగాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్య 'ఛార్జింగ్ స్టేషన్ల కొరత'. బ్యాటరీ ఎక్కడ అయిపోతుందో అన్న భయం వినియోగదారులను ఇంకా వెంటాడుతోంది. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం, ప్రతి 2030 వాహనాలకు ఒక పబ్లిక్ ఛార్జింగ్ పాయింట్ కూడా అందుబాటులో లేదు. పెట్రోల్ కొట్టించడానికి పట్టే 2 నిమిషాలతో పోలిస్తే, ఈవీ ఛార్జింగ్‌కు పట్టే సమయం (30 నిమిషాల నుండి 4 గంటల వరకు)ఇంకా ఎక్కువే. దీనిని అధిగమించడానికి 'బ్యాటరీ స్వాపింగ్' విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. లక్షలాది వాహనాలు ఒకేసారి ఛార్జింగ్ పెట్టినప్పుడు విద్యుత్ గ్రిడ్‌పై పడే భారాన్ని తట్టుకునేలా మన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సి ఉంది.భవిష్యత్తు ఎలా ఉండబోతోంది అనే ప్రశ్నకు సమాధానంగా రాబోయే ఐదేళ్లలో ఈవీ రంగం ఊహించని మార్పులకు లోనవుతుంది. కొన్ని దిగ్గజాలు బ్యాటరీ తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తే, రూ. 5లక్షల నుండి 8లక్షల లోపే నాణ్యమైన ఈవీ కార్లు వచ్చేఅవకాశం ఉంది. కేవలం ఎలక్ట్రిక్ మాత్రమే కాకుండా, భారీ ట్రక్కులు మరియు బస్సుల కోసం 'గ్రీన్ హైడ్రోజన్' ఇంధనం కూడా తోడవుతుంది. కిరాణా షాపుల వద్ద, పెట్రోల్ బంకుల్లో, అపార్ట్‌మెంట్ పార్కింగ్‌లలో విరివిగా 'ఫాస్ట్ ఛార్జర్లు' అందుబాటులోకి వస్తాయి. పెట్రోల్ ధరల సెగ నుంచి తప్పించుకోవాలన్నా, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నా మనం ఈవీ బాట పట్టక తప్పదు. సవాళ్లను అధిగమిస్తూ, సాంకేతికతను అందిపుచ్చుకుంటే.. 2030 నాటికి భారత వీధులన్నీ శబ్దం లేని, కాలుష్యం లేని 'విద్యుత్ వాహనాల'తో కళకళలాడటం ఖాయం! బ్యాటరీ రీసైక్లింగ్ స్టార్టప్‌లు మన దేశంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయి. ఒక ఈవీ వాహనం తన జీవిత కాలంలో సాధారణ పెట్రోల్ వాహనం కంటే 50 శాతం తక్కువ కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తుంది. ప్రస్తుత తరుణంలో ఈవీ (ఎలక్ట్రిక్ వాహనం) కేవలం ఒక ప్రత్యామ్నాయం మాత్రమే కాదు, అది కాలం తెచ్చిన అనివార్యమైన ఆవశ్యకత. అస్థిరమైన అంతర్జాతీయ రాజకీయాలు, నిరంతరం మండుతున్న ఇంధన ధరల మధ్య సామాన్యుడి జేబుకు చిల్లు పడకుండా ఉండాలంటే విద్యుత్ వాహనమే శరణ్యం. పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచిచూసే అవసరం లేకుండా, ఇంట్లోనే స్మార్ట్‌ఫోన్ లాగా వాహనాన్ని ఛార్జ్ చేసుకునే సౌలభ్యం ఒక గొప్ప విముక్తిని ఇస్తుంది. భావోద్వేగ పరంగా చూస్తే, మనం మన తరువాతి తరానికి స్వచ్ఛమైన గాలిని, కాలుష్య రహిత వాతావరణాన్ని కానుకగా ఇవ్వాలి. ఈవీ వాహనం నడుపుతున్నప్పుడు వచ్చే ఆ నిశ్శబ్దం, మనం పర్యావరణానికి చేస్తున్న మేలును గుర్తు చేస్తూ ఒక రకమైన మానసిక తృప్తిని ఇస్తుంది. సాంకేతికంగా చూసినా, తక్కువ కదిలే భాగాలు ఉండటంవల్ల మెయింటెనెన్స్ ఖర్చు దాదాపు శూన్యం. మౌలిక సదుపాయాలు ఛార్జింగ్ స్టేషన్లు వేగంగా విస్తరిస్తున్న నేటి పరిస్థితుల్లో, తెలివైన బాధ్యతాయుతమైన పౌరుడిగా ఈవీని ఎంచుకోవడమే అన్ని విధాలా మేలైన నిర్ణయం. రాబోయే కాలం విద్యుత్ వాహనాలదే, అందుకే ఈవీయే మేటి! ●

# పొదుపు ఎఫెక్ట్: ప్రధాని కాన్వాయ్ కుదింపు



## హోంమంత్రి అమిత్‌షా, రాజ్‌నాథ్ మరికొందరు మంత్రులకు కూడా తగ్గింపు

## కాన్వాయ్‌లు తగ్గించిన బిజెపి రాష్ట్రాల సిఎంలు

**న్యూఢిల్లీ, మే 13:** ప్రధాని నరేంద్ర మోడీ పొదుపు, ఇంధన పరిరక్షణ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టారు. తన భద్రతా బాధ్యతలు చూసే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)ను ఉద్దేశించి, కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని, దీనికోసం కొత్త వాహనాలు కొనుగోలు చేయవద్దని స్పష్టంగా సూచించారు. భద్రతా ప్రమాణాలైన బ్లూ బుక్ మార్గదర్శకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎస్పీజీ ఈ ఆదేశాలను అమలు చేయడం ప్రారంభించింది. ప్రధాని నిర్ణయంతో పలువురు కీలక శాఖల కేంద్ర మంత్రుల వాహన కాన్వాయ్‌ను కూడా తగ్గించారు. హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాద్‌సింగ్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్, హార్‌దీప్‌సింగ్‌పూరీ వంటి మంత్రులు తమతమ కాన్వాయ్‌లను తగ్గించుకుఉంటున్నట్లు ప్రకటించారు.

ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం స్ఫూర్తితో బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వంటి వారు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని నిర్ణయించారు. ఇది దేశవ్యాప్తంగా పరిపాలనలో పొదుపును ప్రోత్సహించే విస్తృత ప్రయత్నాలలో భాగంగా కనిపిస్తోంది. ప్రభుత్వ స్థాయిలో పొదుపు చర్యలు చేపడుతూనే, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. అమెరికాఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన ముడి చమురు ధరలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రతిదానికీ దిగుమతులపై ఆధారపడితే దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నిస్తూ, స్థానిక ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రజలు తమ జీవనశైలిలో బాధ్యతాయుతమైన మార్పులు చేసుకోవాలని ప్రధాని సూచించారు. విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడం కూడా దేశభక్తితో సమానమని చెబుతూ, ప్రజలు ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లు వంటివి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను దేశంలోనే జరుపుకోవాలని ఆయన కోరారు.

## సైకిల్‌పై వచ్చిన జిఎస్టీ అధికారి

**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి దేశానికి సహకరించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో సానుకూల ప్రభావం చూపుతోంది. ఈ పిలుపుతో స్ఫూర్తిపొందిన జిఎస్టీశాఖ డిప్యూటీకమిషనర్ నరేంద్ర యాదవ్, తన విలాసవంతమైన కారును పక్కనపెట్టి ఆఫీసుకు సైకిల్‌పై వెళ్లడంప్రారంభించారు. ప్రస్తుతం దేశం అంతర్జాతీయంగా పలు సవాళ్లను ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో ప్రతి పౌరుడూ దేశ హితం కోసం ప్రయత్నంచేయడం బాధ్యత అని నరేంద్రయాదవ్ పేర్కొన్నారు. సైకిల్ కేవలం పర్యావరణహితమైన ప్రయాణ సాధనం మాత్రమేకాదు, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ఉత్తమమైనది. ఇంధనాన్ని పొదుపు చేయాలన్న ప్రధాని పిలుపును దృష్టిలో ఉంచుకుని, నాకు సైకిల్ ఉత్తమమైన మార్గంగా అనిపించిందని ఆయన అన్నారు.




## నందిగ్రామ్ సీటుకు సిఎం సువేందు గుడ్‌బై



### భవానీపూర్‌లో కొనసాగనున్న ముఖ్యమంత్రి

**కోల్‌కతా, మే 13:** పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారి, భవానీపూర్ సీటును నిలుపుకున్నారు. నందిగ్రామ్ స్థానాన్ని వదులుకున్నారు. బుధవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో భవానీపూర్ ఎమ్మెల్యేగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. నందిగ్రామ్ సీటును వదులుకున్నట్లు చెప్పారు. నందిగ్రామ్ నుంచి (ఉప ఎన్నిక ద్వారా) మరొకరు ఎమ్మెల్యేగా ఎన్నికవుతారు. అయితే రాబోయే ఐదేళ్లలో అక్కడి ప్రజలు నా లేమిని ఏమాత్రం అనుభవించనివ్వను. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పాటు, నందిగ్రామ్ ప్రజలకు నేను ఇచ్చిన అభివృద్ధి వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తా అని అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి రెండు స్థానాల్లో పోటీ చేశారు. భవానీపూర్, నందిగ్రామ్ నియోజక వర్గాల్లో ఆయన గెలిచారు. టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకి కంచుకోట అయిన భవానీపూర్ స్థానంలో 15,105 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరోవైపు సొంత నియోజకవర్గమైన నందిగ్రామ్‌లో ప్రత్యర్థి టిఎంసి అభ్యర్థిని పవిత్ర కర్‌పై 9,665 ఓట్ల ఆధిక్యంతో సువేందు అధికారి గెలిచారు. తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు. అయితే భవానీపూర్ స్థానాన్ని నిలుపుకున్న సిఎం సువేందు అధికారి, సొంత నియోజకవర్గమైన నందిగ్రామ్‌కు రాజీనామా చేశారు.




## అమెరికా 51వ రాష్ట్రంగా వెనిజులా

### ట్రంప్ వివాదాస్పద ట్రూత్‌పోస్ట్

**వాషింగ్టన్, మే 13:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ సోషల్‌లో వివాదాస్పద పోస్టు చేశారు. వెనిజులా దేశాన్ని 51వ అమెరికా రాష్ట్రంగా చూపిస్తూ ఓ పోస్టు చేశారు. ఇక విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో ఈ ఫోటోను కూడా షేర్ చేశారు. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మాడురోను నిర్బంధించిన సమయంలో ఆయన నైక్ ట్రాక్ సూట్ వేసుకున్నారు. అయితే అలాంటి ట్రాక్ సూట్ వేసుకున్న మార్కో రూబియో ఫోటోను కూడా ట్రంప్ షేర్ చేశారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో రూబియో ప్రయాణిస్తున్నట్లు పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యేందుకు ట్రంప్ చైనా టూరు వెళ్తున్నారు. అయితే వెళ్లేముందు ఆయన ఈ పోస్టు చేశారు. వైట్‌హౌజ్ కూడా ఈ ఫోటోలను తన ఎక్స్ అకౌంట్‌లో రిలీజ్ చేసింది.

వెనిజులాను కొత్త రాష్ట్రంగా పరిగణించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ పేర్కొన్నారు. మిలిటరీ ఆపరేషన్ ద్వారా కారకాస్ నుంచి మాడురోను అమెరికా కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. వెనిజులాపై ట్రంప్ చేసిన పోస్టును ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తప్పుపట్టారు. ఆ ఐడియాను తీవ్రంగా వ్యతిరేకించారు. అమెరికాకు 51వ రాష్ట్రంగా వెనిజులా ఉండబోదన్నారు.

## జ్యోతిష్కుడు రాధన్ నియామకం రద్దుచేసిన సిఎం విజయ్

**చెన్నై, మే 13:** తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టివికె) ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తొలిరోజే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. బుధవారం ఉదయం విశ్వాస పరీక్షలోనెగ్గిన వెంటనే, రాధన్ పండిట్ వెట్రివేల్ అనే జ్యోతిష్కుడిని ముఖ్యమంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (పొలిటికల్)గా నియమించడం పెను దుమారం రేపింది. మిత్రపక్షాలు, ప్రతిపక్షాల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో ప్రభుత్వం కొన్ని గంటల్లోనే ఆ నియామకాన్ని వెనక్కి తీసుకుంది. విశ్వాస పరీక్ష సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడిన డీఎండీకే చీఫ్ ప్రేమలత విజయకాంత్, ఈ నియామకాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి ఓఎస్డీగా ఒక జ్యోతిష్కుడిని నియమించడాన్ని నేను ఖండిస్తున్నాను. దీని ద్వారా యువతకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ఆయన మీ వ్యక్తిగత జ్యోతిష్కుడైతే, వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి మద్దతిస్తున్న కీలక మిత్రపక్షాలైన విడుతలై చిరుత్తైగల్ కట్చి (విసికె), కాంగ్రెస్ కూడా ఈ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇది ఒక లౌకిక ప్రభుత్వంలో ఆమోదయోగ్యం కాదు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రభుత్వ కర్తవ్యమని విసికె ప్రధాన కార్యదర్శి డి. రవికుమార్ పేర్కొంటూ, వెంటనే అతడిని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ కూడా ఒక జ్యోతిష్కుడికి ఓఎస్డీ పదవి ఎందుకు అవసరమని ప్రశ్నించారు. విమర్శలు వెల్లువెత్తడంతో టివికె నేత సిటి నిర్మల్ కుమార్ తొలుత ఈ నియామకాన్ని సమర్థించే ప్రయత్నం చేశారు. వెట్రివేల్‌ను మీడియా ప్రతినిధిగా నియమించామని, ఆయన వృత్తితో సంబంధం లేదని తెలిపారు. ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆసక్తికరంగా ఈ విషయంలో బిజెపి విజయ్‌కు అనుకూలంగా స్పందించింది. రాధన్ పండిట్ వెట్రివేల్‌కు గతంలోనూ రాజకీయ ప్రముఖులతో సంబంధాలున్నాయి.

దివంగత ముఖ్యమంత్రి జయలలితకు కూడా ఆయన సలహాదారుగా వ్యవహరించినట్లు సమాచారం. అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు వెళ్లరని వెట్రివేల్ చెప్పిన జోస్యం విఫలం కావడంతో వారి మధ్య విభేదాలు వచ్చినట్లు కథనాలొచ్చాయి. ఏదేమైనా, మిత్రపక్షాల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి కారణంగా, విజయ్ సర్కార్ వివాదాస్పద నియామకాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది.



## మా ఎమ్మెల్యేలకు విజయ్ సొమ్ములు ఆఫర్‌చేసారు పళనిసామి ధ్వజం

**చెన్నై, మే 13:** తమిళనాడు శాసనసభలో బుధవారం జరిగిన విశ్వాస పరీక్షలో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. కేవలం 22 మంది మాత్రమే వ్యతిరేకించారు. టివికె ప్రభుత్వానికి కాంగ్రెస్, విసికె, ఐయూఎంఎల్ వంటి పార్టీలు తమ మద్దతును ప్రకటించాయి. అన్నాడీఎంకే నుంచి తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలు విజయ్‌కు అండగా నిలవడంతో ప్రభుత్వం సుస్థిరమైంది. బలపరీక్షకు ముందు డిఎంకె సభ్యులు సభ నుంచి వాకౌట్ చేయడం గమనార్హం. మరోవైపు, బలపరీక్షకు ముందు సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి మాట్లాడుతూ విజయ్ తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారని, డబ్బు ఆఫర్ చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను విజయ్ కలవడాన్ని ఆయన తప్పుబట్టారు. తమ పార్టీ ఐక్యంగానే ఉందని ఆయన నమ్మబలికే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం మరోలా వచ్చింది. పళనిస్వామి వ్యాఖ్యలను రెబల్ నేత వేలుమణి తీవ్రంగా ఖండించారు. తామంతా స్వచ్ఛందంగానే విజయ్‌కు మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేస్తూ, పళనిస్వామి నాయకత్వంపై తమకు నమ్మకం లేదని పరోక్షంగా తేల్చిచెప్పారు. తమకు మంత్రి పదవులు అవసరం లేదని స్పష్టంచేశారు.


## ఐఆర్జీసి ఆర్థికమూలాలు చెపితే రూ.145 కోట్ల బహుమతి

**వాషింగ్టన్, మే 13:** ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆర్థిక మూలాల గురించి సమాచారం ఇచ్చిన వారికి 15 మిలియన్ డాలర్ల బహుమతిని ఇస్తామని అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఇది మన కరెన్సీలో సుమారు రూ.145 కోట్లు ఉంటుంది. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా, ఇరాన్ తీసుకుంటున్న చర్యల్లో పురోగతి కనిపించడంలేదు. యుద్ధాన్ని ముగించడానికి వాషింగ్టన్ చేసిన ప్రతిపాదనలను టెహ్రాన్ అంగీకరించలేదు. దీంతో ఒప్పందం ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఐఆర్‌జిసి, దాని సంబంధిత శాఖలకు కీలక ఆర్థిక వనరులను అందించే బినామీ కంపెనీలు, వ్యక్తులు, ఆర్థిక సంస్థల సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరింది. గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా, అణు కార్యక్రమాలు చేపట్టకుండా ఇరాన్‌ను దెబ్బతీయడమే లక్ష్యమని స్పష్టం చేసింది. మరోవైపు, యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన ప్రతి అవకాశాన్ని తాము వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పేర్కొన్నారు. అదే సమయంలో ఏ విధమైన దురాక్రమణకైనా తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## తమిళనాడుకు రీల్ సర్కార్‌కాదు రియల్ సర్కార్ కావాలి

### బలపరీక్ష తర్వాత అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ధ్వజం

**చెన్నై, మే 13:** తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంగా అధికార టివికె, ప్రతిపక్ష డిఎంకె మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఉదయనిధి స్టాలిన్‌చేసిన రీల్ వర్సెస్ రియల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని డిఎంకె శాసన సభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ విమర్శనాస్త్రాలు సంధించారు. తమిళనాడుకు కావాల్సింది రియల్ ప్రభుత్వమే కాని, సినిమాల్లో కనిపించే రీల్ ప్రభుత్వం కాదని, విజయ్ పార్టీని రాష్ట్రంలోని 65 శాతం మంది ఓటర్లు తిరస్కరించారని, టివికెపై ప్రజలకు విశ్వాసం లేదనే విషయం ఎన్నికల్లోనే తేలిపోయిందని అన్నారు. టివికెకు మ్యాజిక్ ఫిగర్ కూడా రాలేదని గుర్తుచేశారు. తప్పుడు హామీలతో విజయ్ ఎన్నికల్లో గెలిచారని, ఆయన ఇచ్చిన ఎన్నికల హామీలపై ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. విజయ్‌కు ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. పుష్ప సినిమా స్టైల్లో విజయ్ పాలన సాగుతోందని విమర్శించారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడి రాష్ట్రప్రతిష్టను విజయ్ దిగజార్చారని తీవ్రవ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను టివికె ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. విజయ్ ప్రభుత్వం అనైతికమార్గాల్లో మద్దతు కూడగట్టుకుందని ఆరోపిస్తూ, బలపరీక్ష ఓటింగ్‌ను డిఎంకే బహిష్కరించింది. ఉదయనిధి నేతృత్వంలో డిఎంకే ఎమ్మెల్యేలందరూ సభనుంచి వాకౌట్ చేశారు. అయితే, డీఎంకే వాకౌట్ చేసినప్పటికీ, 144 మంది ఎమ్మెల్యేల మద్దతుతో విజయ్ తన బలాన్ని నిరూపించుకోవడంలో విజయం సాధించారు.



## షణ్ముగం వర్గాన్ని పార్టీ పదవులనుంచి తొలగించిన పళనిసామి

### రెబెల్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ ఇపిఎస్ వర్గం ఫిర్యాదు!



**చెన్నై, మే 13:** తమిళనాడు అసెంబ్లీలో టివికె విజయ్ బలపరీక్షకు ముందురోజు జారీచేసిన పార్టీ విప్‌ను ధిక్కరించి టివికె విజయ్ సర్కారుకు మద్దతుపలికిన 24 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా వేటు వేయాలనికోరుతూ పళనిస్వామి వర్గం పట్టుబడుతోంది. పార్టీ ఫిరాయింపులనిరోధక చట్టం అనుసరించి వీరిపైచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. అంతేకాకుండా వీరి అనర్హతవేటు వర్తింప చేయాలని స్పీకర్‌కు దరఖాస్తుకూడా చేసింది. విజయ్‌పార్టీకి 105 మంది ఎమ్మెల్యేల మద్దతు రాగా కాంగ్రెస్; సిపిఐ, సిపిఎం, విసికె, ఐయుఎంఎల్ వంటి వాటితో 119 వరకూ చేరింది. అంతే కాకుండా పళనిస్వామిని వ్యతిరేకించిన షణ్ముగం నేతృత్వంలో 24మంది ఎమ్మెల్యేలు టివికెకు బాహాటంగానే మద్దతు పలికిన సంగతి తెలిసిందే. విప్‌ను 25మంది సభ్యులు ధిక్కరించారు. అందువల్లనే వారిని అనర్హులుగా ప్రకటించాలని తాము కోరుతున్నట్లు ఎఐఎడిఎంకెప్రకటించింది. పార్టీతరపున ఒక ఫిర్యాదును కూడా దాఖలుచేసారు. సివి షణ్ముగం, ఎస్పీ వేలుమణి, సి విజయ్‌భాస్కర్ ఇతరులను పార్టీ పదవులనుంచి కూడా తొలగించింది. ఎలాంటి విప్‌ను నియమించలేదని, అందువల్ల విప్‌ను ధిక్కరించారన్న వాదన ఉత్పన్నం కాదని రెబెల్ వర్గం చెపుతోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి విప్‌ను నియమించలేరని కొత్తగా ఎన్నికైన సభ్యులతో సమావేశం ఏర్పాటుచేయాలని, పార్టీ లెజిస్లేచర్ నాయకుడు, డిప్యూటీలను,విప్‌లను ఎన్నుకుంటారని అన్నారు. అయితే ఇపిఎస్ విప్‌ను నియమించినట్లు చెప్పడం వాస్తవంకాదని ఆయన నియమించే అధికారంలేదన్నారు. పళనిస్వామి అగ్రి కృష్ణమూర్తిని విప్‌గా నియమించారు. ఆయన్ను స్పీకర్ కూడా గుర్తించారని ఇపిఎస్ వర్గం చెపుతోంది. ప్రస్తుతంపార్టీ లెజిస్లేచర్ నేత నియామకంపై రెండు వర్గాలు కూడా స్పీకర్‌కు లేఖలు రాసుకున్నాయి. వీటిని పరిశీలించి స్పీకర్ చర్యలుచేపట్టాల్సి ఉంది.

## బలపరీక్ష వేళ రెండుగా చీలిన అన్నాడిఎంకె

**చెన్నై, మే 13:** తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ విశ్వాస పరీక్ష వేళ అన్నాడీఎంకే పార్టీ రెండుగా చీలింది. తన మెజారిటీ నిరూపించుకునేందుకు ఇవాళ సిఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా అన్ని పార్టీలు ప్రసంగం చేశాయి. అయితే అన్నాడీఎంకే తన నిర్ణయాన్ని ప్రకటిస్తున్న సమయంలో సభలో గందరగోళం నెలకొన్నది. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ ఎడప్పాడి కే పళనిస్వామి విశ్వాస పరీక్షను వ్యతిరేకించారు. సిఎం విజయ్‌కు వ్యతిరేకంగా తమ పార్టీ ఉందని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 47మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పళనిస్వామి చెప్పారు. రెబల్ వర్గానికి చెందిన అన్నాడిఎంకే ఎమ్మెల్యేలను సీఎం కలవడం ఎంత వరకు న్యాయమైందని ఆయన ప్రశ్నించారు. పళనిస్వామి స్టేట్మెంట్‌తో సభలో అరుపులు మొదలయ్యాయి. ఈ దశలో స్పీకర్ ప్రభాకర్ జోక్యం చేసుకున్నారు. బలపరీక్షపై అన్నాడీఎంకే ఎమ్మెల్యే ఎస్పీ వేలుమణిని మాట్లాడమని కోరారు. కొందరు అన్నాడీఎంకే అభ్యర్థులు దీన్ని వ్యతిరేకించారు. అయితే ఏ సభ్యుడితోనైనా మాట్లాడించే అధికారం తనకు ఉందని స్పీకర్ తెలిపారు. తీవ్ర వ్యతిరేకత మధ్య వేలుమణి ప్రసంగించారు. ఆయన టివికెకు తన మద్దతును ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు విజయ్‌కు ఓటు వేశారని, అందుకే అన్నాడీఎంకే బలపరీక్షకు మద్దతు ప్రకటిస్తోందని వేలుమణి అన్నారు. ఇక డీఎంకే పార్టీ వాకౌట్ చేసింది. తీర్మానంపై ప్రతిపక్ష నేత , డీఎంకే పార్టీ ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలను సీఎం విజయ్ కలవడాన్ని ఆయన తప్పుపట్టారు. ఛేంజ్ జరుగుతోందా, ఎక్స్ ఛేంజ్ జరుగుతోందా అని ఉదయనిధి ప్రశ్నించారు.

## సంక్షిప్తంగా..

### నిదాఖాన్‌కు ఆశ్రయమిచ్చిన కార్పొరేటర్ ఇల్లు కూల్చివేత

**నాసిక్, మే 13:** మహారాష్ట్రలోని నాసిక్ టిసిఎస్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, బలవంతపు మతమార్పిళ్ల కేసులో ప్రధాన నిందితురాలు నిదాఖాన్‌కు ఆశ్రయమిచ్చిన మజ్లిస్ కార్పొరేటర్ మతిన్ పటేల్ ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేశారు. కార్పొరేటర్ తన ఇంటిని, కార్యాలయాన్ని అక్రమంగా నిర్మించినట్లు మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి వివరణ కావాలని మున్సిపల్ కార్పొరేషన్ నోటీసు ఇచ్చింది. అయితే ఈ నిర్మాణాలపై తాను సమాధానం ఇవ్వడానికి కొంత సమయం కావాలని కోరుతూ మతిన్ పటేల్ పిటిషన్ దాఖలు చేయగా, స్థానిక కోర్టు తిరస్కరించింది. దీంతో ఛత్రపతి శంభాజీ నగర్ (ఔరంగాబాద్) మున్సిపల్ కార్పొరేషన్ బుధవారం ఆయన ఇంటిని, కార్యాలయాన్ని కూల్చివేసింది. తన ఇంట్లో నిదాఖాన్‌కు ఆశ్రయమివ్వడంతో మతిన్ పటేల్ అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వచ్చాయి.

### బెంగాల్ సిఎం సువేందు పిఎ హత్యకు రూ.కోటి సుపారీ!



**కోల్‌కత్తా, మే 13:** పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారి సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్యకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది సాధారణ హత్య కాదని, రూ. కోటికి పైగా ఖర్చు చేసి పక్కా ప్రణాళికతో అమలు చేసిన సుపారీహత్య అని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) అనుమానిస్తోంది. ఈహత్యలో అంతర్రాష్ట్ర ముఠాలు, నకిలీ వాహనాలు, అత్యాధునిక ఆయుధాలు వాడినట్లు దర్యాప్తులో తేలింది. సిబిఐ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి నార్త్ 24 పరగణాల జిల్లాలోని మధ్యమ్‌గ్రామ్‌లో హత్య జరిగిన ప్రదేశాన్ని మరోసారి పరిశీలించింది. సిబిఐ డిఐజి పంకజ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని బృందం, హత్య జరిగిన తీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. మే 6వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలువచ్చిన రెండురోజులకే చంద్రనాథ్ రథ్‌ను ఆయన ఎస్‌యూవీలోనే కాల్చి చంపారు. ఈ ఆపరేషన్‌కు రూ.కోటికి పైగా ఖర్చయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

### దురంధర్‌కు దీటుగా వచ్చిన మేరా ల్యారీ ఘోరంగా విఫలం




**కరాచి, మే 13:** భారత సినిమాకు దీటుగా సమాధానం చెప్పాలనే లక్ష్యంతో పాకిస్థాన్‌లో రూపొందించిన ఓ చిత్రం బాక్సాఫీస్‌వద్ద ఘోరంగా విఫలమైంది. ఆదిత్యధర్ దర్శకత్వంలోని భారతచిత్రం దురంధర్‌కు ప్రతిస్పందనగా వచ్చిన మేరా ల్యారీ అనే ఈసినిమాకు ప్రేక్షకులనుంచి కనీస ఆదరణ కూడా లభించలేదు. కొన్నిథియేటర్లలో కేవలం 22 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయని, దీంతో షోలను రద్దు చేసి సినిమాను ప్రదర్శనల నుంచి తొలగించారని పాక్ నుంచే కథనాలు వస్తున్నాయి. కరాచీలోని ల్యారీ ప్రాంతాన్ని ఉగ్రవాద కార్యకలాపాలతో ముడిపెట్టి భారత చిత్రం దురంధర్‌లో చూపించారని, దానికి భిన్నంగా ఆ ప్రాంత సానుకూల కోణాన్ని, ముఖ్యంగా మహిళల ఫుట్‌బాల్ క్రీడను ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో మేరా ల్యారీని తెరకెక్కించారు. ఈ నెల 8న విడుదలైన ఈ సినిమా మొదటిరోజే తేలిపోయింది.

### గురుగ్రామ్ ఆసుపత్రిలో సోనియాకు రొటీన్ చెకప్

**న్యూఢిల్లీ, మే 13:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఇవాళ అస్వస్థతకు గురయ్యారంటూ వచ్చినవార్తలపై ఆ పార్టీ స్పష్టతఇచ్చింది. ఆమె గురుగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ వైద్య పరీక్షలు (రొటీన్ చెకప్) చేయించుకున్నారని, అనంతరం తిరిగి ఇంటికి చేరుకున్నారని తెలిపింది. ఆమెకు చిన్నపాటి శస్త్రచికిత్స జరిగిందంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సోనియా రొటీన్ మెడికల్ చెకప్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆమె ఇంటికి తిరిగి వచ్చారని క్లుప్తంగా తెలిపారు.

### కన్నడ నటుడు, నిర్మాత దిలీప్‌రాజ్ హఠాన్మరణం



**బెంగళూరు, మే 13:** కన్నడ చిత్ర పరిశ్రమలో నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన ఆకస్మిక మృతితో శాండల్‌వుడ్ శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం దిలీప్ రాజ్‌కు తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయనను బతికించలేకపోయామని వైద్యులు ప్రకటించారు. పునీత్ రాజ్‌కుమార్‌తో కలిసి నటించిన మిలనా(2007) చిత్రంతో దిలీప్ రాజ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# చేయూత పెన్షన్లలో లైవ్‌నెస్ ఆథెంటికేషన్‌కు శ్రీకారం

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. చేయూత పథకం కింద తమ బ్యాంకు ఖాతాల్లో పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులకు 'లైవ్‌నెస్ ఆథెంటికేషన్' అమలు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. ప్రజాధనం నిజమైన అర్హులకు మాత్రమే చేరాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపడుతోంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్డిఓలకు ప్రభుత్వం జారీ చేసింది. మృతుల పేర్లపై అనధికారికంగా పెన్షన్లు విడుదలను నివారించడం, అర్హులైన పేదలకు న్యాయం చేయడం, పెన్షన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడం ఈ నిర్ణయంతో సాధ్యమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో 10 సంవత్సరాల క్రితమే మరణించిన వారి పేర్లపై కూడా పెన్షన్లు కొనసాగుతున్నాయంటూ పలు వార్తలు వెలుగు చూసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా సామాజిక భద్రతా పెన్షన్లకు లైవ్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సాంకేతికతను వినియోగిస్తూ ముందడుగు వేసింది. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్), బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్ సాంకేతికతతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల నూతన పెన్షన్ల మంజూరుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో త్వరలో కొత్త అర్హుల గుర్తింపు ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా, అనర్హులకు లబ్ధి చేకూరకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అమలు చేస్తున్న లైవ్‌నెస్ ఆథెంటికేషన్ ద్వారా వాస్తవ లబ్ధిదారుల గుర్తింపు సులభమవడంతోపాటు కొత్త అర్హులకు అవకాశాలు కల్పించేందుకు మార్గం సుగమం కానుంది.

### త్వరలో 2 లక్షల కొత్త పెన్షన్ల మంజూరు

### గ్రామసభ, వార్డు సభ ఆమోదంతోనే మృతుల పేర్ల తొలగింపు

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. వృద్ధులు, మంచానికే పరిమితమైన వారు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ డోర్ స్టెప్ ధృవీకరణ చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

మే 15 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రక్రియను జూన్ 15 నాటికి తొలి దశలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు చేపడు తోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిదిద్దుతూ, లీకేజీలను అరికడుతూ నిజమైన అర్హులకు చేరేలా సాంకే తికతను వినియోగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుండటంపట్ల ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.



సరస్వతి అంత్య పుష్కరాలకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆహ్వానించిన దేవాదాయ కమిషనర్, అర్చకులు

## సరస్వతి పుష్కరభక్తులకు ఆర్‌అండ్‌బి మౌలికవసతులు

### సరస్వతి అంత్యపుష్కరాలకు కోమటిరెడ్డికి దేవాదాయశాఖ ఆహ్వానం

**హైదరాబాద్ మే 13,ప్రభాతవార్త:** సరస్వతి అంత్యపుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయశాఖ సూచనల మేరకు ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో మౌలిక వసతులు మెరుగుగా ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలు రావాలని రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని దేవాదాయ శాఖ అధికా రులు, అర్చకులు మంత్రుల నివాస సముదాయంలోని మంత్రి క్యాంపు కార్యా లయంలో బుధవారం కలిసి ఆహ్వానించారు.రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు,అర్చకులు వేద మంత్రోచ్ఛారణ నడుమ శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు. గత ఏడాది సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైన నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరస్వతి అంత్య పుష్కరాలకు రోడ్లు భవనాలు శాఖ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు ప్రారంభించిందని,రోడ్లు భవనాలు శాఖ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల నిర్మాణం,రోడ్ కనెక్టివిటీ లాంటి భక్తుల సౌకర్యాలను ప్రధాన దృష్టి సారించినట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



కోర్సు దృశ్యాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా, నిత్యానందరావు, హనుమంతరావు తదితరులు

## భక్తరామదాసు కీర్తనలపై ఆన్‌లైన్ కోర్సు

### ఆవిష్కరించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (నాంపల్లి), మే 13 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సంగీతశాఖ ఆధ్వర్యంలో భక్తరామదాసు కీర్తనలు పేరుతో ఒక సంవత్సర కాలవ్యవధిగల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును తెలంగాణ రాష్ట్ర గవర్నరు శివప్రతాప్ శుక్లా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తదితరులతో కలిసి బుధవారం లోకభవన్‌లో కోర్సు ప్రారంభ దృశ్యచిత్రాన్ని మీటనొక్కి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ తెలుగు భక్తిసంగీత సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ భక్తరామదాసు కీర్తనల సాహిత్య, సంగీత వైభవాన్ని యువతరానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కోర్సును రూపొందించినట్లు తెలిపారు. ఈ కోర్సులో భక్తరామదాసు జీవిత విశేషాలు, కీర్తనల భావవ్యాఖ్యానం, రాగ తాళ పరిచయం, గానశైలి, ప్రదర్శన పద్ధతులు తదితర అంశాలను నిపుణులైన అధ్యాపకుల ద్వారా ఆన్‌లైన్‌లో బోధించనున్నారని, సంగీతంలో కనీస పరిజ్ఞానం కలిగి 10 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆచార్య కోట్ల హనుమంతరావు వివరించారు. కోర్సు ఫీజు రూ.5వేలుగా నిర్ణయించగా త్వరలో నిర్వహించనున్న ప్రవేశాల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. రాష్ట్రంలోని మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాలలో నివసించే సంగీతాభి మానులు కూడా ఆన్‌లైన్ ద్వారా ఈ కోర్సులో చేరే అవకాశం ఉందని కోర్సు కో ఆర్డినేటర్ డా.శేషులత తెలిపారు. కోర్సు వివరాలను విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ వనజ ఉదయ్ గవర్నరుకు వివరించారు.

## మద్దతు ధర ప్రకటిస్తే సరిపోదు, చట్టబద్ధత కల్పించాలి

### మార్కెట్‌లో ధర లేనపుడు కేంద్రమే కొనుగోలు చేయాలి

### రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం వివిధ పంట దిగుబడులకు కనీస మద్దతు ధర ప్రకటనలకే పరిమితమవుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. మద్దతు ధరలు ప్రకటించడంలో హేతుబద్ధత ఉండాలని సూచించారు. పంట మద్దతు ధరలను స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం ప్రకటించాలని సూచించారు. కేంద్ర కేబినెట్ వివిధ పంటల మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో బుధ వారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. మద్దతు ధరలు ప్రకటించిన పంట లకు మార్కెట్‌లో ఆ ధర రానప్పుడు, మొత్తం పంటను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ధరలు ప్రకటిస్తాం పంటలు కొనమంటే కుదరదని తేల్చి చెప్పారు. ఆర్భాటంగా మద్దతు ధరలు ప్రకటించడం కాదని, వాటికి చట్టబద్ధత కల్పించాలని కీలక డిమాండ్ చేశారు.

## విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యత

### టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,మే13,ప్రభాతవార్త:** విశ్వబ్రాహ్మణులు వృత్తిపరంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని ముఖ్యంగా బంగారు దుకాణదారులకు వేధింపులు లేకుండా మా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకొంటుందని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘాల నేతలతో టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తమ వర్గానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలను టీపీసీసీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మహేష్ కుమార్ గౌడ్ గారు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, వృత్తి ఆధారిత వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కొంత మంది దొంగలుపోలీసులను తప్పుదారి పట్టించేందుకు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణులకు చోరి చేసిన సొత్తును విక్రయించినట్లు చెప్పడంతో దానితో అమాయకులపై వేధింపులు పెరుగుతున్నాయనీ వారు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై వృత్తి పనులవారిని ఏలాంటి వేధింపులకు గురిచేయమని అన్నారు.

## అమూల్ పాల ధరలు పెంపు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:**దేశవ్యాప్తంగా సామాన్యుడి జేబుకు చిల్లు పడనుంది. ప్రముఖ డెయిరీ దిగ్గజం అముల్ పాల ధరలను పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా అన్ని రకాల పాలపై లీటరుకు రూ.2 మేర ధర పెంచుతున్నట్లు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (అముల్) ప్రకటించింది. ఈ పెరిగిన ధరలు గురువారం నుంచి అమల్లోకి రానున్నాయి. ధరల పెంపుతో అముల్ గోల్డ్ (ఫుల్ క్రీమ్) అర లీటర్ ప్యాకెట్ ధర రూ.35 , లీటర్ ధర రూ.70కి చేరింది. ఇకఅముల్ తాజా (టోన్డ్ మిల్క్) అర లీటర్ ధర రూ.30, లీటర్ ధర రూ.58గా నిర్ణయించారు.అముల్ ఆవు పాలు అరలీటర్ ప్యాకెట్ ఇప్పుడు రూ.31కి లభిస్తుంది. గేదె పాలు... అర లీటర్ ప్యాకెట్ ధర రూ.38కి పెరిగింది.

# తుమ్మిడిహెట్టి ప్రత్యామ్నాయాలపై అధ్యయనం

### ప్రభుత్వానికి తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ విన్నపం

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** ప్రాణహిత - చేవెళ్ల ఎత్తిపోతల పథకం - వార్ధా, వైన్‌గంగ నదుల సంగమం వద్ద ప్రతిపాదించిన తుమ్మిడి హట్టి బ్యారేజీ భౌగోళిక సాధ్యాసాధ్యాలతోపాటు బోరెపల్లి (తుమ్మిడిహట్టికి 9.0 కి.మీ దిగువన) ఇతర ప్రత్యామ్నాయాలపై అధ్యయనం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ కోరింది. ఈ విషయమై బుధవారం రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ప్రభుత్వ సలహాదారుకి అసోసియేషన్ నేతలు ఎం. శ్యాంసుందర్‌రెడ్డి, టి. వెంకటేషం, ఎ. మదన్‌మోహన్ తదితరులు వినతి పత్రం సమర్పించారు. వార్ధా, వైన్‌గంగ నదుల సంగమ ప్రాంతంలో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని ఖరారు చేసే ముందు ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని కోరారు. మహారాష్ట్రతో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రతిపాదిత బ్యారేజీ పూర్తిస్థాయి నీటి మట్టం కేవలం 148.0 మీటర్లకు మాత్రమే స్థిరీకరించాలన్నారు.

సాంకేతిక సాధ్యాసాధ్యాల అధ్యయనాల్లో సానుకూల ఫలితాలు వచ్చిన తర్వాతే బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని ఖరారు చేయాలని విన్నవించారు. వార్ధా, వైన్‌గంగ నదుల పరివాహక ప్రాంతాలు, వర్షపాత పద్ధతులు, హైడ్రోగ్రాఫ్‌లు భిన్నంగా ఉండటంతో నదుల వేగం, ప్రవాహ సమయాల్లో గణనీయమైన మార్పులు ఉంటాయని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనివల్ల బ్యారేజీ వద్ద అస్థిరమైన ప్రవాహం ఏర్పడి, పెద్ద సుడిగుండాలు, అడ్డ ప్రవాహాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా బ్యారేజీకి సంబంధించి విభిన్న ప్రత్యామ్నాయాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా బోరెపల్లి సైట్ (ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టికి 9.0 కి.మీ దిగువన) గురించి ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ అంశంపై సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం ఈ ఏడాది జనవరి 5న ఆర్వీ అసోసియేట్స్‌కు సిఫార్సు చేశామన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ వాటర్ కమిషన్, డిపిఆర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత ప్రతిపాదిత స్థలంతోపాటు అన్ని ప్రత్యామ్నాయాలపై నమూనా అధ్యయనాలను నిర్వ హించాలన్నారు. మహారాష్ట్రలో తక్కువ ముంపు ప్రభావంతో, సాంకేతిక ఆర్థికపరంగా ఉత్తమమైన ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ కోరింది.

## 'ప్రతిపక్షనాయకుడు' రబ్బర్ స్టాంప్ అనేది మోడీ భావన

### ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్,మే13,ప్రభాతవార్త:** సిబిఐ డైరెక్టర్ నియామకంలో ప్రతిక్షనాయకుడి అభిప్రాయం తీసుకోవాల్సిన అవసరం ఉంటుందనీ,భారత ప్రధాన మంత్రి మోడీకి ప్రతిపక్షనాయకుడు రబ్బర్‌స్టాంప్‌లా ఉండాలనే భావనతో ఉన్నారనీ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. సిబిఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోక పోవడంతో రాహుల్ గాంధీ ప్రధానికి లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సిబిఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వి హనుమంతరావు ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తు న్నట్లు ఆయన చెప్పారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బిజెపి అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో ఇతర వెనుకబడిన తరగతుల కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్ అబద్ధమని...బిజెపి వికాసం మాత్రమే జరుగుతోందని విహెచ్ వ్యాఖ్యానించారు.

# వేసవి దుక్కి భూమికి బలం, రైతుకు లాభం!

### రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** యాసంగి పంట కోత అనంతరం వానాకాలం సాగుకు ముందే భూమినిలోతుగా దున్నే వేసవి దుక్కులు రైతులకు దీర్ఘకాలిక లాభాలను అందిస్తాయని రాష్ట్ర వ్యవసాయశాఖ పిలుపునిచ్చింది. ప్రతీ రైతు వానా కాలం సాగుకు ముందే వేసవి దుక్కులను చేపట్టాలని సూచించింది. వేసవి దుక్కులు సాగులో కీలక వ్యవసాయ యాజమాన్య చర్యగా వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి స్పష్టం చేశారు. వేసవి ఎండలో భూమిని దున్నడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, చీడపీడల నివారణ, నీటినిల్వ, పెట్టుబడి తగ్గుదల, దిగుబడి పెరుగుదల వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు.

నేల గుల్లబారి పంట మొక్కల వేర్ల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్ప డతాయని, కలుపు మొక్కలు, పురుగుల గుడ్లు, లార్వాల సహజ నియంత్రణ సాధ్యమవుతుందని, నేలలో సేంద్రీయ కర్బనం, మిత్ర సూక్ష్మజీవులు పెరుగుతాయని, పంట నేలకు వర్షపు నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుందని, దిగుబడి పెరుగుతుందని ఇలా పలు లాభాలు వేసవి దుక్కులతో కలుగుతాయని వివరించారు. వేసవి దుక్కులను పంట కోత పూర్తయిన వెంటనే భూమిలో తేమ ఉన్నప్పుడే దుక్కులు చేయాలని, భూమిని లోతుగా దున్నాలని, ఏటవాలుగా దున్నడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుందని, దుక్కుల అనంతరం పంట అవశే షాలను భూమిలో కలపడం ద్వారా సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు.

ఈనేపథ్యంలో వేసవి దుక్కులను కేవ లం ఒక వ్యవసాయ పనిగాకాకుండా, భూమి ఆరోగ్యాన్నికాపాడే దీర్ఘకాలిక పెట్టుబడిగా భావించాలని రైతులకు ఆయన స్పష్టం చేశారు. వేసవి దుక్కులనుచేయడం ద్వారాభూసారం పెరగడం తోపాటు సాగుఖర్చుతగ్గి, లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు.

## ఏజెన్సీ విద్యుత్ సరఫరాలో సమూల మార్పులు

### అటవీ ప్రాంతాల్లో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు

### ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కీలక చర్యలు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** ప్రాంతీయ ఇంధన మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు కీలక చర్యలు చేపడతున్నాయి. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో సమూల మార్పులు చేసేందుకు నిర్ణయించాయి. ఇందులో భాగంగా, ములుగు జిల్లా విద్యుత్ గ్రిడ్‌కు వెన్నెముకగా నిలిచే, కార్లపల్లి సబ్‌స్టేషన్‌ను కొత్తగా నిర్మించిన లింగాల సబ్‌స్టేషన్‌కు అనుసంధానించే 27 కిలోమీటర్ల 33 మెగావాట్ల విద్యుత్ లైన్‌ను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పూర్తి చేసే దశలో ఉంది. ముఖ్యంగా, ఈ విద్యుత్ లైన్ దట్టమైన అటవీ ప్రాంతం గుండా వెళుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటీ వరుణ్‌రెడ్డి ఈ విద్యుత్ లైన్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అడవి గుండా విద్యుత్ లైన్ నిర్మాణం పూర్తి కావడం వల్ల, చారిత్రాత్మకంగా రవాణాపరమైన అడ్డంకులను ఎదుర్కొంటున్న మారుమూల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా స్థిరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్‌తో పాటు, కార్యాచరణ సామర్థ్యంపై దృష్టిసారించినట్లు తెలిపారు. ఆయన శాఖ యొక్క స్పెషల్ పర్పస్ మెషీన్ షెడ్ నిర్మాణంలో ఉన్న పనులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగవంతం చేసి, జూన్ నెలాఖరులోగా ఈ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను ఆడిట్ చేయడానికి సీఎండీ ఒక ప్రైవేట్ ఎస్పీఎం షెడ్‌ను సందర్శించారు. లోపభూయిష్టమైన యూనిట్లను ఆలస్యం లేకుండా మార్చేలా చూడటానికి, తమ రోలింగ్ స్టాక్‌ను పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే ఆయన పస్రా సెక్షన్‌లోని కొత్త సెక్షన్ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేశారు, అది ఈ నెలాఖరులోగా కార్యకలాపాలు ప్రారంభించాలని ఆయన అన్నారు. ఈ అప్‌గ్రేడ్‌లు గుండాల, కొడిశాల, లింగాల వంటి గ్రామాలలో విద్యుత్ నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తాయని, దీర్ఘకాలిక అల్ప వోల్టేజ్ సమస్యలను తొలగిస్తాయని నొక్కి చెప్పారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను అందించడమే తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. వినియోగదారుల సేవలను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం తప్పనిసరి అని ఆయన తేల్చి చెప్పారు.

# థియేటర్ల బంద్ లేదు

### పర్సంటేజీ ఇచ్చే సినిమాలే ప్రదర్శన

### సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడకే ఈ నిర్ణయం

### ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తాము థియేటర్లును బంద్ చేయడం లేదని తెలంగాణ ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. థియేటర్లు బంద్ చేస్తున్నామనే అసత్య ప్రచారం సాగుతోందని, కానీ అందులో నిజంలేదని స్పష్టం చేశారు. అయితే ఎవరైతే పర్సంటేజీ ఇస్తారో వాళ్ల సినిమాలను ప్రదర్శిస్తామని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ శ్రీధర్ స్పష్టం చేశారు. గీత ఆర్ట్స్, శ్రీ వెంకటేశ్వర, సురేశ్ ప్రొడక్షన్స్, ఏషియన్ లాంటి సంస్థలు ఇప్పటికే ఈ విధానంలోకి వచ్చాయని తెలిపారు. మిగిలిన వారు కూడా త్వరలో వస్తారని ఆశిస్తున్నామన్నారు. అంతరించిపోతున్న సినిమా హాళ్లని కాపాడండి" అనే పేరుతో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. చిత్ర బృందాలు జీవోలు తెచ్చుకున్నప్పటికీ ఇకపై సింగిల్ స్క్రీన్‌లలో టిక్కెట్ ధరలు పెంచబోమని స్పష్టం చేసింది. తాము ప్రేక్షకులు ఈ భరోసా ఇస్తు న్నామని హామీ ఇచ్చింది. పర్సంటేజీ విధానంలో సినిమాలు ప్రదర్శిస్తేనే సింగిల్ స్క్రీన్లకు మనుగడ ఉంటుందని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. కాగా తాము నిర్మించిన చిత్రాలను పర్సంటేజీ షేరింగ్ విధానంలో ప్రదర్శించేందుకు అంగీకరిస్తామని పలువురు వెల్లడించారు. తాము పర్సంటేజీ గురించి మాట్లాడుతున్నామని, ఇది ఎగ్జిబిటర్ల బతుకు పోరాటమని అన్నారు. ఏ సినిమాను లేదా నిర్మాతను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. థియేటర్లను రక్షించాలని కోరారు. మిగిలిన రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానం విధానం అమలు చేసి తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు రెంటల్ పద్ధతిని అమలు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. నిర్మాత తండ్రి లాంటి వాడైతే ఎగ్జిబిటర్ బిడ్డలాంటివాడని చదలవాడ శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాంటప్పుడే ఇండస్ట్రీ బాగుంటుందని అన్నారు. గత ఇరవై ఏళ్లుగా ఎగ్జిబిటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ఏడాదిగా పరిస్థితి మరింత దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాతగా నా మద్దతు ఎగ్జిబిటర్లకు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. కాగా మల్టీప్లెక్సుల్లో కొత్త టెక్నాలజీ, ఆధునిక సౌకర్యాలు తీసుకువస్తున్నారని సునీల్ నారంగ్ అన్నారు. మల్టీప్లెక్స్‌లో కొత్త టెక్నాలజీ, ఆధునిక సౌకర్యాలు తీసుకువస్తున్నారని, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో అలాంటి సౌకర్యాలు లేవని అన్నారు. డాల్బీ సౌండ్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉంటే ప్రేక్షకులు తప్పకుండా సింగిల్ స్క్రీన్‌లకు వస్తారని తెలిపారు. సింగిల్ స్క్రీన్లు మూతబడితే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకే నష్టమని పేర్కొన్నారు.

## అందరి గృహాల్లో వెలుగులు

### సమాజ సేవలో ఎన్పీడీసీఎల్: సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** అందరి గృహాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ఉన్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో సమాజ సేవలో సైతం తమ సంస్థ ముందుందని చెప్పారు. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం అత్యాధునిక 250 ఎల్‌పిహెచ్ ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ద్వారా పేదలు, దివ్యాంగులు, వృద్ధులు, అనాథ పిల్లల జీవితాల్లో కూడా వెలుగులు నింపే దిశగా కృషి చేస్తున్నామన్నారు. సమాజ సేవలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ఎల్లప్పుడు ముందుటారని తెలిపారు. డాక్టర్లు ప్రజల ప్రాణాలను ఎలా కాపాడుతున్నారో అలాగే ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ప్రతి ఒక్కరి ఇళ్లలో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. సమాజ సేవలో ఎక్కడ అవసరం ఉన్న వారికి చేతనైన సహాయం చేయలని కోరారు. విధి నిర్వహణలో అనునిత్యం తీరికలేని పనిలో నిమగ్నమై ఉంటూ, నిత్యం సమాజ సేవ కార్యక్రమాలు చేస్తూ వినియోగదారుల మన్నలను అలాగే ప్రజల ఆదరణ పొందుతున్నారన్నారు.

# ఆర్థిక వ్యవస్థపై ద్రవ్యోల్బణం నీడలు

### గరిష్ఠ స్థాయికి చేరుకుని 3.48 శాతంగా నమోదు

### తెలంగాణలో అత్యధికంగా 5.81 ద్రవ్యోల్బణం

### ఆంధ్రప్రదేశ్‌లో 4.2 శాతం మరో రికార్డు

### ఆర్థిక మాంద్య దిశగా ప్రమాద ఘంటికలు

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**దేశ ఆర్థిక వ్యవస్థపై ద్రవ్యోల్బణం నీడలు కమ్ముకుంటున్నాయి. 2026 ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకుని 3.48 శాతంగా నమోదైంది. మార్చిలో ఇది 3.40 శాతంగా ఉండగా, తాజా పెరుగుదల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించుకున్న 4 శాతం లక్ష్యానికి చేరువవుతోంది. దేశంలో పెరుగుతున్న ధరల ధోరణిని మే 12న గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పెద్ద రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం భారం అసమానంగా ఉంది. అయితే తెలంగాణలో అత్యధికంగా 5.81 ద్రవ్యోల్బణం నమోదు కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో 4.2 శాతం, తమిళనాడులో 4.18 శాతం, కర్ణాటకలో 4 శాతం చొప్పున ధరల పెరుగుదల ఉంది. ప్రస్తుతానికి ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 2-6 శాతం పరిధిలోనే ఉన్నప్పటికీ ఇది 4 శాతం లక్ష్యానికి చేరువవుతుండటం ఆర్థిక మాంద్యం దిశగా ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ పేర్కొన్న వివరాల ప్రకారం ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణం ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకడమే. ఏప్రిల్‌లో ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి చేరి నాలుగు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.26 శాతంగా ఉంటే, పట్టణాల్లో 4.1 శాతంగా ఉంది. ముఖ్యంగా ఆభరణాల ధరల పెరుగుదల వల్ల ఈ విభాగంలో ఏకంగా 17.66 ద్రవ్యోల్బణం నమోదైంది. వెండి ఆభరణాల ధరలు ఏడాదికాలంలో రికార్డుస్థాయిలో 144.3 పెరగ్గా, బంగారం, వజ్రం, ప్లాటినం ధరలు 40.7 శాతం మేర పుంజుకున్నాయి. నిత్యావసరాల విషయానికి వస్తే టమాటా 35.3 శాతం, కొబ్బరి 44.6 శాతం చొప్పున చేరడంతో వీటి ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తు న్నాయి. ఇక చమురు సెగ మరింత భారం అయింది. ఈ నెలలో ప్రస్తుతం భారత ముడిచమురు బాస్కెట్ ధర బ్యారెల్‌కు సుమారు 105 డాలర్ల కు చేరింది. ఇది కేంద్ర ప్రభుత్వం అంచనా వేసిన 77 డాలర్ల కంటే చాలా ఎక్కువ. ఈ పరిణామాలకు తగినట్లుగా రుతుపవనాల భయం వెంటాడుతోంది, భారత వాతావరణ శాఖ సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని అంచనా వేసింది. సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, ఆహార సరఫరా దెబ్బతినే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క అంతర్జాతీయ పరిణామాలు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఇరాన్ యుద్ధం వంటి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు రాబోయే నెలల్లో ధరలపై మరింత ఒత్తిడిని పెంచుతాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పులు, పెరిగే చమురు ధరల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రాల విధాన నిర్ణేతలు ఎటువంటి చర్యలు తీసుకుంటారో అనేది చర్చనీయాంశమైంది.

## తొలి సోలార్ విలేజ్‌గా రఘునాథపాలెం

### 821 గృహాల్లో వెలుగులు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ విలేజ్‌గా మార్చనున్నారు. రఘునాథపాలెన్ని పూర్తిగా సౌరశక్తితో నడిచే గ్రామంగా మార్చేందుకు, పైలట్ ప్రాతిపదికన ప్రతి ఇంటిలో ఒక రూఫ్‌టాప్ సోలార్ పవర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రఘునాథపాలెం గ్రామంలో ప్రస్తుతం అమలులో ఉన్న సౌర నమూనా ప్రాజెక్టును అధికారులు తనిఖీ చేశారు. గ్రామం అంతటా ఏర్పాటు చేస్తున్న సౌర రూఫ్‌టాప్ వ్యవస్థల పురోగతికి సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అధికారుల సమాచారం ప్రకారం, ఈ గామంలో సుమారు 1,081 మంది గృహజ్యోతి పథకం లబ్ధిదారులు ఉండగా, 821 గృహాలు సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయడానికి అనువైనవిగా గుర్తించబడ్డాయి. ఇప్పటి వరకు 110 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తయింది. ప్రతి ఇంటిలో కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు. గ్రామంలోని ముఖ్యంగా కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రజా ప్రదేశాల పైకప్పులపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

## ప్రధాని మోడీ రైతు పక్షపాతి: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 13 ప్రభాతవార్త:**ప్రధానమంత్రి నరేంద్రమోడి రైతన్నల సంక్షేమం, శ్రేయస్సు పట్ల ఎల్లప్పుడూ పూర్తి అంకితభావంతో ఉన్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో, 2026-27 ఖరీఫ్ సీజన్‌కు గాను 14 రకాల ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర మంత్రివర్గం చారిత్రాత్మక మరియు రైతు పక్షపాత నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కనీస మద్దతు ధర పెంపులో అత్యధికంగా పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) గింజలపై క్వింటాల్‌కు రూ.622, పత్తిపై క్వింటాల్‌కు రూ.557, వలిసెల (నైజర్ సీడ్)పై క్వింటాల్‌కు రూ.515, నువ్వులపై క్వింటాల్‌కు రూ.500 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ కీలక నిర్ణయం రైతులు పండించిన పంటలకు లాభదాయకమైన గిట్టుబాటు ధరను అందించడమే కాకుండా, వారి ఆదాయ భద్రతను పటిష్టం చేస్తుందన్నారు. అలాగే భారత వ్యవసాయ రంగాన్ని స్వయం సమృద్ధి, అభివృద్ధి పథంలో మరింత బలోపేతం చేస్తుందని, మన అన్నదాతల సంక్షేమానికి అంకితమైన ఈ ప్రాధాన్యత నిర్ణయాన్ని తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# బండి సంజయ్ తనయుడిని తప్పించాల్సిన అవసరం లేదు



## భగీరథ్ పరారీ పోస్టర్లు ఎవరు వేశారో, తీశారో తెలియదు

### ఇష్టాగోష్టిలో టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,మే 13,ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తనయుడిని తప్పించాల్సిన అవసరం తమకు లేదని,చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లోటిపిసిసిఅధ్యక్షుడు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నికార్సైన కాంగ్రెస్ లీడరనీ కొనియాడారు. రేవంత్ మా కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఐనప్పటికి సమాఖ్యస్ఫూర్తికి అనుగుణంగా మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామనీ ఆయన వివరించారు. బండి సంజయ్ కొడుకు కేసులో ఎలాంటి జాప్యం లేదనీ పోక్సో చట్టం తెచ్చిందేకాంగ్రెస్ పార్టీఅని ఆయన గుర్తు చేశారు.బాధితురాలికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది ఆ అమ్మాయి కి న్యాయం జరుగుతుందనీ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ,ప్రభుత్వం అండగా ఉంటుందనీ తెలిపారు. బండి సంజయ్ కొడుకు పారిపో యాడని పోస్టర్ ఎవరు వేశారో?ఎవరు తీసివేశారో? కూడా తెలియదనీ ఆయన చెప్పారు. ప్రజలు ప్రతిపక్ష పాత్ర కెసిఆర్ కి ఇచ్చారనీ ఆయన ఫామ్ హౌజ్ కి పరిమితం అయ్యారనీ ఆవేదన చెందారు. మునుపెన్నడు లేని విధంగా రాష్ట్రం లో పంటలు దిగుబడైనాయనీ అందుకే వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కొంత ఆలస్యం అయ్యిందని తెలిపారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం బెంగాల్ తరహాలో ఇక్కడ కూడా సెక్యులర్ ఓట్లు తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. మోదీ మన్సీహాన్ తో కలిసి రాలేదని,తెలంగాణ బిజెపి ఎంపీలకు సోయి లేదు మోదీ ఏదో అవసరానికి అనుకుంటే ఏమీ ఇవ్వలేదని అన్నారు. ప్రధాని వచ్చినప్పుడు తెలంగాణకు కావాల్సింది అడగారా? దానికి మోడీ స్పందించిన తీరు సరిగాలేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ కారులను మేము గౌరవిస్తున్నామనీ అదే విధంగా ప్రతిపక్ష నేతను గౌరవిస్తున్నామనీ తెలిపారు. బీఆర్ఎస్ ఏలుబడికాలంలో దళితుడు భట్టి ప్రతిపక్ష నేతగా ఉంటే కెసిఆర్ ఓర్వలేకకే ప్రతిపక్షం పోయారని మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ పై కెటిఆర్ భాష చెత్తగా ఉందని, బిఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నారని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రం లో బిజెపి వీక్ గా ఉందన్న విషయం మోడీ కి అర్థం అయ్యిందనీ అందుకే తెలంగాణ కు వచ్చినట్టు మాకు అర్ధంఅవుతుందన్నారు. కమ్యూనిస్టులు అయిపోయారు అనుకుంటే పొరపాటే దేశంలో కమ్యూనిస్ట్ భావజాలం లేదనే భావన తప్పు,ఇప్పటికీ కమ్యూనిస్ట్ లు సజీవంగా ఉన్నారని ఆయన అభిప్రాయ పడ్డారు.

12 ఏండ్ల నుండి పొదుపు గురించి మోడీ ఎందుకు మాట్లాడలేదు 90కిపైగా విదేశి ప్రయాణాలు చేసి అతి ఎక్కువ దేశాలు తిరిగింది కూడా ఈ ప్రధానమంత్రి మాత్రమే అని విమర్శించారు.గతంలో క్రూడ్ ఆయిల్ ధర సగం తగ్గితే పెట్రోల్ ధర సగం తగ్గించకుండా ఇన్నాళ్ళు పాత పెరిగిన ధరకు విక్రయించారని అన్నారు. పొదుపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందనీ, అదే విధంగా తెలంగాణప్రజలు పొదుపు చేస్తారు. కేంద్ర ప్రభుత్వమే పొదుపు చేయాలని హితవు చెప్పారు. ముఖ్యమంత్రిగా కెటిఆర్ ను మేం ఆగౌరవపరచలేదు ప్రస్తుత సంపన్నులు బంగారం కొంటారు. బీదవాళ్ళు పెళ్లి సమయంలోనే బంగారం కొంటారు అని ఆయన తెలిపారు. టిడిపి,బిజెపి జనసేన కలిసి తెలంగాణలో పోటీ చేసినా ఇబ్బంది లేదనీ మూడు పార్టీలు కలిసి పోటీ చేసినా ముప్పై శాతం దాటదనీ ఆయన చెప్పారు. మంత్రి పదవి కంటె టిపిసిసి చీఫ్ గా సంతోషంగా, గర్వంగా ఉన్నాను.

## విద్యుత్ సంస్థల్లో ఆస్తుల విభజనపై దృష్టి

### పంపిణీ సంస్థల సిఎండిల వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** మూడో విద్యుత్ పంపిణీ సంస్థ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుండి పూర్తి స్థాయి కార్యకలాపాలు నిర్వహించబోతుంది. ఈ మేరకు దీనికి సంబంధించి తెలంగాణ డిస్కం ల సిఎండిలు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి కీలకమైన ఆస్తుల విభజన లో భాగంగా మొదలైన వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల సర్వే పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 5.60 లక్షల వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు వున్నాయి. సెక్షన్ కు మూడు టీం ల చొప్పున, 744 ఆపరేషన్ సెక్షన్ లలో అనగా 2232 టీం లు ప్రతి రోజు ఈ సర్వే లో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. సర్వే కోసం రైతు డిస్కం ప్రత్యేక యాప్ రూపొందించింది. మూడో డిస్కం పరిధిలోకి తీసుకురానున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల సర్వేపై ఈ వీడియోకాన్ఫరెన్స్ లో విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పైలట్ ప్రాతిపదికన కొన్ని వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల సర్వే విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీన తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ మూడో డిస్కంకు లైసెన్స్ మంజూరు అంశంపై బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అసెట్ మ్యాపింగ్ ప్రక్రియ కూడా పూర్తయితే, ప్రభుత్వ నిర్ణయానుసారం జూన్ 2వ తేదీ నుండి కొత్త డిస్కం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యుత్ సంస్థల సిఎండిలు ముషారఫ్ ఫరూఖీ, జితేష్ వి. పాటిల్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రను మానుకోవాలి

### 18 బిసి సంఘాల హెచ్చరిక

**హైదరాబాద్, మే 13 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అమలవుతున్న ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తక్షణమే విరమించుకోవాలని 18 బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ, ప్రభుత్వ వైఖరి మారకుంటే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆసరాగా ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు జీవో నంబర్ 7ను తీసుకువచ్చి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని నేతలు ధ్వజమెత్తారు. గత 30 నెలలుగా ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రాగా అరుణ్ కుమార్ , బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, స్టేట్ బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య , స్టేట్ బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, స్టేట్ బీసీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి, స్టేట్ బీసీ ఫ్రంట్ చైర్మన్ గోరిగే మల్లేష్ యాదవ్, స్టేట్ బీసీ ప్రజా సమితి అధ్యక్షుడు రేగుల మధుసూదన్ రావు , స్టేట్ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ల సతీష్, స్టేట్ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామదేవ్ , స్టేట్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకన్న గౌడ్ , స్టేట్ బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణుడు, స్టేట్ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, స్టేట్ బీసీ విద్యార్థి సంఘం ఇంచార్జి నిఖిల్ పటేల్ , బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణ, ఎంబీసీ అసోసియేషన్ చైర్మన్ నిమ్మల వీరన్న , స్టేట్ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు జి.కృష్ణ, స్టేట్ బీసీ పోరాట సమితి అధ్యక్షుడు కూనూరు నరసింహా గౌడ్, స్టేట్ బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. చంద్ర, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం

### మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ, ఎమ్మెల్యే పద్మావతి, నేరళ్ల శారద

**హైదరాబాద్,మే13,ప్రభాతవార్త:** కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత చేతిలో అన్యాయానికి గురైన బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపదనీ టిపిసిసి మహిళా విభాగం అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,ఎమ్మెల్యే పద్మవతి, మాజీ మహిళా కమీషన్ చైర్మన్ నేరెళ్ళశారదలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బండి భగీరత్ చేతిలో మోసపోయిన బాధితురాలిని కలిసి వాస్తవాలు తెలుసుకుంటామనీ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మాజీ మహిళ కమిషన్ చైర్మన్ నెరేళ్ల శారదా, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా బాధితురాలికి న్యాయం చేసేందుకు దోషులను చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తోందనీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన బాధితురాలికి అండగా ఉంటామనీ అంటారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామనీ తెలిపారు. బాధితురాలికి, కుటుంబానికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ ఆమెకు మద్దతుగా నిలబడుతుందనీ అన్నారు.ఆ కుటుంబం పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తున్నామనీ వారు ప్రకటించారు.



## ఖాదర్ గూడెంలో ఆర్టీసీ బస్-కారు ఢీ

### ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు..

**మానకొండూర్, ప్రభాతవార్త :** వివాహ వేడుకలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్ కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా మరొకరి తీవ్ర గాయాలైన, సంఘటన మానకొండూరు మండల కేంద్రంలోని ఖాదర్ గూడెంలో బుధవారం రాత్రి ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా పట్టణ కేంద్రానికి చెందిన కె.వి వరప్రసాద్, సుమతి, ఖలీద్, డ్రైవర్ రాజు తో పాటు మరో ఇద్దరు మహిళలు వరంగల్ జిల్లాలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై తిరిగి కరీంనగర్ వైపు కారులో వెళ్తుండగా మానకొండూరు మండల పరిధిలోని ఖాదరగూడెం జగిత్యాల వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్న సంఘటనలో ఖలీద్, డ్రైవర్ రాజు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

సుమతికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సుమతి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కుపోయిన రాజును స్థానిక ప్రజల సహకారంతో బయటకు తీశారు. వివాహ వేడుకల్లో పాల్గొని తిరిగి కారులో వస్తుండగా డ్రైవర్ రాజు గూగుల్ మ్యాప్ ద్వారా డ్రైవింగ్ చేసుకుంటూ కరీంనగర్ వెళ్తుండగా ఖాదర్ గూడెం వద్ద ఆర్టీసీ బస్సుకు ఎదురుగా పోయి కారు ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# బండి భగీరథ్‌కు బిగుసుకుంటున్న ఉచ్చు

## పోలీసు విచారణకు గైర్హాజర్

### అతడి కోసం హైదరాబాద్, కరీంనగర్‌లో గాలిస్తున్న ప్రత్యేక బృందాలు

### శుక్రవారం విచారణకు వస్తానని లేఖ

### ముందస్తు బెయిలుపై నేడు హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు ఉచ్చు బిగుసుకుంటోంది. ఈ కేసులో బాధిత బాలికపట్ల అసభ్య ప్రవర్తన కింద ఫోక్సో కేసు నమోదు కాగా ఆమెపై భగీరథ్ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు కేసును విచారిస్తున్న సిట్ పోలీసులకు ఆధారాలు లభించాయని తెలిసింది. తనపై భగీరథ్ లైంగిక దాడికి పాల్పడిన విషయాన్ని బాధిత బాలిక సిట్ అధిపతిగా వున్న డిసిపి రితిరాజ్‌కు వెల్లడించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాలికను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిసింది. ఆ బాలికను బాలిక సంరక్షణ కేంద్రంలో మహిళా పోలీసుల పర్యవేక్షణలో వుంచారని సమాచారం. మరోవైపు ఈ కేసులో బుధవారం పోలీసుల విచారణకు హాజరు కావలసిన భగీరథ్ గైర్హాజర్ అయ్యారు. విచారణకు తనకు గడువు కావాలని, ఈ నెల 15వ తేదీన తాను హాజరవుతానని, పోలీసులకు మెయిల్ పంపడంతో పాటు లేఖను న్యాయవాది ద్వారా అందజేశారు. పోలీసుల విచారణకు భగీరథ్ హాజరు కాకపోవడంతో అతన్ని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఇంకోవైపు భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో జరగనున్న సమయంలో నగర వ్యాప్తంగా బుధవారం సాయి భగీరథ్ పరారీలో వున్నాడని, అతని ఆచూకీ తెలిస్తే పోలీసులకు తెలపాలని గుర్తు తెలియని వ్యక్తులు వాల్ పోస్టర్లు పెద్ద సంఖ్యలో అంటించారు. ఈ పోస్టర్లలో బండి సంజయ్ ఫోటో కూడా వుంది. ఈ నెల ఎనిమిదవ తేదీ రాత్రి పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై ఫోక్సో కేసు నమోదవడం తెలిసిందే. మైనర్ బాలికతో గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన చేవెళ్లలోని ఆలూరులో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన అభియోగాలపై ఈ కేసు నమోదు కాగా ఈ కేసు విచారణ ఆలస్యం అవడంతో సర్కారుపై విమర్శలు రావడం విదితమే. దీంతో సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కేసు విచారణకు సోమవారం సిట్ ఏర్పాటు కాగా దీని బాస్‌గా మహిళా డిసిపి రితిరాజ్‌ను నియమించారు. దీని తరువాత సిట్ విచారణను మొదలు పెట్టి పోలీసు స్టేషన్ నుంచి వివరాలు సేకరించి, బాధిత బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అనంతరం సాయి భగీరథ్‌కు సిట్ నోటీసులు జారీ చేసి బుధవారం నాడు విచారణకు రావాలని ఆదేశించింది. ఇదే సమయంలో భగీరథ్ హై కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌తో పాటు కేసును కొట్టి వేయాలని పిటిషన్ దాఖల చేశాడు. దీని తరువాత సిట్ బృందం బాధిత బాలికను మంగళవారం సాయంత్రం బాలల సంరక్షణ అధికారులు, వైద్యుల సమక్షంలో విచారించినట్లు తెలిసింది.

ఇదిలావుండగా ఫోక్సో కేసులో బుధవారం నాడు పోలీసుల విచారణకు హాజరు కావలసి వున్న భగీరథ్ గైర్హాజర్ అయ్యారు. భగీరథ్ కోసం పే ట్ బషీరాబాద్ పోలీసులు తాను పోలీసుల విచారణకు వస్తానని, పోలీసులకు సహకరిస్తానని భగీరథ్ తన లేఖలో తెలిపాడు. ఈ కేసులో తనపై మోపిన అభియోగాల్లో వాస్తవాలు లేవని, ఇందుకు సంబంధించి తన వద్ద వున్న ఆధారాలు, సాక్షాలను పోలీసులకు అందజేస్తానని అతను త న లేఖలో తెలిపాడు. భగీరథ్ విచారణకు వస్తాడని సమాచారం వుండగా అతను రాకపోవడంతో పాటు శుక్రవారం వస్తానని లేఖ పంపిన విష యాన్ని సిట్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో భగీరథ్‌ను అరెస్టు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించి అత ని కోసం హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. భగీరథ్ గురించి అతని కుటుంబీకులకు సమాచారం తెలిపి వెంటనే లొంగిపోయేలా చూడాలని పోలీసులు కోరినట్లు తెలిసింది. భగీరథ్ లొంగిపోకుంటే పర్యవసానాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరి ంచినట్లు తెలిసింది. మరోవైపు భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్, ఫోక్సో కేసు కొట్టివేయాలన్న పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరగనుంది. స్పెషల్ బెంచ్‌లో జరగనున్న ఈ కేసు విచారణపై ఉత్కంఠ నెలకొంది. కాగా జంట నగరాలలోని అనేకచోట్ల బుధవారం నాడు భగీరథ్ పరారీలో వున్నట్లు వాల్ పోస్టర్లు వెలిశాయి. ఫోక్సో కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనయుడు భగీరథ్ పరా రీలో వున్నాడని, ఎవరికైనా ఆచూకి తెలిస్తే పోలీసులకు తెలపాలని ఆ వాల్‌పోస్టర్‌లో వుంది. ఈ పోస్టర్లో బండి సంజయ్, ఆయన తనయుడు భగీరథ్ ఫోటో ముద్రించారు. ఈ పోస్టర్లను కొన్నిచోట్ల బల్దియా సిబ్బంది తొలగించారు.

# హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

## ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్

### ముఖ్యమంత్రితో భేటీ అయిన ఉబెర్ సీఈఓ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే13:** ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు.హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పని చేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (దితీవీ) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలం మరోసారి పొడిగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే13:** కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. ఈనెల 24తో ఆయన పదవీకాలం ముగియనుండటంతో తాజా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆయన పదవీకాల ఏడాది పాటు పొడిగింపునకు సంబంధించిన ఉత్తర్వులను కేంద్ర అపాయింట్‌మెంట్స్ కేబినెట్ కార్యదర్శి మనీషా సక్సేనా జారీ చేశారు. మరోవైపు సిబిఐ తదుపరి డైరెక్టర్ ఎంపి కోసం ప్రధాని మోడీ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ మంగళవారం సాయంత్రం ఢిల్లీలోని ప్రధాన మంత్రి అధికార నివాసంలో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో ప్రధానితో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ సభ్యులు ఉన్నారు. ప్రస్తుత సిబిఐ డైరెక్టర్ పదవీకాలం ఈనెల 24న ముగియనున్నందున కొత్త డైరెక్టర్‌ను ఎంపిక కోసం కమిటీ సమావేశం కావాల్సి వచ్చింది. కమిటీ పరిశీలనకు వచ్చిన పలువురు అధికారుల పేర్లపై చర్చించినట్లు సమాచారం. అయితే ఎంపిక ప్రక్రియపై రాహుల్‌గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్షపాతంతో కూడిన చర్యలలో భాగస్వామిని కాలేనంటూ తన భేదాభిప్రాయాన్ని వెల్లడించి రెండు పేజీల అసమ్మతి నోటీసు ప్రధాని మోడీకి అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 1986 బ్యాచ్ కర్ణాటక కేడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్ 2023లో సిబిఐ డైరెక్టర్‌గా రెండేళ్ల కాల వ్యవధితో నియమితులైన విషయం తెలిసిందే,. ఆ గడువు గత ఏడాది మేతో ముగియగా తొలిసారిఅప్పుడు పొడిగించారు. తాజాగా రెండోసారి కూడా ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఇంజనీరింగ్ ఎగుమతి ప్రోత్సాహక మండలి ప్రాంతీయ చైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే13:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో బుధవారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంజనీరింగ్ ఎగుమతి ప్రోత్సాహక మండలి(ఈఈపిసి ఇండియా) ప్రాంతీయ చైర్మన్ రఘు, రీజినల్ డైరెక్టర్ జేవీ రాజగోపాల్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. సిఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. సిఎం ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో బుధవారం తెలంగాణ లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

# కొలిక్కిరాని సిఎం పదవి ఎంపిక..

## వేణుగోపాల్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సతీశన్..!

**తిరువనంతపురం, మే 13:** నాలుగు రాష్ట్రాలు కేంద్రపాలితప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తప్రభుత్వాలు కొలువు దీరినప్పటికీ కేరళంలో మాత్రం ఇంకా సీఎం ఎంపిక పూర్తి కాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు. కేరళ కాంగ్రెస్ పార్టీలోని వర్గ విభేధాలే ఇప్పటివరకూ కొలిక్కిరాలేదని తెలుస్తోంది. సీఎం అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఎటూ తేల్చడం లేదు. సీఎం ఎంపిక విషయంలో కేరళ కాంగ్రెస్ పార్టీలో ముసలం ఏర్పడినట్లు కనిపిస్తోంది. కేరళంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ కూటమికి అధికారం దక్కింది. ఇంతకుముందు అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కూటమి ఓడిపోయింది. దీంతో యూడీఎఫ్ అధికారం చేపట్టాలి. ఈ కూటమిలో అత్యధిక సీట్లతో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సీఎం పదవి దక్కాలి. పార్టీ అగ్రనేతల మధ్య సీఎం సీటు విషయంలో బేధాభిప్రాయాలున్నాయి. సీఎం పదవి కోసం కాంగ్రెస్ నుంచి కేసీ వేణుగోపాల్, వీడీ సతీషన్, రమేష్ చెన్నితల పోటీ పడుతున్నారు. వీరిలో కేసీ వేణుగోపాల్ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతుతోపాటు, అధిష్టానం మద్దతు కూడా ఆయనకే ఉంది. ఆయనను సీఎం చేయడాన్ని సతీష్ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వేణుగోపాల్‌ను సీఎంగా ఎన్నుకుంటే ఆయన తన ఎంపీ స్థానానికి రాజీనామా చేయాలి. మరో చోట ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నికవ్వాలి. తను రాజీనామా చేసిన స్థానంతోపాటు కొత్తగా పదవి కోసం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో రెండు చోట్ల ఎన్నిక జరగాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది పార్టీకి అంత మంచిది కాదని సతీషన్ వర్గం అంటోంది. ఒకవేళ వేణుగోపాల్‌ను సీఎం చేస్తే తాను ఆ మంత్రివర్గంలో చేరబోనని కూడా సతీషన్ తెలిపారు. దీంతో ఈ ఇద్దరి వర్గాలు పార్టీలో విబేధాలు తీసుకొచ్చాయి. రమేష్ చెన్నితల వర్గం కూడా సీఎం పదవి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. దీంతో ఎవరికి పదవి ఇవ్వాలో తెలియక కాంగ్రెస్ సతమతమవుతోంది.

## ప్రతిభ చాటిన బిసి గురుకుల విద్యార్థులకు సన్మానం

### నేడు ఆదివాసి భవన్‌లో కార్యక్రమం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన బీసీ గురుకుల, బీసీ హాస్టల్ విద్యార్థులకు ఈనెల 14న బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన విద్యార్థినులకు అండగా ఉందని గత ఏడాది బీసీ గురుకుల, హాస్టల్ విద్యార్థులకు పురస్కారాలు అందించామని గుర్తు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రతిభావంతులైన 508 మంది విద్యార్థులను సన్మానిస్తామన్నారు. పపదో తరగతి ఫలితాల్లో ఎంజెపి నుంచి 147 మంది విద్యార్థులు (576 కటాఫ్), బిసి హాస్టల్ విద్యార్థులు 67 మంది కలిపి మొత్తం మొత్తం 214 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు.ఇక ఇంటర్మీడియట్ రెండవసంవత్సరం 137మంది విద్యార్థులకు, 28 మంది తీది హాస్టల్ విద్యార్థులు మొత్తం 165 మంది విద్యార్థులను ఈసందర్భంగా సత్కరిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 107మంది ఎంజేపి విద్యార్థులు, 22మంది బిసి హాస్టల్ విద్యార్థులు మొత్తం 129 మంది విద్యార్థులను సన్మానిస్తామని ఆయన తెలిపారు.

## 20న దేశ వ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే13:** ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్స్(ఎఐఓసిడి) మే 20న మెడికల్ షాపుల బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో ఆ రోజ దేశ వ్యాప్తంగా 12.40లక్షలకు పైగా మెడికల్ షాపులు మూతబడనున్నాయి. ఆన్‌లైన్‌లో ప్రిస్క్రిప్షన్ వెరిఫై చూడకుండా మందులు అమ్ముతున్నారని, భారీగా డిస్కౌంట్లు ఇవ్వడంతో నష్టాలు వస్తున్నాయని ఎఐఓసిడి) ఆందోళన వ్యక్తం చేసింది.

# ప్రమాదకరస్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు

## మూడు రోజులు మాడుపగిలే ఎండలు

### 48 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం

### పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ప్రమాదకరస్థాయిలో పెరుగుతోంది. రోజువారీ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అదనంగా నమోదవుతుండటం, వడగాలులు వీస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు. తెలంగాణలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రానున్న మూడు రోజులు 14, 15, 16 వరకు ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండబోతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారి చేసింది. ఈ నెల 22వ తేదీ వరకు ఎండల తీవ్రత ఇలాగే ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది వాతావరణ శాఖ. ఈ లెక్క ప్రకారం 47 నుంచి 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, మధ్యాహ్న వేళల్లో పనిచేసే కూలీలు జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరికలు జారీ చేసింది. కాగా.. మండు వేసవిలోనూ వాతావరణశాఖ చల్లని కబురు మోసుకొచ్చింది. నైరుతి రుతుపవనాలు దక్షి ణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని వాతావరణశాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం, ఉపరితల చక్రవాత ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులపాటు గువారం, శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని ఒకటి రెండు తూర్పు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# సైబర్ నేరాల్లో తక్షణ స్పందన ఉండాలి, చాకచక్యంగా నియంత్రించాలి: సిఎం చంద్రబాబు


సైబర్ నియంత్రణ వ్యవస్థపై సమీక్షిస్తున్న చంద్రబాబు

-సైబర్ నేరాల నియంత్రణా వ్యవస్థపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సిఎం
- గోల్డెన్ అవర్, ఏపి సైబర్ పాలసీ తదితర అంశాలపై సమాలోచనలు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్..

**విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేరాల ద్వారా బాధితుల సొమ్మును రాబట్టేందుకు గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని పోలీసు అధికారులు, బ్యాంకింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. సచివాలయంలో బుధవారం సైబర్ నేరాల్లో తక్షణ స్పందన ఏపీలో నియంత్రణా వ్యవస్థలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్థిక నేరాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లు ఇతరుల బ్యాంక్ ఖాతాలను వినియోగించకుండా చేపట్టే చర్యలు, గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ, ఏపీ సైబర్ పాలసీ తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. ఏపీలో సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు జరగకుండా బ్యాంకులు తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై రిజర్వు బ్యాంకును సంప్రదించాలని సీఎం సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సీఎం కొన్ని సూచనలు చేశారు. ఆధార్ ఆథంటికేషన్, కేవైసీ లాంటివి లేకుండా షెల్ కంపెనీలను కొందరు ప్రారంభిస్తున్నారని... ఇలాంటి ఘటనలపై అధ్యయనం చేయాలన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విషయంలో ఓ నియామవళిని సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు. అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాలను ఫ్లాగ్ చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సైబర్, ఆర్థిక నేరాల్లో ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. యూపీఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ అంశంపై మరిన్ని సాంకేతికపరమైన నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీటీఎస్ ముఖ్య భూమిక పోషించాలని... జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు. అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలన్నారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలని అన్నారు. రిజర్వు బ్యాంకు తీసుకు వచ్చిన మ్యూల్ ఆ కౌంట్ హంటర్ ఏఐ లాంటి టూల్స్ ను నకిలీ ఖాతాలను గుర్తించేందుకు వినియోగించాలన్నారు. సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం బ్యాంకర్లతో కలిసి రూ.116 కోట్ల పైచిలుకు మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా కాపాడగలిగామని స్పష్టం చేశారు. పిషింగ్, విషింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు, ఆన్ లైన్ లోన్ ఫ్రాడ్స్ సహా డిజిటల్ అరెస్టుల్లో బాధితులు సొమ్మును కోల్పోతున్నట్టు అధికారులు తెలిపారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో సీఐడీ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పని చేస్తోందని.. విజయవాడ, విశాఖ, తిరుపతిలలో సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్య మంత్రికి వివరించారు. మరోవైపు ఏపీలో సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా సైబర్ నేరాల్లో తక్షణ స్పందన ఉండాలి, చాకచక్యంగా నియంత్రించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై అధికారులతో చర్చించేటాకు రక్షణ కల్పిస్తున్నామని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కెపీసీ గాంధీ, బ్యాంకుల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో బ్యాక్‌లాగ్స్‌ను 16వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలి : మంత్రి నాదెండ్ల

**విజయవాడ, మే 13,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న బ్యాక్‌లాగ్స్‌ను ఈ నెల 16వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి జిల్లాల పౌర సరఫరాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నిరోధం, పెట్రోల్ బంకుల పర్యవేక్షణ వంటి కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. కొన్ని జిల్లాల్లో గ్యాస్ బుకింగ్ చేసినా డెలివరీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ఏలూరు, అనకాపల్లి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో బ్యాక్‌లాగ్స్ అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల 5 వేలకు పైగా బుకింగ్స్ పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తూ, బాధ్యులైన డిస్ట్రిబ్యూటర్లపై అవసరమైతే సస్పెన్షన్ వేటు వేయాలని ఆదేశించారు. గ్యాస్ బుక్ చేసిన 4 నుంచి 5 రోజుల్లోనే వినియోగదారుడి ఇంటికి సిలిండర్ చేరేలా యంత్రాంగం పనిచేయాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.




## దేశవ్యాప్తంగా బిజెపికి అనుకూల వాతావరణం

### - రాష్ట్ర బిజెపి సంఘటన మంత్రి మధుకర్

**తిరుపతి,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్‌లో బలపడేందుకు ఆరు నెలలపాటు అక్కడే ఉండి పార్టీ విజయానికి విశేషంగా కృషి చేసిన బీజేపీ ఆంధ్రప్రదేశ్ సంఘటన మంత్రి మధుకర్‌కు తిరుపతిలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించినట్లు మధుకర్ తెలిపారు. ప్రజల్లో బీజేపీపై విశ్వాసం పెరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి రానున్న రోజుల్లో సంపూర్ణ మెజారిటీతో బీజేపీ జెండా ఎగరవేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఆయనకు పూలమాలలతో స్వాగతం తెలిపారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులదు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి,నాయకలు వెంకట ముని, భాస్కర్, విశ్వనాథ్, లోక ప్రభాకర్ నాయుడు, తొండమ నాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవి ప్రసాద్ పాల్గొన్నారు.

# ఇంటెగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో భక్తులకు శీఘ్రంగా శ్రీవారి దర్శనం



**తిరుమల,మే 13 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవాడ గోవింద నామస్మరణతో తిరుమలకు వస్తున్న భక్తులకు వీలైనంత త్వరగా స్వామివారి దర్శనం చేయించేలా టిటిడి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సమన్వయ చర్యలతో మరింత సమర్థవంతంగా క్యూ లైన్ల నిర్వహణ, డిజిటల్ మానిటరింగ్‌తో రద్దీ భారీగా ఉన్నా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా నారాయణగిరి షెడ్ల నుండి క్యూలైన్లు బయటకు రాకుండా సమగ్ర చర్యలు వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరుగుతున్నప్పటికీ టిటిడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపడుతోంది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తోంది. తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసరాలు తదితర ప్రాంతాల్లో నెల కొన్న పరిస్థితులను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా భక్తుల కదలికలు, రద్దీ తీవ్రత, క్యూ లైన్ల ప్రవాహం వంటి అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. భక్తులు ఏ ప్రాంతంలో ఎక్కువసేపు వేచి ఉండకుండా క్యూ లైన్లను సమ తుల్యం చేయడం జరుగుతోంది. అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించడం, తాగునీరు, పాలు, అన్న ప్రసాదం, వైద్య సేవలు వేగంగా అందించడం వంటి చర్యలు సమన్వయంతో కొనసాగుతున్నాయి. దీంతో దర్శన సమయ నియంత్రణలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోంది. ప్రత్యేకించి నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని డిజిటల్ మానిటరింగ్ ద్వారా అంచనా వేసి, దానికి అనుగుణంగా భక్తులను విడతల వారీగా ముందుకు పంపించే విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా సాఫీగా దర్శనానికి చేరు కుంటున్నారు. టిటిడి అమలు చేస్తున్న ఆధునిక రద్దీ నిర్వహణ విధానాల వల్లే క్యూలైన్లలో భక్తుల రద్దీ తక్కువగా కనిపిస్తోంది. గతంలో మాదిరిగా భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిలిచిపోయే పరిస్థితులు లేకుండా, సాంకేతిక ఆధారంగా టిటిడి యంత్రాంగం సమన్వయంతో భక్తులను వేగంగా దర్శనానికి పంపిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ భక్తులకు సౌకర్యవంతమైన,

వేగవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశాలతో అధి కారులు 24 గంటలూ అప్రమత్తంగా పనిచేస్తున్నారు.

## ఉండి నియోజకవర్గంలో అక్రమ కూల్చివేతలు ఆపాలి : సిపిఎం

### - నీట్ పరీక్షల నిర్వహణ నుండి ఎన్.టి.ఎ.ను తప్పించాలి

**విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల అక్రమ కూల్చివేతలను ఆపాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉనుదుర్రు గ్రామంలో పేదల ఇళ్ళను కూల్చడాన్ని వ్యతిరేకిస్తున్న సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాస్ ని పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నదన్నారు. వెంటనే ఉండి నియోజకవర్గంలో కొనసాగుతున్న పేదల ఇళ్ల అక్రమ కూల్చివేతలను ఆపాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. గత సంవత్సర కాలంలో ఉండి నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో ఆక్రమణలు, కాలుష్యం పేరుతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అండదండలతో పేదల ఇళ్ల కూల్చివేతలు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఉనుదుర్రు గ్రామం 50 ఏళ్ళకు పైగా నివాసం ఉంటున్న వారికి కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా అక్రమంగా 60 ఇళ్లను నేలమట్టం చేయడం అన్యాయమన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదల ఇళ్ల అక్రమ కూల్చివేతలను నిలిపివేయాలని కోరారు.ఇక మరో ప్రకటనలో నీట్ పరీక్షా పేపర్ లీకేజ్‌ను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పరీక్షల నిర్వహణ నుండి ఎన్.టి.ఎ.ను తప్పించాలని డిమాండ్ చేసింది.. లీకేజ్ దాదాపు 23 లక్షల మంది విద్యార్థులను తీవ్రమైన మానసిక ఒత్తిడిని గురిచేసిందన్నారు. ఎన్‌టిఎ నిర్వహిస్తున్న అనేక పరీక్షల్లో పెద్ద ఎత్తున అవినీతి, నిర్వహణ లోపాలు, లీకేజీలు మొదటిది కాదు అని, ప్రారంభం నుండీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షా వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తూనే ఉంది అని చెప్పారు.



## తిరుచిరాపల్లి ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్‌గా టి.విజయలక్ష్మి

**ఒంగోలు, మే 13, ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్‌గా 1992 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి టి. విజయలక్ష్మి నియమితులయ్యారు. ఆమె మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సతీమణి. ఈ నెల 11వ తేదీన ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు.గత 33 సంవత్సరాలుగా ఆదాయపు పన్ను శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన విజయలక్ష్మి బెంగళూరు, రాయచూర్‌లలో జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం కర్నూలులో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే చెన్నైలో కమిషనర్‌గా, హైదరాబాద్‌లో ప్రిన్సిపల్ కమిషనర్‌గా సేవలందించారు.విద్యార్హతల విషయానికి వస్తే.. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈసీఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన ఆమె.. బెంగళూరు ఐఐఎంలో ఎంబీఏ చేశారు. అదనంగా సింగపూర్ యూనివర్సిటీ, అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలలో ప్రజా విధానాలపై ప్రత్యేక డిగ్రీలు పొందారు.

## జూలై 31లోపు పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తవ్వాలి :టిటిడి జెఇఒ శరత్



**తిరుమల,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో నిర్మాణంలో ఉన్న పద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను జూలై 31వ తేదీ లోపు పూర్తి చేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులకు ఆదేశించారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశాలతో టిటిడి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంతస్తులో ఏర్పాటు చేయనున్న విభాగాలు, గదులు, వైద్య సదుపాయాలు, మౌళిక వసతులు తదితర అంశాలను స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదిక సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి ఫ్లోర్‌లోని గదుల వారీగా ఎలక్ట్రికల్, ఎయిర్ కండిషనింగ్, కంప్యూటర్ నెట్‌వర్క్, వైద్య పరికరాలు, వైద్యులు రోగుల అవసరాలకు అనుగుణంగా కల్పిస్తున్న సౌకర్యాలను లే అవుట్ ప్రణాళికలో పొందుపరచాలని అధికారులను


## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్ - రూ.53 లక్షల విలువైన బంగారం, వెండి, బైకులు స్వాధీనం

**పులివెందుల, మే 13, ప్రభాతవార్త:** మోటార్ సైకిళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, బంగారు దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పులివెందుల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.53,01,700 విలువైన 19 మోటార్ సైకిళ్లు, బంగారం, వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కదిరి రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద మోటార్ సైకిల్ దొంగలను, కడప రింగ్ రోడ్డులో మరో ముఠాను, పార్నపల్లె బస్టాప్ వద్ద బంగారు షాపులో చోరీ చేసిన నిందితులను, ఉలిమెల్ల రింగ్ రోడ్డులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 22 కేసులను ఛేదించినట్లు చెప్పారు.నిందితుల వద్ద నుంచి రూ.18.15 లక్షల విలువైన 19 మోటార్ సైకిళ్లు, రూ.2.79 లక్షల విలువైన ఒక కిలో వెండి వస్తువులు, రూ.50 వేల విలువైన రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే చైన్ స్నాచింగ్ కేసుల్లో 91 గ్రాముల బంగారం (రూ.13.52 లక్షలు), బంగారు దుకాణాల్లో చోరీ చేసిన 103 గ్రాముల బంగారం (రూ.15.25 లక్షలు) స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మోటార్ సైకిల్ చోరీ కేసుల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నాగభాషా, పులివెందుల మంగళ కాలనీకి చెందిన బూసపాటి కుమార్, ఎల్లనూరు మండలానికి చెందిన గున్నోళ్ల గంగయ్య, నగిరిగుట్టకు చెందిన షేక్ హుస్సేన్, గొండగట్టుపల్లెకు చెందిన మలికి విజయ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే బీహార్ రాష్ట్రంలోని భగల్పూర్ జిల్లాకు చెందిన చోటు కుమార్, బంగారు దుకాణాల్లో చోరీలకు పాల్పడిన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పాత కందూరుకు చెందిన నారాయణమ్మ, ఉమాదేవిలను కూడా అరెస్టు చేసినట్లు చెప్పారు.కేసులను ఛేదించి భారీ స్థాయిలో ఆస్తులను రికవరీ చేసిన పులివెందుల పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

# తిరుమల సమాచారం

## పారదర్శకత కోసమే ఆన్‌లైన్‌లో విడుదల

### శ్రీవాణి దర్శన టికెట్లపై అపోహలను నమ్మొద్దు: టిటిడి



**తిరుమల,మే 13 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్‌కు సంబంధించి వస్తున్న వార్తల నేపథ్యంలో భక్తులు అపోహలకు గురికావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. టిటిడి శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్ విధానాన్ని 2019 మే నెలలో ప్రవేశపెట్టింది. అప్పటి నుండి భక్తులు మధ్యవర్తుల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవడం జరుగుతోంది. అందులోని లోటుపాట్లను , భక్తుల నుండి వచ్చిన సూచనలు, సలహాల మేరకు 2024 సంవత్సరం జూన్ నుండి భక్తులకు పారదర్శకంగా, సురక్షితంగా సేవలు అందించేందుకు శ్రీవాణి టికెట్ బుకింగ్ విధానాన్ని అత్యంత పటిష్టంగా రూపొందించడం జరిగింది. శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం,వ్యవస్థలో చొరబడటం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని పేర్కొంది. భక్తులు అపోహలకు గురి కావద్దని, అయితే కొందరు దళారులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఏఐ ఆధారిత ఆటో ఫిల్లింగ్, ఆటో కాపీయింగ్ వంటి పద్ధతుల ద్వారా వేగంగా వివరాలు నమోదు చేసి టికెట్లను బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని టిటిడి తెలిపింది. ఇలాంటి అనుమానాస్పద కార్యకలాపాలను టిటిడి సాంకేతిక విభాగం ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత ఐడీలు , అక్రమ బుకింగ్ విధానాలను వెంటనే నిరోధించి తదనుగుణంగా సాఫ్ట్ వేర్ ను కూడా ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ నిరంతర నిఘా ఉంచడం జరుగుతోంది. అదేవిధంగా కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టించి నకిలీ టికెట్లను విక్రయిస్తున్న నిందితులపై కూడా టిటిడి కఠిన చర్యలు తీసుకోవడం జరిగింది. అడ్వాన్స్ బుకింగ్ సాఫ్ట్ వేర్ ను ముందు వచ్చిన వారికి ముందు బుక్ చేసుకునే విధానంలో అభివృద్ధి చేయడం జరిగింది. బుకింగ్ సమయంలో ఏదైనా కారణంగా టికెట్ బుక్ కాకపోయినా ,నగదు చెల్లింపులో లోపం తలెత్తితే వెంటనే ఆ టికెట్లు భక్తులకు అందుబాటులోకి వచ్చేలా ఈ అప్లికేషన్ పని చేస్తోంది. భక్తులు కేవలం అధికారిక టిటిడి వెబ్‌సైట్ ,అధికారిక మార్గాల ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## 18న ఆగస్టునెల ఆర్జితసేవ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో

**తిరుమల, మే 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఆగస్టు నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఆగస్టు నెల ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్‌లో ఈనెల 18వతేదీ సోమవారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 20వతేదీ ఉదయం 10గంటలవరకు బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22 మధ్యాహ్నం 12గంటల వరకు ఆన్‌లైన్‌లో సొమ్ముచెల్లించి లక్కీడిప్‌లో టిక్కెట్లు మంజూరవుతాయి. ఇక కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ టిక్కెట్లు వర్చువల్ కోటా తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. 23వతేదీ శ్రీవాణి ట్రస్ట్ టిక్కెట్లకు సంబంధించి ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 23న మధ్యాహ్నం 3గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు,దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఉచిత టోకెన్లు జారీచేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు, 25న వసతి కల్పన విడుదల చేస్తారు.

## వేసవి సెలవులు.. భక్తులతో కొండ కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 14 గంటలు



**తిరుమల, మే 13 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవిసెలవులతో బుధవారం ఉదయానికి వైకుంఠమ్2లో 14కంపార్టుమెంట్లు నిండాయి. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 14గంటలు సమయం పడుతోంది. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు....ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 37వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

## రిషికేశ్‌లో చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, మే 13 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానమ్ ఆధ్వర్యంలోని రిషికేష్‌లో చంద్రమౌళీశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా ఆరంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 15న వైభవోపేతంగా కల్యాణోత్సవం హిమాలయ పర్వత శ్రేణుల నడుమ పవిత్ర గంగాతీరాన ఆంధ్రాశ్రమంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మే 12న ప్రారంభమైన ఈ ఉత్సవాలు మే 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించబడనున్నాయి. 15న జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మే 13న ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చి ఆధ్యాత్మికానందాన్ని పంచారు. నేటి ఉదయం శేషవాహనం, రాత్రి గజవాహన సేవలు నిర్వహించనున్నారు. మే 15న ఉదయం సింహవాహన సేవ అనంతరం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. అనంతరం వృషభవాహన సేవ నిర్వహిస్తారు. మే 16న ఉదయం త్రిశూలస్నానం, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవం రేపు సాయంత్రం 4.30 గంటలకు జరుగనుంది. గృహస్తులు (ఇద్దరు) 501/రూపాయలు టికెట్ కొనుగోలు చేసి దివ్యోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందవచ్చు.

# చరిత్రలో నిలిచిపోయేలా నెల్లూరు మహానాడు

### - కిసాన్ సెజ్ వేదికగా టిడిపి పండుగకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు: మంత్రి నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**కొడవలూరు (నెల్లూరు), మే 13, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక ఉత్సవం మహానాడుకు నెల్లూరు జిల్లా ముస్తాబవుతోంది. చరిత్రలో నిలిచిపోయేలా, పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం నింపేలా మే 27, 28, 29 తేదీల్లో కిసాన్ సెజ్ వేదికగా ఈ వేడుకలను నిర్వహించనున్నారు. నెల్లూరు జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు శర వేగంగా అడుగులు వేస్తున్నాయి. బుధవారం కిసాన్ సెజ్ ప్రాంగణంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాట్లను మంత్రులు, అగ్ర నేతలు సమీక్షించారు. జిల్లాకు దక్కిన గౌరవం సమావేశం అనంతరం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నెల్లూరు జిల్లాలోని కిసాన్ సెజ్‌ను మహానాడు వేదికగా నిర్ణయించడం జిల్లాకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. టీడీపీ చరిత్రలోనే ఈ మహానాడు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడా చిన్న లోటుపాట్లు లేకుండా, పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నామని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు. అందరినీ సమన్వయపరుచుకుంటూఈ వేడుకను దిగ్విజయం చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. కమిటీలకు దిశానిర్దేశం సన్నాహక సమావేశంలోరాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ప్రస్తుత అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కలిసి మహానాడు నిర్వహణకు సంబంధించిన వివిధ కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. విభాగాల వారీగా బాధ్యతలను కేటాయించి, సమయపాలన పాటిస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు మంత్రుల బృందం మహానాడు ప్రాంగణాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సభాప్రాంగణం, వాహనాల పార్కింగ్, భోజన వసతి వంటి అంశాలపై అధికారులకు, పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు. జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సన్నాహక సమావేశం అనంతరం ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజాప్రతినిధులు, మంత్రులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జనసమీకరణ, వసతి, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ,తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మహానాడుకు హాజరయ్యే ప్రతి కార్యకర్తకు, అభిమానికి ఆతిథ్యం ఇవ్వాలన్నారు.

# జీవన సూత్రాలు పాటిస్తే..



వయసెంత వచ్చినా నిగనిగలాడుతూ కనపడాలని ఎవరికుండదు చెప్పండి. చెప్పండి. కానీ కొంతమంది ఏళ్లు గడిచినా చిన్న వాళ్లలా కని పిస్తే.. కొందరి నేమో త్వరగా వృద్ధాప్యం పలకరిస్తుంది. ఇది వారి వంశ పారంపర్యమేమో అనుకుంటాం. కానీ కొన్ని జీవన సూత్రాలు పాటిస్తే ఎవరైనా వయసును తగ్గించుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

**చన్నీటి స్నానం :** సీజన్ ఏదైనా చల్లటి నీళ్లతో స్నానం చేస్తే వచ్చే లాభాలు అనేకం. ఇది మెటబాలిజాన్ని పెంచటమే కాదు. రక్త ప్రసరణనూ వృద్ధి చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

**ఉపవాసం..** కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఉపవాసం ఉంటూనే ఉంటాం. వారంలో ఒక రోజు తప్పనిసరి చేసుకోండి. జీర్ణవ్యవస్థకు ఇలా అప్పుడప్పుడే విశ్రాంతి నిస్తే.. చర్మంలో కొత్త కణాల వృద్ధి జరుగుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలూ త్వరగా ఏర్పడవు. అలానే మైండ్‌ఫుల్ ఈటింగ్.. అంటే తినే ప్రతి ముద్దనీ ఆస్వాదిస్తూ తినాలట. ఇదీ మనల్ని నిత్య యవ్వనంగా ఉంచుతుంది.

**కళలతో..** మీకు డ్యాన్స్ చేసే అలవాటు ఉందా లేదా సంగీత వాద్యాలేమైనా వాయించగలరా? లేదంటే నేర్చుకోండి. ఎందుకంటే క్రమం తప్పకుండా నాట్యం చేసేవాళ్లు శారీరకంగానే కాదు..మానసికంగానూ ఫిట్‌గా తయారవుతారు. ఇక సంగీతంలో ప్రవేశం ఉంటే.. కాగ్నిటివ్ సామర్థ్యం పెరిగి, కొత్త ఆలోచనలకీ ఆస్కారం ఉంటుంది.

**కృతజ్ఞతలు చెప్పండి..** ఈ తీరు ఆశావహ దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. ఉత్సాహంగా ఉరకలు వేసే మనసు యవ్వనానికి ప్రతీకే కదా! పోనీ ఒత్తిడి లేకపోయినా ఆ ప్రభావం శరీరం మీద సానుకూల ప్రభావం చూపుతుంది. ఇదీ మేలు చేసేదే! అందుకే ఎప్పుడూ నవ్వుతూ ఉండండి. కొత్త పరిచయాలు ఏర్పరచుకోండి. నలుగురితోనూ మంచి బంధాలు వారి ఆయుష్షు పెరగటమే కాదు. వృద్ధాప్యమూ త్వరగా దరిచేరదట.

# నానబెట్టి తినాలి !



మధురమైన మామిడి పండును చూడగానే నోరూరుతుంది. అలాఅని అమాంతం దానిని దొరకపుచ్చుకుని తినేద్దామంటే కుదరదు. తినే ముందు కాసేపు నీళ్లలో నానబెట్టడం వల్ల ఆరోగ్యపరంగా బోలెడు ప్రయోజాలున్నాయి.

**ఎంతసేపు నానబెట్టాలి ?** 'ఎ', 'సి', 'ఇ', 'కె', 'బి', విటమిన్లతో పాటు ఫోలేట్.. వంటి పోషకాలు మిళితమై ఉన్న మామిడి పండ్లు రుచిలోనేకాదు ఆరోగ్యాన్ని అందించడంలోనూ మిన్నే ! ముఖ్యంగా చర్మం, జుట్టు సంరక్షణ విషయాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రయోజనాలన్నీ చేకూరాలంటే తినే ముందు వాటిని 1-2 గంటల పాటు నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు. ఒకవేళ వెంటనే తినాలనుకునే వారు కనీసం పావుగంట పాటైనా నీటిలో నానబెట్టాలట! వేసవిలో తప్ప ఇతర సీజన్లలో దొరకవని కొందమంది అమితంగా వీటిని లాగించేస్తుంటారు. దీనివల్ల శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తవుతుంది. ఫలితంగా జీర్ణ సంబంధిత సమస్యలు, ముఖంపై మొటిమలు.. వంటివి తలెత్తుతాయి. ఈ సమస్యలను దూరంగా ఉండాలంటే తినే ముందు మామిడి పండ్లను నీళ్లలో నానబెట్టాలి. తద్వారా పండ్ల నుంచి శరీరంలో వేడి ఉత్పత్తి చేసే గుణాలు తొలగిపోతాయంటున్నారు నిపుణులు.

**రసాయనాలు తొలగాలంటే...** మామిడి పండ్లు త్వరగా పండడానికి వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇలా వాడిని రసాయనాలు పండు తొక్కపై చేరతాయి. అది గమనించకుండా వాటిని ఆదరాబాదరాగా శుభ్రం చేసుకొని తీసుకుంటే.. ఆరోగ్యానికే ప్రమాదం! తద్వారా వివిధ ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలంటే తినే ముందు మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం ఒక్కటే మార్గం! తద్వారా పండు తొక్కకు అంటుకున్న రసాయనాలు తొలగిపోతాయి.

**బరువూ తగ్గచ్చు!...** మామిడి పండ్లలో ఉండే ఫైటోకెమికల్స్, బయోయాక్టివ్ సమ్మేళనాలు కొవ్వు కణాలు కొవ్వు సంబంధిత జన్యువులపై ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలో మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం వల్ల ఈ సమ్మేళనాల గాఢతతగ్గి, శరీరానికి హానికరమైన కొవ్వుని కరిగించడంలో తోడ్పడుతాయి. తద్వారా బరువూ అదుపులో ఉంచుకోవచ్చు. ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు. అయితే బరువు తగ్గాలంటే మాత్రం పండ్లను షేక్స్, స్మూతీస్ రూపంలో కాకుండా నేరుగా తినడమే మంచిది.

**చిట్కా:** ✦ మైదా పిండి గోధుమ పిండికీ పురుగుపట్టకుండా ఉండాలంటే నాలుగు స్పూనుల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి. ✦ ఫ్లాస్క్ వాడనప్పుడు దానిలో పావు చెమ్చా పంచదార వేయండి దుర్వాసన రాదు

# వ్యథ
# మానసిక ఒత్తిడిని గెలిచేదెలా ?

**ప్రశ్న:** నేను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నాను. ఆందోళన, నిద్రలేమితో బాధపడుతున్నాను. ఇప్పుడిప్పుడే డిప్రెషన్ కూడా వస్తున్నట్టు అనిపిస్తోంది. నా వయస్సు 40 సంవత్సరాలు. నేను, నా భర్త ఇద్దరం ఉద్యోగులు. మాకు ఇద్దరు పిల్లలు. మానసిక ఒత్తిడి తగ్గడానికి ఏమైనా మందులు ఉంటే సూచించండి.' **- ఒక సోదరి, బెంగళూరు**

**జవాబు:** అమ్మా, నిజానికి 'మానసిక ఒత్తిడిని పూర్తిగా తొలగించే" ప్రత్యేకమైన మందులు లేవు. ఎందుకంటే ఒత్తిడి అనేక కారణాల వల్ల కలుగుతుంది. అయితే ఒత్తిడి వల్ల వచ్చే ఆందోళన, నిద్రలేమి, డిప్రెషన్ వంటి లక్షణాలకు మాత్రం మంచి చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైతే సైకియాట్రిస్ట్ పరీక్షించి తగిన మందులు సూచిస్తారు. అలాగే జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా కూడా ఒత్తిడిని చాలా వరకు తగ్గించుకోవచ్చు. క్రమమైన వ్యాయామం, యోగా, ధ్యానం, సరైన నిద్ర, కుటుంబ సభ్యులతో సత్సం బంధాలు, ఇష్టమైన పనులకు సమయం కేటాయించడం వంటి విషయాలు మానసిక ప్రశాంతతకు సహాయ పడతాయి. ఒత్తిడి ఎక్కువైనప్పుడు శరీరం, మనసు, ప్రవర్తనలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. టెన్షన్, భయం, చిరాకు, కోపం పెరగడం, ఏకాగ్రత తగ్గడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది కలగడం వంటి మానసిక లక్షణాలు ఉంటాయి. అలాగే తలనొప్పి, మెడ-భుజాలు బిగుసుకుపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అలసట, నిద్రలేమి, జీర్ణ సమస్యలు, ఆకలి మార్పులు వంటి శారీరక లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొంతమంది ఒంటరిగా ఉండాలనుకోవడం, పని మీద ఆసక్తి తగ్గడం, ఎక్కువగా టీ-కాఫీ తాగడం, ఫోన్ లేదా సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం, కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడడం వంటి ప్రవర్తనా మార్పులు కూడా చూపిస్తారు. ఈ లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే నిరక్ష్యం చేయకూడదు. సాధారణ ఒత్తిడి కొంతకాలానికి తగ్గిపోతుంది. కానీ వారాల తరబడి కొనసాగితే అది యాన్సైటీ డిసార్డర్ లేదా డిప్రెషన్ వైపు వెళ్లే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో తప్పకుండా మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించాలి. మీ ఒత్తిడికి అసలు కారణం ఏమిటో ముందుగా గుర్తించండి. పని భారం, కుటుంబ సమస్యలు, ఆర్థిక లేదా ఆరోగ్య సమస్యలు ఏవైనా కారణాలు ఉండొచ్చు. సమస్యను గుర్తిస్తే పరిష్కారం కూడా సులభమవుతుంది. అవసరమైతే ఒకసారి సైకాలజిస్ట్‌ను కలిసి కౌన్సెలింగ్ తీసుకోండి. సరైన సహాయం తీసుకుంటే మానసిక ఒత్తిడిని ఖచ్చితంగా తగ్గించుకోవచ్చు.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# దాహం తీర్చిన సాయి

**ఒకసారి నానా సాహెబ్** చండోర్కర్ ఆఫీసు పనిమీద ఒక గ్రామానికి వెళుతూ దారిలో ఉన్న హరిశ్చంద్ర గుట్టను దాటవలసి వచ్చింది. కార్యాలయ సిబ్బందితో గుట్ట ఎక్కుతున్నాడు నానా సగం దూరం ఎక్కేసరికి మధ్యాహ్నమైంది. అది మండు వేసవి నడి నెత్తిన సూర్యుడున్నాడు. నానాకు గొంతుక పిడచకట్టుకుపోయింది. ఆయన అనుచరులంతా దగ్గరలో నీరు ఏమైనా లభ్యమవుతుందేమోనని చూచారు. కానీ, ఫలితం లేదు. నానా తీవ్ర దాహంతో ఉన్నాడు ఏమి చేయటానికి దిక్కుతోచలేదు. నానకు తన ఆరాధ్య దైవమైన సాయి గుర్తుకు వచ్చాడు. వెంటనే సాయిని మనసారా ప్రార్థించాడు. భక్తులందరకు తమ ఇష్ట దైవాలు సమయానికి సహాయం చేస్తారు. ఈ సంగతి నానాకు తెలుసు. నర్సీ మెహతా హుండీని భగవానుడు గౌరవించాడు. ఏకనాథుని కోసం వంటలవాని రూపాన్ని దాల్చాడు రంగనాథుడు. దామాజీని కాపాడటం కోసం, విఠూ మహర్‌గా అవతరిం చాడు పాండురంగడు. నానా సాయిబాబా ఇక్కడ ఉంటే బాగుండును అన్నాడు. ఆయన అనుచరులలో కొందరికి రుచించలేదు, ఆ మాట. అదే సమయానికి షిరిడీలో తన ప్రక్కన కూర్చున్న శ్యామాతో సాయి నానా ఆపదలో ఉన్నాడు అన్నాడు. సరిగ్గా అదే సమయానికి కట్టెల మోపు నెత్తిన పెట్టుకున్న భిల్లుని. 'నీవు కూర్చున్న బండ క్రింద' అని జవాబి చ్చాడు ఆ భిల్లుడు. ఆ బండను తొలగించగానే స్వచ్ఛమైన నీరు ఎగజిమ్మింది. నీటిని తృప్తిగా త్రాగి నడక సాగించాడు నానా తన పరివారంతో. కొంత కాలానికి షిరిడీకి వెళ్లాడు నానా. ఫలాన రోజున, ఫలానా సమయంలో ఏదైనా ఆపదలో ఉన్నారా? అని ప్రశ్నించాడు నానాను శ్యామా. వివరాలు చెప్పాడు నానా. నీటి జాడ చెప్పిన భిల్లుడు సాయే అని అప్పుడు తెలిసింది నానకు. సాయి నానాకు భౌతిక దాహాన్ని తీర్చాడు నీటి జాడను చూపి, ఆధ్యాత్మిక దాహాన్ని కూడా తీర్చాడు గీతార్థాన్ని తెలిపి.

# హృదయ స్పందన రాగం..



కొన్ని పాటలు శరీరంలో పులకలు తెప్పిస్తాయి. మరికొన్ని చల్లటిగాలేదో చుట్టుముట్టిన భావనని కలిగిస్తాయి. కొన్ని వ్యక్తం చేయలేని శోకాన్నేదో కలిగిస్తే.. మరికొన్ని తెలియని ఆనందాన్ని పుట్టిస్తాయి. ఎందుకు జరుగుతోందిలా? అన్న ప్రశ్నకి సంగీతం మనసులో తెచ్చే స్పందనలే ఇందుకు కారణమని చెబుతూ వచ్చారు ఇంతకాలం. కానీ ఒక్క మనసే కాదు శరీరమూ సంగీతానికి రకరకాలుగా స్పంది స్తోందని తాజాగా తేల్చారు శాస్త్రవేత్తలు. ఇందుకోసం528 మందితో ఓ అధ్యయనం నిర్వహించారు. వాళ్లకి వినిపించడానికి కొన్ని వాయిద్య సంగీత భాగాల్ని ఎంచుకున్నారు. వాళ్ల ముందు మానవ శరీరభాగాలతో ఉన్న టచ్‌స్క్రీన్ బొమ్మని ఉంచారు. ప్రతిసారీ సంగీతాన్నీ విన్న పది సెకన్ల తర్వాత వాళ్ల శరీరంలో ఏ భాగం స్పందిస్తోందో దాన్ని టచ్‌స్క్రీన్‌లోని బొమ్మని తాకి చెప్పమ న్నారు. దాదాపు అందరూ కొన్ని పాటలతో తమ హృదయ స్పందన పెరుగుతోందనీ, మరికొన్నింటితో ఉదరభాగంలో ఏదో కదులుతున్నట్టు భావించామనీ చెప్పారట! దీన్నిబట్టి సంగీతం అన్నది మనసుపైనే కాదు శరీరంమీదా ప్రభావాన్ని చూపుతోందని తేల్చారు శాస్త్రవేత్తలు. ముఖ్యంగా పాట మొదలైనప్పటి నుంచీ చివరిదాకా సాఫీగా సాగే మెలడీ ఉదర(గట్) భాగాల్లో అవ్యక్తాన ుభూతికి కారణమైతే.. అక్కడక్కడా మలుపులున్న సంగీతం హృదయ స్పందనల్నీ పెంచుతోందని విశ్లేంచారు.

# తెర



## 'హ్యాపీ జర్నీ' ఫస్ట్ లుక్ రిలీజ్

కూడా లేవు. షూటింగ్ కూడా అంత ఈజీ కాదని అర్థమైంది. ఈ మూవీ కోసం వెయిట్ కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇకపై ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్‌లకు బ్రేక్ ఇస్తాను. నేను ఈ చిత్రంలో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఇందులో ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది.

గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా 'హ్యాపీ జర్నీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మహిళా భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ రూపొందుతోంది. బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత .ఏడుగురు మహిళల భావోద్వేగ ప్రయాణాలను ప్రధానంగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం చేస్తోంది. అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీ దండమూడి, వంశీధర్ గౌడ్, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రతి పాత్రను ఎంతో సహజంగా, భావోద్వేగాలకు దగ్గరగా తీర్చిదిద్దారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ప్లెజెంట్‌గా, ఫీల్‌గుడ్ ట్రావెల్ వైబ్‌ను అందిస్తోంది. పారిస్‌లోని ప్రసిద్ధ లూవ్రే పిరమిడ్, ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్, సాఫ్ట్ సన్‌సెట్ బ్యాక్‌డ్రాప్ మధ్య భిన్న తరాల మహిళలు, కొంతమంది యువకులు కలిసి కనిపిస్తున్న తీరు, స్నేహం, ఆప్యాయత, జీవితాన్ని ఆస్వాదించే జర్నీని అందంగా ప్రతిబింబిస్తోంది. కథ యూరప్‌లోని పారిస్, మాంట్‌పెలియర్ వంటి అందమైన ప్రదేశాల్లో సాగనుంది.

## 'దూరదర్శని' అందరి సొంతూరి కథ : హీరో సువిక్షిత్



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహా మూవీ మేకర్స్ పతాకంపై జయశంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది.

**మీ నేపథ్యం ఏమిటి?**
కడప జిల్లా రాయచోటి. నాకు వ్యాపారం ఉంది. చిన్నప్పటి నుండి సినిమాలంటే పాషన్.. సినిమాలను చూసి ఇన్‌స్పైర్ అయ్యే వాడిని. అనుకోకుండా ఈ సినిమా ద్వారా హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను.

**ఈ సినిమాలోకి హీరోగా ఎలా అవకాశం వచ్చింది?**
రచయిత నారాయణ, అరుణాచలంలో కలిసిన ఓ యాచకుడి జీవిత గాథ ఆధారంగా ఈకథను అనుకుని రాసుకున్నారు. అయితే మొదట ఈ సినిమాను వేరే హీరోతో చేద్దామని ప్లాన్ చేశాం. అయితే కథకు కొత్త హీరో అవసరం కాబట్టి నాకున్న ఇంట్రెస్ట్‌తో. ఆ పాత్రకు నేను సెట్ అవుతానని భావించి కథానాయకుడిగా నేనే నటించాను.

**మిమ్ములను మీరు ఈ కథ కోసం ఎలా మోల్డ్ చేసుకున్నారు?**
ఈ కథను నేను కూడా విన్నాను. 90 బ్యాక్ డ్రాప్‌లో నడిచే ఈ కథలో లీడ్ పాత్రకు అప్పట్లో ఎలాంటి అనుభూతి పొందామో తెలుసుకుని నటించాలి. ఆ అనుభూతి పొందిన వారిలో నేను కూడా ఉన్నాను. అందుకే నేనే చేస్తే సహజంగా ఉంటుందని భావించాను.

**రిలీజ్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారా?**
మేము ఏదో తక్కువ థియేటర్స్‌లో రిలీజ్ చేద్దాం అనుకున్నాను. ఇప్పుడు దాదాపుగా 250పైగా థియేటర్స్ లో విడుదల చేస్తున్నాం.

**సినిమాలో హీరో , హీరోయిన్ చనిపోతారు అంటున్నారు? ఆ పాయింట్‌ను ఎందుకు రివీల్ చేశారు?**
హీరో, హీరోయిన్ చనిపోయిన తరువాత హ్యాపీ ఎండింగ్ ఎలా ఇచ్చాం. అసలు అరుణాచలంలోకి ఆ పెద్దాయన ఎలా వచ్చాడు? ఆయన జీవితంలో జరిగింది ఏమిటి అనేది కథ. సినిమాలో హీరో ఫాదర్‌గా ఆ పెద్దాయన పాత్ర కనిపిస్తుంది. 90లో ప్రతి ఒక్కరూ వాళ్ల ఊరిలో తిరిగొచ్చిన ఫీల్ కలుగుతుంది.

**ఈ సినిమా వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ ఏలా ఉంది?**
ప్రతి సినిమాకు ఉండే కష్టాలు మాకు ఉన్నాయి. అయితే ఆర్టిస్టులు, టెక్నిషియన్స్ అందరూ సపోర్ట్ చేశారు. కానీ ఈ రోజు సినిమాను విడుదల వరకు తీసుకరావడం మేము సాధించిన విజయంగా భావిస్తున్నాం.

**90వ దశకం బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకోవడానికి రీజన్ ఏమిటి?**
సిటీకి అలవాటు పడి అందరం మన మూలాలను, పల్లెటూర్లను మర్చిపోతున్నాం. అందుకే అందర్ని వెనక్కి తీసుకెళ్లి జ్ఞాపకాలు గుర్తుకు తెస్తున్నాం. ఈ సినిమా చూసిన వారికి వాళ్ల సొంతూరు గుర్తుకొస్తుంది.

**సినిమా టిక్కెట్‌తో పాటు కర్చీఫ్ ఇస్తామని అంటున్నారు?**
ఈ సినిమా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. ఈ సినిమాలో ఎమోషన్ చూసి ఎడ్వకుండా ఎవ్వరూ ఉండలేరు.

**హీరోగా కంటిన్యూ చేస్తారా?**
తప్పకుండా మంచి కథలతో సినిమాలు చేయాలని ఉంది.

## థియేటర్ల మనుగడ కోసం 'పర్సెంటేజ్ షేరింగ్' విధానం



ఇది ఎగ్జిబిటర్ల బ్రతుకు పోరాటం. సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ కోసం అందరికీ సమానంగా వర్తించే 'పర్సెంటేజ్ షేరింగ్" విధానాన్ని అమలు చేయవలసిందిగా మనవి చేస్తున్నాము: ప్రెస్ మీట్ లో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిరక్షణ, కొనసాగింపుకు సంబంధించి ప్రతిపాదిత"పర్సెంటేజ్ షేరింగ్ విధానం" అమలుపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు తెలంగాణ ఎగ్జిబిటర్ సభ్యుల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు చదలవాడ శ్రీనివాస్, శిరీష్ రెడ్డి, సునీల్ నారంగ్‌తో పాటు పలువురు ఎగ్జిబిటర్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కీలక అంశాలు, నిర్ణయాలను వెల్లడించారు. మీడియా సమావేశంలో చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక నిర్మాతగా మాట్లాడాలంటే నిర్మాత తండ్రి అయితే, ఎగ్జిబిటర్ బిడ్డలాంటివాడు. అలా చూసినప్పుడే సినిమా ఇండస్ట్రీ బాగుంటుంది. తండ్రి ఎంత కష్టపడినా బిడ్డల సుఖం కోసమే. గత 20 ఏళ్లుగా ఎగ్జిబిటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి గిట్టుబాటు లేక, ఆదరణ లేక పరిస్థితులు క్షీణించాయి. గత ఏడాది నుంచి పరిస్థితి మరింత దిగజారింది. నిర్మాత శిరీష్ రెడ్డి మాట్లాడుతూ.. మేము పర్సెంటేజ్ విధానం గురించి మాట్లాడుతున్నామంటే ఇది ఎగ్జిబిటర్ల బ్రతుకుపోరాటం. ఏ సినిమాను టార్గెట్ చేసి గానీ, ఏ నిర్మాతను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో గానీ ఇది చేయడం లేదు. థియేటర్లను రక్షించండి. కామర్స్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ.. పర్సెంటేజ్ విధానం కోసం మేము 2008 నుంచే పోరాడుతున్నాం. చివరిగా 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల సమయంలో కూడా పర్సెంటేజ్ అమలు చేస్తామని చెప్పారు. కానీ అది జరగలేదు. మేము థియేటర్లు బంద్ చేస్తున్నామని అసత్య ప్రచారం చేశారు. మేము థియేటర్లు బంద్ చేయడం లేదు. ఎవరైతే పర్సెంటేజ్ ఇస్తారో వాళ్ల సినిమాలను ప్రదర్శిస్తామని చెబుతున్నాం.

## 'గుర్తింపు' ట్రైలర్ విడుదల




గంగా ఎంటర్టైన్మెంట్స్, స్వస్తిక్ విజన్స్ సంయుక్త నిర్మాణంలో కేజేఆర్ హీరోగా తెరకెక్కిన 'గుర్తింపు' ట్రైలర్ విడుదల..స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా గంగా ఎంటర్టైన్మెంట్స్, స్వస్తిక్ విజన్స్ సంయుక్త నిర్మాణంలో కేజేఆర్ హీరోగా ఎస్కే ప్రశాంత్, అజిత్ బాస్కర్, అరుణ్ మురుగన్ నిర్మించిన చిత్రం 'గుర్తింపు'. ఈ మూవీకి జె.పి. తెన్ పతియాన్ దర్శకత్వం వహించారు. దేశంలోని క్రీడా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ పనితీరు, పేదలు క్రీడలకు ఎంత దూరంలో ఉన్నారు అనే విషయాల్ని ఇతివృత్తంగా తీసుకుని 'గుర్తింపు' సినిమాని తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. క్రికెట్ మన నేషనల్ గేమ్.. 'హాకీ మన నేషనల్ గేమ్'.. 'మన దేశానికి నేషనల్ గేమ్ అనేదే లేదు', 'మీరందరూ చూసే పది సెకన్లు కాదు సార్ నా జీవితం.. దాని వెనకాల నా 29 ఏళ్ల జీవితం, శ్రమ ఉంది సర్.. మీట్‌కి వెళ్తే గెలుస్తాం.. కానీ అక్కడి వరకు వెళ్లలేక పోతున్నాం' 'మనలాంటి వాళ్లకి గేమ్ మామూలు విషయం కాదు.. అదే మనకు విడుదల','స్పోర్ట్స్ అని కొడితే క్రికెట్ గురించి మాత్రమే న్యూస్ వస్తుంది', దేశం కోసం పోరాడే వాళ్లకి మాత్రమే కాదు.. క్రీడాకారులకి కూడా ఎంతో రుణపడి ఉంటుంది, ఈ ట్రైలర్‌ను గమనిస్తే ఓ పేదవాడు అథ్లెటిక్‌గా ఎదిగే క్రమంలో ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొ న్నాడు.. ఈ ప్రయాణంలో క్రీడశాఖమంత్రిని కోర్టు మెట్లు ఎందుకు ఎక్కించాడు.. అసలు అతనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమస్యలు వచ్చాయి.. కోర్టులో కోరుకున్న న్యాయం దక్కిందా? లేదా? అనే ఉత్సుకత కలిగించేలా ట్రైలర్‌ను కట్ చేశారు. విజువల్‌గా, సౌండింగ్ పరంగా ట్రైలర్ అదిరిపోయింది. హీరోగా కేజేఆర్ లుక్స్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, పర్ఫామెన్స్ ఈ ట్రైలర్‌లో అదిరిపోయింది. ఈ మూవీని జూన్‌లో విడుదల చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## మే 15న వస్తున్న 'ముసలోడికి దసరా పండుగ'



నాన్‌స్టాప్ నవ్వులు పండించడానికి టాలీవుడ్ తెరపైకి ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైన్మెంట్ మూవీ రాబోతోంది. రాజీ నాయుడు సీతమ్మ వాళ్లె ఆశీస్సులతో రమణా ఫిలిమ్స్ బ్యానర్‌పై యువ నిర్మాత రమణ వాళ్లె నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం "ముసలోడికి దసరా పండుగ" విలక్షణ నటుడు నాజర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ఈ శుక్రవారం (మే 15న) థియేటర్‌లలో విడుదల కాబోతోంది. ఇప్పటికే ట్రైలర్ ప్రచార చిత్రాలతో భారీ అంచనాలు అందుకున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత రమణ వాళ్లె మాట్లాడుతూ.. "ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే రెండు గంటల పాటు కష్టాలన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. సినిమా అవుట్‌పుట్ పట్ల మేము చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుందని నమ్మకంగా చెప్పగలం. ఈ సినిమాను మా పితృ సమానులు దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు అంకితమిస్తున్నాం" అని తెలిపారు. చాలా కాలం తర్వాత తెలుగు తెరపైకి ఫ్యామిలీ ఎమోషన్స్, ఫుల్ లెంగ్త్ కామెడీతో రాబోతున్న ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## బ్లాక్ బస్టర్'శంబాల' కాంబో రిపీట్



బ్లాక్ బస్టర్ 'శంబాల' కాంబో రిపీట్.. బృందా రవీందర్ దర్శకత్వంలో ఆది హీరోగా షైనింగ్ పిక్చర్స్, యగంధర్ ముని నూతన చిత్రం..సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ శంబాల్‌తో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభి మోజు, దర్శకుడు యుగంధర్ ముని, హీరో ఆది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలిచారు. శంబాల లాంటి మరో వినూత్నమైన కథాంశంతో వీరంతా కలిసి ఓ ప్రయోగం చేయబోతోన్నారు. యుగంధర్ ముని సమర్పణలో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలైన మహిధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు ఆదితో మరో సినిమాని నిర్మించనున్నారు. ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహించను న్నారు. శంబాల తరువాత మళ్లీ ఆ స్థాయిలో సినిమాని నిర్మించాలని వీరంతా కలిసి కథాన్వేషణలో పడ్డారు. ఇక అద్భుతమైన కథ తోడవ్వడంతో వీరంతా కలిసి ముందుకు వచ్చారు. ఎమోషన్స్‌తో పాటుగా ఈ సారి హారర్ ఎలిమెంట్స్‌ను సరికొత్తగా చూపించబోతోన్నారు. భయం, ఉత్కంఠ, అన్ లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్, ఎమోషన్స్‌తో భారతీయ తెరపై మునుపెన్నడూ చూడని ఒక అద్భుతమైన అను భూతిని అందించేందుకు టీం సిద్ధమైంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ అదిరి పోయింది. ఈ పోస్టర్‌లో ఆది సాయి కుమార్ ఇంటెన్స్ లుక్, రక్తం కారుతున్న తీరు, చుట్టూ ఉన్న పువ్వులు, ఆకులు, కనిపిస్తున్న పాత కాలం నాటి స్టాంప్ ఇవన్నీ చూస్తుంటే ఓ కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకు వెళ్లేలా కనిపిస్తున్నారు.

# వెయిట్‌లిఫ్టింగ్‌లో జ్ఞానేశ్వరి జాతీయ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్ రెండవ రోజున జ్ఞానేశ్వరి యాదవ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రెండు పతకాలను కైవసం చేసుకుంది. అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్స్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన మహిళల 53 కేజీల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తి, తన సొంత జాతీయ రికార్డు అయిన 87 కేజీలను బద్దలు కొట్టింది. ఆమె 83 కేజీలు, 86 కేజీలు, మరియు 88 కేజీల బరువులతో స్నాచ్ ప్రయత్నాలు చేయగా, చివరి విజయవంతమైన లిఫ్ట్‌తో 95 కేజీలు నమోదు చేసిన చైనాకు చెందిన జావో జిన్లాన్ వెనుక నిలిచింది. క్లీన్ అండ్ జర్క్ విభాగంలో జ్ఞానేశ్వరి తన తొలి ప్రయత్నంలో 103 కిలోల బరువును విజయవంతంగా ఎత్తింది. ఆ తర్వాత ఆమె తన రెండవ ప్రయత్నంలో 106 కిలోల బరువును ఎత్తడానికి ప్రయత్నించగా, అది మొదట విజయవంతమైనట్లు కనిపించినప్పటికీ, న్యాయనిర్ణేతలు దానిని విఫలమైనదిగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని భారత జట్టు సవాలు చేసినప్పటికీ, తీర్పులో ఎలాంటి మార్పు రాలేదు. జ్ఞానేశ్వరి 106 కిలోల బరువుతో తన చివరి ప్రయత్నానికి తిరిగి వచ్చి, ఆ లిఫ్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసి, మొత్తం 194 కిలోల (88 కిలోలు+106 కిలోలు) లిఫ్ట్‌తో పోటీని ముగించింది. ఆమె మొత్తం స్కోరుతో మహిళల 53 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ప్రారంభ రోజున మహిళల 48 కేజీల విభాగంలో కోమల్ కోహర్ పతకం సాధించిన తర్వాత, జ్ఞానేశ్వరి గెలుచుకున్న పతకాలతో ఈ ఛాంపియన్‌షిప్‌లలో భారత్‌కు రెండవ మరియు మూడవ పతకాలు లభించాయి.

# ఆసియా బాక్సింగ్‌లో ఫైనల్స్‌కు 8 మంది మహిళా బాక్సర్లు

## మరో నలుగురికి కాంస్యాలు




**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ 2026లో భారత అండర్17 మహిళల విభాగంలో ఎనిమిది మంది బాక్సర్లు ఫైనల్స్‌కు చేరుకోగా, నలుగురు బాక్సర్లు కాంస్య పతకాలతో ముగించారు. అలాగే పురుషుల విభాగంలో లక్షయ్ ఫైనల్‌కు చేరగా, మరో నలుగురు కాంస్యాలు సాధించారు. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన బాలికల విభాగంలో రాఖీ (46 కేజీలు) యాటింగ్ జాంగ్ (చైనా) పై మూడవ రౌండ్‌లో గెలుపొందింది. ఖుషీ చంద్ (48 కేజీలు) ముంగుంజుల్ అల్తమ్‌గదాసపై (మంగోలియా) 5-0 తేడాతో ఆధిపత్య తెచ్చుకుంది. నవ్య (57) దాగీమా చులుతుమూర్ (మంగోలియా)పై రెండవ రౌండ్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. 60 కేజీల బౌట్‌లో ఇషికా బాలిమ్ గాబిట్కిజీ (కజకిస్తాన్) తో జరిగిన పోరులో 2-3 తేడాతో ఓడిపోయింది.

దియా (63) జియాఎన్ సాంగ్ (చైనీస్ తైపీ)పై మొదటి రౌండ్‌లోనే విజయాన్ని సాధించింది. హర్నూర్ కౌర్ (66) అయౌలిమ్ ఒస్పనోవా (కజకిస్తాన్) చేతిలో 0-5 తేడాతో ఓడిపోగా, హిమాన్షి (70) జూడ్ (హబీజోర్డాన్) పై, జ్యోతి (75) చెందిన చెంగ్‌హుయ్ జౌ (చైనీస్ తైపీ)పై మొదటి రౌండ్‌లో గెలుపొందారు. వంశిక (80) ఫెరుజాబోను కమోలోవా (ఉజ్బెకిస్తాన్) పై 4-1 తేడాతో ఘన విజయం నమోదు చేసింది. పురుషుల 75 కేజీల విభాగంలో లక్షయ్ ఫోగట్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి కొరియాకు చెందిన సియోంగ్మిన్ లీని 5-0 తో ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నాడు.

# థాయ్‌లాండ్ ఓపెన్‌లో సింధు, శ్రీకాంత్ విజయం

## ఆయుష్, తరుణ్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ విజయంతో రెండో రౌండ్‌కు చేరుకోగా, వర్ధమాన ఆటగాడు ఆయుష్ శెట్టి హోరాహోరీగా పోరాడి ఓటమితో టోర్నమెంట్ నుండి నిష్క్రమించాడు. బ్యాంకాక్‌లో బుధవారం జరిగిన ఈ టోర్నీలో మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధు తన తొలి రౌండ్ పోరులో కేవలం 33 నిమిషాల్లోనే చైనీస్ తైపీకి చెందిన తుంగ్ సియోటాంగ్‌ను 21-9, 21-12 తేడాతో చిత్తు చేసింది. ఇక ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ఫైనల్‌కు రీమ్యాచ్‌గా జరిగిన పోరులో సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూను 21-14, 21-15 తేడాతో ఓడించి, శ్రీకాంత్ అద్భుతమైన ప్రదర్శనతో రౌండ్ ఆఫ్ 16లోకి దూసుకెళ్లాడు. అయితే, ఆయుష్ శెట్టి



మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు తీసుకువెళ్లినప్పటికీ, జపాన్‌కు చెందిన ఆరో సీడ్ కోడై నరవోకపై ఆ ఊపును కొనసాగించలేక పోయాడు. 2-1 అనుకూలమైన హెడ్‌టు హెడ్ రికార్డుతో మ్యాచ్‌లోకి ప్రవేశించిన ఆయుష్ తొలి గేమ్‌లో ఓటమి తర్వాత పుంజుకుని, స్కోరును 1-1తో సమం చేశాడు. కానీ మూడవ గేమ్‌లో ఏకపక్షంగా నరవోక 59 నిమిషాల్లో 21-13, 17-21, 21-4 తేడాతో విజయాన్ని అందుకున్నాడు. మరోవైపు, యువ క్రీడాకారిణి ఉన్నతి హూడా, స్థానిక క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌ను 11-21, 21-17, 21-16 తేడాతో ఓడించింది. అలాగే 19 ఏళ్ల అన్మోల్ ఖర్బ్ ప్రస్తుత ఛాంపియన్ చెన్ యు ఫేను ఓడించడంలో విఫలమయింది. తొలి గేమ్‌ను గెలుచుకుని, నిర్ణయాత్మక గేమ్‌లో 11-2 ఆధిక్యం సాధించినప్పటికీ, చెన్ మరింత తీవ్రత పెంచడంతో అన్మోంల్ ఓటమి చెందింది. ఇక జపాన్‌కు చెందిన కోకి వతనాబే చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోవడంతో మన్నేపల్లి తరుణ్ ప్రయాణం ముగిసింది.



# రివర్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్

## 65.7 శాతానికి పడిపోయిన ప్లేఆఫ్స్ ఛాన్స్

**న్యూఢిల్లీ:** శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపుగా ఖరారు చేసుకుంది. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై సాధించిన అద్భుతమైన 82 పరుగుల విజయం ఆ జట్టుకు కీలకమైన 16 పాయింట్లను తెచ్చిపెట్టింది. సాధారణంగా 12మ్యాచ్‌లలో 16పాయింట్స్‌ను ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారుచేసుకునే మేజిక్ నంబర్‌గా పరిగణిస్తారు. ఈగెలుపుతో ఇతరజట్ల ప్లేఆఫ్స్ అవకాశాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించే అవకాశాలు 94.9 శాతానికి పెరిగాయి. దీనికి భిన్నంగా సన్ రైజర్స్ అవకాశాలు 80% నుంచి 65.7శాతానికి పడిపోయాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్ అవకాశాలు80.1%నుంచి79.7శాతానికి తగ్గగా, చెన్నై సూపర్ కింగ్స్ అవకాశాలు స్వల్పంగా 42.7 శాతం నుంచి 42.8 శాతానికి పెరిగింది. నాలుగో స్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్ ఛాన్సెస్ కూడా 62.5% నుంచి 62.7 శాతానికి పెరిగాయి. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను అధిగమించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుత స్థానం చూస్తే 11 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో (14 పాయింట్లు) పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల్లో కొనసాగుతోంది. సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే మరిన్ని విజయాలు అవసరం ఉంటుంది. ఇక సన్‌రైజర్స్‌కు మిగిలి ఉన్న 3 మ్యాచ్‌లలో కనీసం 1లేదా 2గెలిస్తే, ఎలాంటి డోకాలేకుండా ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. అయితే ఈ మ్యాచ్‌ల్లో గట్టి పోటీ ఎదురుకానుంది. గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులతో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా సేఫ్ జోన్‌లో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక అంశాల్లో ప్రధానంగా +0.737తో మెరుగైన నెట్ రన్ రేట్‌తోఉంది. ఇది పాయింట్లుసమానంగా ఉన్నప్పుడు ప్లేఆఫ్స్ రేసులో చాలా సహాయపడుతుంది. ముఖ్యమైన మ్యాచ్‌లు చూస్తే గుజరాత్‌తో జరిగిన మ్యాచ్ వంటి కీలక పోరులు సన్‌రైజర్స్ స్థానాన్ని నిర్ణయిస్తాయి. సన్‌రైజర్స్ తన ఫామ్‌ను కొనసాగిస్తే, టాప్2 లేదా టాప్4లో క్వాలిఫై కావడం దాదాపు ఖాయం అవుతుంది.

# పాక్ ఘోర ఓటమి

## 104 రన్స్‌తో బంగ్లాదేశ్ చరిత్రాత్మక విజయం

**న్యూఢిల్లీ:** రెండు టెస్టుల సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో 104 పరుగుల తేడాతో విజయం సాధించిన బంగ్లాదేశ్ తమ స్వదేశంలో పాకిస్థాన్‌పై మొట్టమొదటి టెస్టు విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. ఢాకాలో జరిగిన ఈ మ్యాచ్‌లో 268 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ను వారి రెండవ ఇన్నింగ్స్‌లో 163 పరుగులకే ఆలౌట్ చేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని సాధించింది. బంగ్లాదేశ్ అంతకు ముందు తమ తొలి ఇన్నింగ్స్‌లో 413 పరుగులు




చేసి రెండో ఇన్నింగ్స్‌ను 240/9 వద్ద డిక్లేర్ చేసింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులు చేసినప్పటికీ నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైంది. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హోస్సెన్ శాంటో ఇన్నింగ్స్‌లో 130 బంతుల్లో 101 పరుగులతో చిరస్మరణీయ ప్రదర్శన చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 87 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో పాక్ ప్లేయర్ అజాన్ అవైస్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించగా, మహ్మద్ రిజ్వాన్ (59), సల్మాన్ అలీ అఘా (58) పోరాట పటిమతో కూడిన అర్ధ సెంచరీలు సాధించాడు. అయితే చివరి ఇన్నింగ్స్‌లో బంగ్లా బౌలర్లు ఆధిపత్యం చెలాయించడంతో, ఐదవ రోజున ఆతిధ్య జట్టు మ్యాచ్‌ను సునాయాసంగా ముగించింది.

# 10% పెరిగిన ఎయిర్‌టెల్ నికరలాభం!

**ముంబయి, మే 13:** టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ నాలుగో త్రైమాసికంలో నికరలాభాలు 10శాతం పెరిగి రూ.6631కోట్లనుంచి రూ.7325 కోట్లకు చేరాయి. ప్రతికస్టమరు పైనా సగటు రాబడి మాత్రం స్వల్పంగా తగ్గింది. రూ.259 నుంచి రూ.257గా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. అదే గత ఏడాది రూ.245తో పోలిస్తే పెరిగింది. లావాదేవీలనుంచి రాబడుల 2.6శాతంపెరిగి రూ.53,982 కోట్లనుంచి రూ.55,383 కోట్లుగా ఉంది. వడ్డీ, పన్నులు తరుగుదలతో కూడిన రాబడులు రూ.30,783 కోట్లనుంచి రూ.31,492 కోట్లకు చేరాయి. ఈత్రైమాసికంలో ఇబిటిడిఎ మార్జిన్ నిలకడగా 56.9 శాతంగానే ఉంది. అదనంగా ఎయిర్‌టెల్ తుది విడత డివిడెండ్ రూ.5 విలువ ఉన్న షేరుకు రూ.24గాప్రకటించింది. రికార్డు తేదీ, అర్హులైన వాటాదారుల వివరాలనుసత్వరమే వెల్లడిస్తామని ప్రకటించింది. కంపెనీ రుణం ప్రస్తుతం రూ.1.65 లక్షలకోట్లుగా ఉంది. అదే అంతకుముందు త్రైమాసికంలోచూస్తే ఏకంగా రూ.1.83 లక్షలకోట్లుగా ఉంది. ఇండియా మొబైల్ బిజినెస్ స్థిరంగా ఉందని రూ.28,831 కోట్లకు పెరిగినట్లు కంపెనీ వివరించింది. హోంబ్రాడ్‌బాండ్ విభాగంలో ఎబిడిటా 1రూ.1100 కోట్లనుంచి రూ.2191 కోట్లుగా ఉంది. కస్టమర్ బేస్ కూడా 36.85 కోట్లనుంచి 37.32 కోట్లకుపెరిగింది. 4జి బేస్ కూడా 29.10 కోట్లనుంచి 29.68 కోట్లకు చేరింది.




# సర్వోదయ బ్యాంకు లైసెన్సు రద్దు చేసిన ఆర్బీఐ

**ముంబయి, మే 13:** కొత్త బ్యాంకుల ఆర్థిక లావాదేవీలునిర్వహణలో ఆర్బీఐ నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు పాటించని పరిస్థితుల్లో బ్యాంకులకు భారీ జరిమానా వేయడంతోపాటు అవసరమైతే లైసెన్సులను కూడా రద్దుచేస్తుంది. గ్రామీణ బ్యాంకులు, సహకారబ్యాంకులు, ప్రైవేటు వాణిజ్యబ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు అన్నింటిపైనా ఆర్బీఐకి పర్యవేక్షణాధికారాలుంటాయి. తాజాగా ముంబై ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సర్వోదయ కోఆపరేటివ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసింది. ఈ బ్యాంక్ దగ్గర తగినంత మూలధనం లేదని భవిష్యత్తులో కూడా లాభాలు గడిస్తాయన్న అంచనాలు లేవని ఈ కారణంతోనే లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు ఆర్బీఐ తెలిపింది. బుధవారం నుంచే ఈ సహకార బ్యాంకు ఎలాంటి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా ఆంక్షలు విధించింది. తమ రెగ్యులేటరీ నిబంధనల్ని పాటించని కారణంగా భవిష్యత్తులోనూ కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. ఇక్కడ చట్టపరంగా మూసివేస్తున్నందున బ్యాంక్ ఆస్తుల్ని అమ్మి అప్పులు తీర్చేందుకు లిక్విడేషన్ ప్రాసెస్‌ను ప్రారంభించాలని మహారాష్ట్ర రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్, కమిషనర్ ఫర్ కోఆపరేషన్‌ను ఆదేశించింది. ఇందుకోసం లిక్విడేటర్‌ను నియమించాలని కోరింది.




బ్యాంక్ దివాలా తీసినప్పుడు లేదా లైసెన్స్ రద్దు చేసినప్పుడు ప్రతి డిపాజిటర్‌కు బీమా రక్షణ ఉంటుంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ కింద గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకు డిపాజిట్ చేసిన వారికి డబ్బులు తిరిగొస్తాయి. ఆపైన ఎంత డిపాజిట్ ఉన్నా గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకే వెనక్కి వస్తుంది. అయితే బ్యాంక్ నివేదించిన డేటా ప్రకారం డీఐసీజీసీ కింద 98.36 శాతం వరకు డిపాజిటర్లు పూర్తి స్థాయిలో తమ డిపాజిట్లను పొందనున్నారు.

## వాణిజ్యం



# నష్టాల నుంచి కోలుకున్న సెన్సెక్స్, నిఫ్టీ!

**ముంబయి, మే 13:** దేశీయ సూచీలు వరుసగా రెండు రోజులు భారీ నష్టాలను చవిచూసిన తర్వాత బుధవారం స్వల్ప లాభాలను ఆర్జించాయి. ఉదయం భారీ నష్టాల్లో కొనసాగినా మధ్యాహ్నం కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం సూచీలకు కలిసి వచ్చింది. అలాగే అంతర్జాతీయంగా కాపర్ ధరలు పెరగడంతో మెటల్ స్టాక్స్ భారీగా లాభపడ్డాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (74,559)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు వెళ్లింది. అయితే మధ్యాహ్నం తర్వాత సూచీలు కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్ఠంతో పోల్చుకుంటే సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లు పైకి వచ్చింది. చివరకు సెన్సెక్స్ 49 పాయింట్ల లాభంతో 74,608 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 33 పాయింట్ల లాభంతో 23,412 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో సెయిల్, డిక్సన్ టెక్నాలజీస్, వొడాఫోన్ ఐడియా, వేదాంత, మనప్పురం ఫైనాన్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. మ్యాక్స్ ఫైనాన్సియల్స్, టాటా పవర్, పేటీఎమ్, కేఫిన్ టెక్నాలజీస్, ఎయిచర్ మోటార్స్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 99 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 460 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్‌కు 107 డాలర్లవద్ద ట్రేడ్ అవుతుంటే బంగారం ఔన్స్ ఒక్కింటికి 4701 డాలర్లుగా ట్రేడ్ అవుతోంది. టాటా స్టీల్ 3.63శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.78శాతం, ఎల్అండ్‌టి 1.56శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.71శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.27శాతం పెరిగాయి. మార్కెట్లపరంగాచూస్తే బిఎస్ఇలో 2407 కంపెనీలు పెరిగితే 1793 కంపెనీలు స్వల్పనష్టాలతోముగిసాయి. మరో 177 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 5.91శాతంపెరిగి రూ.1,62,512 గా ట్రేడ్ అయ్యాయి.


# పెట్రోలు, డీజిల్ ధరలు పెంచక తప్పదు!

## ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్‌మల్హోత్రా

**జెనీవా, మే 13:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచక తప్పదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధం వల్ల పెరుగుతున్న ఇంధన ధరలు దేశ ద్రవ్యోల్బణ లక్ష్యాలకు సవాలుగా మారుతున్నాయని, దీనిపై ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు. స్విట్జర్లాండ్‌లో మంగళవారం జరిగిన ఒక సదస్సులో మల్హోత్రా మాట్లాడుతూ పశ్చిమాసియా సంక్షోభం ఇలాగే కొనసాగితే, రిటైల్ ఇంధన ధరల పెంపు అనేది కేవలం సమయం మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, ద్రవ్యోల్బణం మరింత అధికమవుతుందని హెచ్చరించారు. ఆర్‌బీఐ తదుపరి ద్రవ్య పరపతి విధాన సమావేశం జూన్ 5న జరగనుందని, వడ్డీ రేట్లపై అప్పుడు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. పరిస్థితిని బట్టి మా విధానాలు ఉంటాయి. షాక్ తాత్కాలికమైతే సర్దుకుపోతాం. అది దీర్ఘకాలం కొనసాగితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. మరోవైపు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయని, ధరల పెంపు అనివార్యం కావచ్చని సూచనప్రాయంగా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటినప్పటికీ, దేశంలో ధరలు పెంచకపోవడంతో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు రోజుకు దాదాపు రూ.1,000 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని ఆయన వెల్లడించారు.



భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఇప్పటివరకు చమురు సంస్థల అండర్‌రికవరీలు రూ.1.98 లక్షల కోట్లకు చేరగా, ప్రస్తుత జూన్ త్రైమాసికంలో నష్టాలు రూ.1 లక్ష కోట్లకు దగ్గరగా ఉన్నాయని పూరి తెలిపారు. సరఫరాకు అంతరాయం కలగకుండా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, ప్రస్తుతం దేశంలో 76 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం, చమురు సంస్థలు నష్టాలు భరించడం ద్వారా ప్రభుత్వం ధరలను నియంత్రించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెంపు అనివార్యమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



# వెండి, పసిడి దిగుమతులపై సుంకాలు పెంపు!

**న్యూఢిల్లీ, మే 13:** బంగారం, వెండి కస్టమర్లకు కేంద్ర సర్కారు మళ్లీ షాకిచ్చింది. ఆ ఖరీదైన ఖనిజాలపై దిగుమతి సుంకాన్ని పెంచేసింది. బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని ఆరు నుంచి 15 శాతానికి పెంచినట్లు కేంద్రం ప్రకటించింది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దిగుమతి సుంకం గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండి సరఫరాను తగ్గించే ఉద్దేశంతో దిగుమతి సుంకాన్ని పెంచేశారు. పొదుపు చర్యల్లో భాగంగా ఓ ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నియంత్రించుకోవాలని ప్రధాని మోడీ దేశ ప్రజలకు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. విదేశీ మారకం నిల్వలను పెంచుకునే ఉద్దేశంతో ఈ చర్య తప్పదన్నారు. దీనిలో భాగంగానే బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. సుంకాన్ని పెంచడంతో ఓవరాల్‌గా బంగారంపై కస్టమ్స్ డ్యూటీ 15 శాతం పెరిగినట్లు అవుతంది. 2025-26 సీజన్‌లో బంగారం దిగుమతిలో భారత్ ఆల్ రికార్డు సృష్టించింది. 24 శాతం దిగుమతి పెరిగింది. సుమారు 72 బిలియన్ల డాలర్ల వ్యాపారం జరిగినట్లు భావిస్తున్నారు. బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం 10 గ్రాముల బంగారం రూ.లక్షా 55 వేలుగా ఉన్నది. ఇక వెండి కిలో 2 లక్షల 77 వేలుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా బంగారం అధికంగా వినియోగిస్తున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉన్నది. మొదటి స్థానంలో చైనా ఉంది.

# రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌లో ఇన్‌సైడర్‌ట్రేడింగ్ రూ.1.99 కోట్లు చెల్లించాలని సెబీ ఆదేశం

## రష్మిసలూజాపై రూ.40 లక్షల జరిమానా

**న్యూఢిల్లీ, మే 13:** రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసారని సెబీ 'సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న రెష్మీ సలూజాను దోషిగా తేల్చింది. ఈ ఇన్‌సైడర్‌ట్రేడింగ్‌లో అనుచిత లబ్దిని పొందిన రూ.1.99 కోట్లలాభాలను తిరిగి చెల్లించాలని సెబీ ఆదేశించింది. అలాగే రష్మి సలూ జాపై రూ.40 లక్షల జరిమానా కూడా విధించింది. 2023 సెప్టెంబరులో బర్మన్ కుటుంబంప్రకటించనున్న ఓపెన్ ఆఫర్‌కు సంబంధించి ముందుగా వెల్లడించిన ధరలకు ప్రభావంచూపే సమాచారం తన వద్ద ఉన్నప్పటికీ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లను సలూజా విక్రయించారని సెబీ వెల్లడించింది. సెబీ వివరాల ప్రకారం సెప్టెంబరు 25న ఓపెన్ ఆఫర్ బహిరంగ ప్రకటనకు ముందే రష్మిసలూజా 21,22 తేదీల్లో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సుమారు 12.9 లక్షల షేర్లను విక్రయించారు. దీనితో కంపెనీ షేర్ ధరలు పడిపోవడంతోసుమారు రూ.2 కోట్ల నష్టం తప్పించుకునేందుకు ఈ ట్రేడింగ్ తోడ్పడిందని సెబీ ధృవీకరించింది. ఓపెన్ ఆఫర్ బహిరంగ ప్రకటనముందే బర్మన్ గ్రూప్ ఈప్రణాళిక గురించి రష్మి సలూజాకకు సమాచారం ఇచ్చిందని ఉత్తర్వుల్లో తెలిపింది. దర్యాప్తులోభాగంగా వాట్సాప్‌సంభాషణలు, సమావేశాల రికార్డులు, హోటల్ రికార్డులు ఆధారాలుగా సెబీ చూపింది. అన్‌పబ్లిష్డ్ ప్రైసింగ్ సెన్సిటివ్ ఇన్‌ఫర్మేషన్(యుపిఎస్ఐ)తనవద్ద ఉన్న సమయంలోనే నోటీసుదారు ఆర్‌ఈఎల్ షేర్లలోట్రేడింగ్‌చేసి ఇన్‌సైడర్‌ట్రేడింగ్ నిబంధనలు ఉల్లంఘించారని సెబీ వెల్లడించింది. బర్మన్‌కుటుంబానికి ఉన్న నాలుగు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు చేసిన ఫిర్యాదు ఆధారంగా విచారణ ప్రారంభించారు. బర్మన్ కుటుంబప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఒఎఫ్ఎస్ ఆఫర్ చర్చ జరిగిన వెంటనే రష్మి సలూజా రూ.34.71 కోట్ల షేర్లను విక్రయించారని సంస్థలు ఆరోపించాయి. అలాగే 2024 మధ్యలోకూడా ఇన్‌సైడర్‌ట్రేడింగ్‌తో 27.1 లక్షల షేర్లను రూ.43 కోట్లకు విక్రయించినట్లు బర్మన్ కుటుంబం ఆరోపించింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.